అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదివారం 03-12-2023
సంపుటి : 9 సంచిక : 285 Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam, 8 పేజీలు + టాబ్లాయిడ్ 8 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00

సూర్యుడిపై అధ్యయనంలో కీలక ఘట్టం
ఆదిత్య-ఎల్ 1లో రికార్డయిన సౌరగాలులు..



- ఫొటో షేర్ చేసిన ఇస్రో

బెంగళూరు: సూర్యుడిపై అధ్యయనంలో కీలక ఘట్టం చోటుచేసుకున్నది. సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రోదసిలోకి దూసుకెళ్లిన 'ఆదిత్య-ఎల్ 1 తన ప్రయాణంలో మరో మైలురాయిని అందుకుంది. ఈ ఉపగ్రహంలోని ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ పేలోడ్ తన ఆపరేషన్స్‌ను ...7లో

నేడే ప్రజాతీర్పు
ఉదయం 8 నుంచి ఓట్ల లెక్కింపు
10 గంటలకల్లా తొలి ఫలితం ఆద్యంతం ఉత్కంఠ



- జయాపజయాలపై ఎవరి ధీమా వారిదే
- ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉద్రిక్తత
- డిఏ విడుదలకు అనుమతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఓటరు తీర్పు ఈవీఎమ్ యంత్రాల్లో నిక్షిప్తమై ఉంది. వాటిని వెల్లడించే సమయం వచ్చేసింది. ఆదివారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. 119 నియోజవర్గాల ఓట్ల లెక్కింపు 49 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్లలో జరుగుతుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. మూడంచెల భద్రత మధ్య ఉన్న స్ట్రాంగ్ రూంల నుంచి ఈవీఎమ్‌లను కౌంటింగ్ కేంద్రాలకు చేర్చారు. ఆదివారం ఉదయం రాజకీయపార్టీల ఏజెంట్ల సమక్షంలో ఆయా ఈవీఎమ్‌ల సీళ్లను విప్పి, కౌంటింగ్‌ను ప్రారంభిస్తారు. ఒక్కో ఈవీఎమ్‌లోని ఓట్లను అభ్యర్థుల వారీగా రెండుసార్లు లెక్కిస్తారు. కౌంటింగ్ కోసం మొత్తం 1,798 టేబుళ్లను ఏర్పాటు చేశారు. వీటిపై 2,417 రౌండ్లలో లెక్కింపు జరుగుతుంది. తొలి ఫలితం ఉదయం 10 గంటలకే వెల్లడి అవుతుంది. 11 గంటలకల్లా పార్టీల ట్రెండ్ తెలిసిపోతుంది. మేడ్చల్, ఎల్‌బీ నగర్, మహేశ్వరం, ...7లో

ఆ రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పూర్తి

న్యూఢిల్లీ : మూడు రాష్ట్రాల్లో ఓట్లలెక్కింపునకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. మధ్యప్రదేశ్‌లో 230, రాజస్థాన్‌లో 199, ఛత్తీస్‌గఢ్‌లో 90 స్థానాలకు ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. మిజోరం కౌంటింగ్‌ను ఆ రాష్ట్రం నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు సోమవారానికి ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్, బిజెపి మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

అసెంబ్లీ ముస్తాబు...అడుగుపెట్టేదెవరో?



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ముస్తాబవుతున్నది. కొత్తగా కొలువుదీరబోయే ప్రభుత్వం కోసం శాసనసభ సిద్ధమవుతున్నది. అసెంబ్లీ భవనానికి మరమ్మతులు చేయడం, రంగులు వేయడం వంటి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఎన్నికల ఫలితాలు రాబోతున్న నేపథ్యంలో అసెంబ్లీలో అడుగుపెట్టేదెవరోనన్న ఉత్కంఠ నెలకొంది. ప్రతి ఎన్నికలకు ముందు కొత్త ప్రభుత్వానికి స్వాగతం పలికేలా అసెంబ్లీని ముస్తాబు చేస్తారు. ఈ క్రమంలో శాసనసభ, శాసనమండలి భవనాల లోపల కూడా ...7లో

రంగంలోకి రాహుల్
అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాల్లోనే ఉండాలని ఆదేశం

- హైదరాబాద్‌కు ఢిల్లీ దూతలు
- కౌంటింగ్ సరళిని పరిశీలించనున్న నేతలు

సీఎం కేసీఆర్ కుట్రలకు యత్నం : హస్తం నేతలు

- అభ్యర్థులతో కేసీ వేణుగోపాల్ జూమ్ మీటింగ్
- ఈసీకి కాంగ్రెస్ వినతి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆదివారం అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ రంగంలోకి దిగారు. అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాల్లోనే ఉండాలని ఆయన ఆదేశించారు. గెలిచిన వెంటనే అభ్యర్థులు హైదరాబాద్‌కు చేరుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజార్టీ వస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ పార్టీ నేతలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర నేతలకు సూచించినట్టు తెలుస్తోంది. కౌంటింగ్‌కు ముందు అభ్యర్థులు ఎవరూ చేజారకూడదనే ఉద్దేశంతో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఉండేందుకు అధిష్ఠానం చర్యలు చేపట్టింది. నగరంలోని హెటల్ తాజ్‌కృష్ణలో అభ్యర్థులకు ఏఐసీసీ ప్రతినిధులు దిశానిర్దేశం చేయనున్నట్టు సమాచారం. ఈ మొత్తం వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. ఆదివారం ఉదయం ఆయన హైదరాబాద్‌కు చేరుకుంటారు. కౌంటింగ్ సరళిని పరిశీలించేందుకు ఏఐసీసీ సీనియర్ నేతలు పి చిదంబరం, సుశీల్‌కుమార్‌షిండే, సూర్జేవాలాను హైదరాబాద్‌కు ఇప్పటికే పంపించారు. మరోవైపు కాంగ్రెస్ అధికారంలోకి రానుందన్న వార్తల నేపథ్యంలో ఆ పార్టీ అప్రమత్తమైంది. తమ అభ్యర్థులపై సీఎం కేసీఆర్ కుట్రలు చేస్తున్నట్టు డీకే శివకుమార్ అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ...7లో

మా అభ్యర్థులను ట్రాప్ చేసేందుకు
కేసీఆర్ ప్రయత్నం : డీకే



రాష్ట్రంలో కాంగ్రెస్ సునాయాసంగా అధికారంలోకి వస్తుందని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలపై ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ అభ్యర్థులను ట్రాప్ చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. ఆయన స్వయంగా సంప్రదించినట్టు ...7లో

దిగిపోయే ముందు కీలక నిర్ణయాలా? : ఉత్తమ్
సీఎం కేసీఆర్‌పై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు



బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే ముందుకు సీఎం కేసీఆర్ కీలక నిర్ణయాలు తీసుకోవడం సరైందికాదని ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇదే అంశంపై శుక్రవారం ఆయనతో పాటు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, ...7లో

మోడీ సెల్ఫీ పాయింట్లు!
కళాశాలలు, యూనివర్సిటీలకు యూజీసీ లేఖలు

- ఇది నిబంధనలకు విరుద్ధం
- విద్యాసంస్థలకు సంబంధమేంటి? : నిలదీస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

విమర్శల వెల్లువ

కాగా ప్రభుత్వం ప్రతి సాధారణ విజయాన్ని ఘనమైనదిగా చిత్రీకరిస్తోందని, దానికి కారకుడిగా ప్రధాని మోడీని చూపుతోందని ఓ అధ్యాపకుడు వ్యాఖ్యానించారు. 'ఇప్పుడు జరుగుతోంది ఏమంటే ప్రధానిని ఆరాధ్యుడిగా చూపేందుకు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఇలాంటి పనులతో ఏ మాత్రం సంబంధం లేని సంస్థలను ప్రభుత్వం ఇందుకోసం వినియోగించుకుంటోంది. ఇలాంటి ప్రచారం చేయాల్సిందిగా విద్యా సంస్థలను ప్రభుత్వం కానీ, యూజీసీ కానీ కోరే నిబంధన ఏదీ చట్టంలో లేదు' అని ఆయన చెప్పారు. ఈ కార్యకలాపాలన్నింటికీ ఒకే ఒక నాయకుడు కారణమనే అభిప్రాయాన్ని వ్యాప్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటర్లను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. యూజీసీ ఇలాంటి సర్క్యులర్లు జారీ చేస్తూనే ఉంటుందని, అయితే వాటిని విస్మరించే స్వేచ్ఛ విద్యా సంస్థలకు ఉన్నదని మరో అధ్యాపకుడు తెలిపారు. అలాంటి సలహాలను విద్యా సంస్థలు పాటించాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు.



న్యూఢిల్లీ : పిచ్చి ముదిరి తలకెక్కిందన్న విధంగా ఉంది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) వ్యవహార శైలి. దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో క్యాంపస్‌లలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రం నేపథ్యంగా ఉండేలా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు యూజీసీ లేఖలు రాసింది. ఈ సంస్థ ఇటీవలే మహారాష్ట్రలోని ఉన్నత విద్యా సంస్థలకూ ఇలాంటిదే ఓ అర్థం పర్థం లేని విన్నపం చేసింది. ఆర్ఎస్ఎస్ నేత దత్తాజీ డిడోల్కర్ శత జయంతి ఉత్సవాన్ని నిర్వహించాలని అందులో సూచించింది. ఇక తాజా లేఖ విషయానికి వస్తే మోడీ చిత్రంతో కూడిన సెల్ఫీ పాయింట్ల వద్ద ఫొటోలు దిగేలా ఆయా యూనివర్సిటీలు, కళాశాలల క్యాంపస్ అధికారులు విద్యార్థులను ప్రోత్సహించాలట. విద్యా సంస్థల్లో వ్యక్తి ఆరాధనను ప్రోత్సహించేందుకు చేస్తున్న ఇలాంటి ప్రయత్నాలను పలువురు విద్యావేత్తలు తీవ్రంగా నిరసించారు. అసలు విద్యా సంస్థలకు దీనితో సంబంధం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇంతకీ యూజీసీ కార్యదర్శి మనీష్ జోషీ పంపిన ఆ లేఖలో ఏముందంటే...'యువశక్తిని, యువతలో ఉత్సాహాన్ని లోకానికి చాటేందుకు ఇదో మంచి అవకాశం. వివిధ రంగాలలో భారతదేశం సాధిస్తున్న ప్రగతి నుండి పొందిన స్ఫూర్తితో వారి మనసుల్ని నింపేసేందుకు ఇదో మహత్తర అవకాశం' అని యూనివర్సిటీలు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు శుక్రవారం రాసిన లేఖలో ఆయన సూచించారు.

'మీ సంస్థల్లో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయడం ద్వారా దేశం వివిధ రంగాలలో సాధించిన పురోగతిని ప్రచారం చేద్దాం. ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకగా నిర్వహిద్దాం. ఆయా రంగాలలో దేశం సాధించిన అభివృద్ధిపై యువతకు అవగాహన కల్పించడమే ఈ సెల్ఫీ పాయింట్ల ఉద్దేశం. ముఖ్యంగా 2020 జాతీయ విద్యా విధానంలో చేపట్టిన నూతన చర్యలను యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉంది' అని ఆ లేఖలో వివరించారు. అయితే నూతన విద్యా విధానంపై యూనివర్సిటీలు, ...7లో



మళ్లీ బాంబుల మోత..
178 మంది మృతి

- 15 వేలు దాటిన మరణాలు : పాలస్తీనా వెల్లడి

గాజా : ఇజ్రాయెల్ సైన్యం గాజాపై మళ్లీ దాడులు ప్రారంభించింది. వారం రోజుల కాల్పుల విరమణ అనంతరం ఇజ్రాయెల్ శుక్రవారం ఉదయం నుంచే దాడులు ప్రారంభించింది. మళ్లీ మొదలైన ఈ దాడుల్లో 178 మంది మృతి చెందారని, దాదాపు 589 మందికి గాయపడ్డారని గాజాలోని హమాస్ నియంత్రిత ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. అయితే తాజా దాడులకు హమాస్‌నే కారణమని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ఆరోపించింది. హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ సైనిక స్థావరాలపై క్షిపణులు ప్రయోగించారు. దీంతో మళ్లీ దాడులు ప్రారంభించడం జరిగింది అని ఐడీఎఫ్ శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా పేర్కొంది. ఇజ్రాయెల్- హమాస్ సంధి ప్రకారం.. నవంబర్ 24-30 తేదీ వరకు 80 మంది ఇజ్రాయిలీలు, 24 మంది విదేశీపౌరులను హమాస్ విడుదల చేయగా.. 240 మంది పాలస్తీనా ఖైదీదలను ఇజ్రాయెల్ సైన్యం విడుదల చేసింది. అయితే గాజాలో 17 మంది మహిళలు, పిల్లలతో సహా 136 మంది బంధీలుగా ఉన్నారని ఐఎడిఎఫ్ తెలిపింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ సైన్యం గాజాలోని నివాస ప్రాంతాలపై దాడులు కొనసాగిస్తోంది. కాగా, ...7లో

ప్రజా సమస్యలపై సవివరమైన చర్చ
అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల డిమాండ్

- నిర్మాణాత్మక చర్చకు ప్రభుత్వం సిద్ధం : మంత్రి ప్రహ్లాద్ జోషి

రేపటి నుంచి శీతాకాల సమావేశాలు

- పార్లమెంట్ ముందుకు 21 బిల్లులు..అందులో రెండు ఆర్థిక బిల్లులు



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

ధరలు పెరుగుదల, నిరుద్యోగం వంటి ప్రజా సమస్యలపై పార్లమెంటులో సవివరమైన చర్చ జరగాలని అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. సోమవారం నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభంకానున్నాయి. డిసెంబర్ 4 నుంచి 22 వరకు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. మొత్తం 19 రోజుల పాటు జరుగనున్న ఈ సెషన్‌లో 15 రోజులు ఉభయ సభలు భేటి కానున్నాయి. ఈ సెషన్‌లో ఉభయ సభల్లో మొత్తం 21 బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టనుంది. అందులో రెండు ఫైనాన్షియల్ బిజినెస్‌కు సంబంధించిన బిల్లులను తీసుకురానుంది. ఈ నేపథ్యంలో శనివారం పార్లమెంటు లైబ్రరీ భవన్‌లో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష భేటీ జరిగింది. ఈ సమావేశానికి 23 పార్టీల నుంచి 30 మంది నేతలు హాజరయ్యారు. పార్లమెంటు సమావేశాల నిర్వహణపై అఖిలపక్ష నేతలతో కేంద్రం చర్చించింది. పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేందుకు పూర్తిస్థాయిలో సహకరించాలని ప్రతిపక్షాలను కేంద్ర ప్రభుత్వం కోరింది. శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం తరపున ప్రవేశపెట్టే బిల్లుల వివరాలను అఖిలపక్ష నేతలకు కేంద్రం అందించింది. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేతలు వివిధ అంశాలను లేవనెత్తారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, బీజేపీయేతర రాష్ట్రాలపై ఆర్థిక వివక్ష తదితర అంశాలపై సవివరంగా చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌కు ప్రత్యామ్నాయంగా కేంద్ర ...7లో

కేరళపై మరోసారి కక్షకట్టిన కేంద్రం

కేరళ : కేరళ రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం మరోసారి కక్ష కట్టింది. రాష్ట్రానికి రావాల్సిన సమీకృత వస్తువులు మరియు సేవల పన్ను (ఐజీఎస్టీ) సెటిల్‌మెంట్ నుంచి రూ.332 కోట్లు కేంద్రం కోత విధించింది. కేంద్రం తీరుపై కేరళ ప్రభుత్వం ఆగ్రహించింది. ఈ కోతతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజార్చుతుందని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు ఆయన ఆర్థిక మంత్రికి



లేఖ రాశారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న హేతుబద్ధతను వివరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

ఎడతెగని పంచాయితీ



పట్టించుకోని అపెక్స్ కమిటీ

- మోడీ సర్కారు తాత్సారం
- కృష్ణాజలాల వివాదం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలుగురాష్ట్రాల మధ్య కొత్త వివాదాలు సృష్టిస్తున్నది. నాన్చి నాన్చి కొత్త సమస్యలకు ఊపిరిలూదుతున్నది. తెలంగాణలో ప్రధానంగా రెండు బేసిన్లు ఉన్నాయి. గోదావరి బేసిన్‌లో పెద్దగా నీటి పంచాయతీలు లేవు. ఉన్నదల్లా కృష్ణా బేసిన్‌లోనే. ఈ బేసిన్‌లో జలాలు తక్కువ. అవసరాలు అధికం. వాడకానికి అవసరమైన నీరు అందుబాటులో ఉండదు. వర్షాలు, వరదలు వస్తేనే సాగునీటి అవసరాల తీరుతాయి. ఈనేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలు నిత్యం ఫిర్యాదులతో కాలం గడుపుతున్నాయి. సమస్యను బాధ్యతగా పరిష్కరించాల్సిన కేంద్రం, నీమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నది. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి, ఇతర అధికారులతో ఉండే అపెక్స్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించకుండా తీవ్ర ఆలస్యం చేస్తున్నది. ఈ ఏడాది ఒక్క అపెక్స్ సమావేశం జరగలేదు. ప్రతి అంశంలో రాజకీయ ప్రయోజనాలు ఆశించే మోడీ ప్రభుత్వం, పనిగట్టుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య జల వివాదాలు పెండింగ్‌లో పెడుతున్నది. చొరవ తీసుకుని ఇరు రాష్ట్రాల ఇబ్బందులను పరిశీలించి పునర్విభజన చట్టం ప్రకారం పరిష్కరించాల్సిన కేంద్రం రెండు రాష్ట్రాలు కొట్టుకుంటుంటే, చోద్యం చూస్తున్నది. ఇప్పటికే ఉన్న ...2లో

ఢిల్లీకి నీళ్ల లొల్లి 2లో..

- ఏపి, తెలంగాణ అధికారులతో కేంద్ర జలశక్తి అధికారుల వీడియో కాన్ఫరెన్స్
- గంట పాటు జరిగిన సమావేశం
- 6న మరోసారి భేటీ
- అప్పటి వరకు ఇరు రాష్ట్రాలు పూర్తి సంయమనం పాటించాలి : దేబశ్రీ ముఖర్జీ

సాగర్ జల వివాదాన్ని తక్షణమే పరిష్కరించాలి
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాగార్జునసాగర్ జల వివాదాన్ని తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది వర్షాల్లేక సాగర్‌లో కేవలం 18 టీఎంసీల నీరు మాత్రమే ఉందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకాలం వినియోగించినట్టుగానే ఈ నీటిని కృష్ణా రివర్‌బోర్డు అనుమతితో ఉభయ తెలుగు రాష్ట్రాలు వినియోగించుకోవాలని కోరారు. కానీ ...2లో



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 63,760	▲	810
22 క్యారెట్లు	- 58,450	▲	750
కిలో వెండి	- 83,500	▲	1000



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 86
రిటైల్ (లైవ్)	రూ. 108
స్కిన్‌తో	రూ. 157
స్కిన్‌లెస్	రూ. 178

'ఉపాధి' పనితీరు ఆడిట్ ఏది?

పదేండ్లుగా నిర్వహించని కాగ్

• వెల్లువెత్తుతున్న పలు ప్రశ్నలు



న్యూఢిల్లీ : భారత్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కల్పన చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) అమలుకు సంబంధించి 2013 నుంచి భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) యూనియన్ స్థాయి పనితీరు ఆడిట్‌ను నిర్వహించలేదు. దీంతో పదేండ్లుగా ఆడిట్ జరపకపోవటంపై పలు ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఇదంతా జరిగిందా? అనే అనుమానాలు పలువైపుల నుంచి వినిపిస్తున్నాయి.

కాగ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న నివేదికల ప్రకారం.. చట్టం అమలు పనితీరు ఆడిట్ చివరిగా 2013లో నిర్వహించబడింది. ఈ పథకాన్ని జాతీయ స్థాయిలో కాగ్ ఆడిట్ కోసం 2016లో తీసుకున్నది. కానీ ఇది పనితీరు ఆడిట్‌గా కాకుండా సోషల్ ఆడిట్ యూనిట్‌లను పరిశీలించడానికి మాత్రమే కావటం గమనార్హం.

2013 నివేదిక సమగ్రంగా, దేశవ్యాప్తంగా ఎంజీఎన్ఆర్‌జీఏ అమలును కవర్ చేసినప్పటికీ.. ఆ తర్వాత పథకం యొక్క సామాజిక ప్రభావాన్ని కవర్ చేయడానికి ఒక ప్రణాళిక ఉన్నదనీ, ఇది 2016 నివేదికలో ఉన్నదని వెల్లడైంది. అయితే, ఆ తర్వాత ఉపాధి హామీ పథకం గురించి ఎటువంటి వివరణాత్మక నివేదికా లేకపోవటం గమనార్హం. ప్రధానంగా ప్రతి స్కీమ్ పనితీరు ఆడిట్ ప్రతి ఐదేండ్ల తర్వాత జరుగుతుందని కొందరు అధికారులు చెప్తున్నారు. "ప్రతి సంవత్సరం ఆడిట్ కోసం 7-8 పథకాలు కేటాయించబడతాయి. ప్రభుత్వం నుంచి అభ్యర్థన లేదా కాగ్ ప్రత్యేకంగా ఒకదాని గురించి అభ్యర్థన లేకపోతే, సాధారణ కోర్సులో పదేండ్లలో పనితీరు ఆడిట్ కోసం మళ్లీ ఒక పథకం రావచ్చు" అని ఈ విషయంపై తెలిసిన కొందరు అధికారులు అన్నారు. అయితే, ఈ విషయంలో కాగ్ కార్యాలయం నుంచి స్పందన రావాల్సి ఉన్నది.

కాగ్ ఆడిట్ నివేదికలు ఎందుకు ముఖ్యం?

2జీ స్పెక్ట్రమ్, బొగ్గు బ్లాకుల కేటాయింపులలో ఆరోపించిన కుంభకోణాల ఆరోపణలపై యూపీఏ ప్రభుత్వం విమర్శలకు గురైనప్పటి నుంచి కాగ్ నివేదికలు ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉంటున్నాయి. ఆగస్టులో ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అనేక కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల పనితీరులో అవినీతి, అక్రమాలను బహిర్గతం చేసే పన్నెండు నివేదికలను కాగ్ సమర్పించింది.

కాగా, కాగ్ కార్యాలయం ముగ్గురు అధికారులను బదిలీ చేసిన తర్వాత(వారిలో కొందరు నివేదికలపై పనిచేశారు) తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రతిపక్ష పార్టీలు మోడీ ప్రభుత్వం "బెదిరింపు" చర్య అని ఆరోపించాయి. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్ట్, ఆయుష్మాన్ భారత్‌లో జరిగిన అవినీతిని బయటపెట్టిన ఆడిట్ నివేదికలను అధికారులు పరిశీలించారు.

ఆయుష్మాన్ భారత్ నివేదిక ఆడిట్‌ను ప్రారంభించిన మూడో అధికారిని కూడా బదిలీ చేశారు. ఆడిటింగ్‌కు కీలకమైన ఫీల్డ్ ఆడిట్ పనిని నిలిపివేయడానికి కాగ్ నుంచి "మౌఖిక ఆదేశాలు" జారీ అయ్యాయని 'ది వైర్' ఇప్పటికే వెల్లడించిన విషయం విదితమే.

'ఉపాధి'పై కేంద్రం చిన్నచూపు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖాతాలను ఆడిట్ చేసే బాధ్యతను కాగ్ కలిగి ఉంటుంది. కాగ్ పనితీరు ఆడిట్‌లు ఒక కార్యాచరణ, కార్యక్రమం, సంస్థ ఆర్థికంగా, సమర్థవంతంగా, ప్రభావవంతంగా ఎంత వరకు పనిచేస్తుందో పరిశీలిస్తుంది. అయితే, ఎంజీఎన్ఆర్ఈజీఏలో కాగ్ పనితీరు ఆడిట్ నిర్వహించకపోవటం పలు అనుమానాలకు తావిస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు. ఒకపక్క, కేంద్ర బడ్జెట్‌లో మోడీ సర్కారు ఈ పథకానికి నిధుల్లో కోతలు విధిస్తుండటం, పథకంపై చిన్న చూపు చూడటం.. మరోపక్క, కాగ్ పనితీరు ఆడిట్ జరగకపోవటం ఆందోళనకరమైన విషయమని చెప్తున్నారు. కేంద్రం 2023 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.60,000 కోట్లు కేటాయించింది. 2022-23 సవరించిన అంచనాలతో పోలిస్తే ఎంజీఎన్ఆర్ ఈజీఏకు కేటాయింపులు 33 శాతం తగ్గటం గమనార్హం.

ఎడతెగని పంచాయితీ

(మొదటిపేజీ తరువాయి)

అనేక సమస్యలకు తోడు, కొత్త సమస్యలకు ఆస్కారమిస్తున్నది. అధికారాల వికేంద్రీకరణ చేయకుండా, కేంద్రీకృతం చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను ఒక్కొక్కటిగా లాక్కుటున్న కేంద్రం, ఇప్పుడు జలవివాదాల విషయంలోనూ అదే పనిచేస్తోంది. నాగార్జునసాగర్ డ్యాం విషయంలో ఏపీ చేసిన దుందుడుకు వైఖరిపై ఆశించినస్థాయిలో స్పందించలేదు. కుడి కాలువ ద్వారా డ్యాం నుంచి నీటి విడుదల చేసుకుంటున్నా, ఇప్పటికీ సమస్యను సీరియెస్‌గా తీసుకోకపోవడం గమనార్హం.పైగా సాగర్ డ్యాంపై తెలంగాణకు ఉన్న అధికారాన్ని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) ద్వారా తను దఖలు పరుచుకుంది. నవంబరు 30న తెలంగాణ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఏపీ చేసిన దుస్సాహసాన్ని తీవ్రంగా పరిగణించలేదు. శాంతిభద్రతల సమస్య తలెత్తే ప్రమాదమున్నా ఏపీకి నీటిని వాడుకోవడానికి అవకాశమిచ్చిందనే విమర్శలు వస్తున్నాయి. కాగా సాగునీటి శాఖ తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి మురళీధర్ మరోసారి ఏపీపై కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశారు. బలవంతంగా పోలీసుల ద్వారా సాగర్ డ్యాంను ఆక్రమించి అక్రమంగా నీటిని తరలించడాన్ని తప్పుబడుతూ ఘాటుగా లేఖ రాశారు.ఇలా రెండు తెలుగు రాష్ట్రాలు పంచాయితీ పెట్టుకుంటుంటే, కేంద్రం మాత్రం కోతి పరిష్కారం చేసేందుకు ఉబలాటపడుతున్నది. జలవివాదాలను పరిష్కరించడానికి పునర్విభజన చట్టం, సాగునీటి చట్టాలు, ట్రిబ్యునళ్లు ఉన్నా, వాటిని పట్టించుకోవడం లేదు.అంతెందుకు అత్యున్నతస్థాయి కమిటీ అయిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాలే నిర్వహించడం లేదు. ఈ కమిటీ ఏర్పడిన తర్వాత రెండు, మూడు సార్లే మీటింగ్‌లు పెట్టింది. అటు కేంద్ర మంత్రికి తీరికలేకపోవడం, ఇటు ఇరు రాష్ట్రాల సీఎంలకు షెడ్యూళ్లు బీజీగా ఉండటంతో కృష్ణా జలాల సమస్య చిలికి చిలికి గాలివానగా మారింది. పరిష్కారం ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తున్నది. కృష్ణా జలాల విషయమై ఏపీ వేసిన పిటిషన్‌ను ఇటీవల బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆ సర్కారు సుప్రంకోర్టును ఆశ్రయించింది. అంతకుముందు తెలంగాణ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను మాత్రం సుప్రీంకోర్టులో కేంద్రం ఉపసంహరింప చేసింది. దీంతో ఏపీ సర్కారుకు అలుసు ఇచ్చినట్టయింది. ఎలాంటి ఉత్తరం రాయకుండా, ఇండెంట్ పెట్టకుండా డిసెంబరు, జనవరిలో విడుదల చేయాల్సిన కృష్ణా జలాలను పోలీస్ బలప్రయోగం ద్వారా ఏపీ సీఎం జగన్ నాయకత్వంలో విడుదల చేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనికి తెలంగాణ సీఎం కేసీఆర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజన్‌కుమార్, సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు. అంతేగాక సాగునీటిపారుదల శాఖ కార్యదర్శి స్మీతాసభర్వాల్‌ను సాగర్‌డ్యాంను సందర్శించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అర్ధరాత్రి తర్వాత ఏపీ చేసిన చట్టవిరుద్ధమైన చర్యలపై పోలీసులు, కేఆర్ఎంబీకి సాగునీటి శాఖ ఫిర్యాదు సైతం చేసింది. ఈనేపథ్యంలో ఆలస్యంగా కేంద్ర జలశక్తి శాఖ నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల డ్యాంలను కేఆర్ఎంబీ పరిధిలోకి తెచ్చి కేంద్ర బలగాల భద్రత పరిధిలోకి తెచ్చింది. సాగర్ డ్యాం నిర్వహణ ఇంకా తెలంగాణ అధికారుల ఆధీనంలోకి రాలేదు. దీంతో సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టుగా ఉంది. ఇదిలావుండగా సాగర్ డ్యాంపైకి ఇరు రాష్ట్రాల పోలీసుల రాకతో ఉద్రిక్తలు పెరగడం వెనుక, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయనే విమర్శలు సాగునీటిరంగ నిపుణుల నుంచి వస్తున్నాయి. ఈనెల ఆరున జరిగే సమావేశంలో సమస్యకు ఎలాంటి పరిష్కారాలు కనుగొంటారో వేచిచూడాల్సిందే.

ఢిల్లీకి నీళ్ల లొల్లి

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య జరిగిన నీళ్ల పంచాయతీ ఢిల్లీకి చేరింది. కృష్ణా జలాల పంచాయితీపై ఏపీ, తెలంగాణ అధికారులతో శనివారం ఢిల్లీ నుంచి కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ నేతృత్వంలో ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కృష్ణా జలాల విషయంలో ఏపీ, తెలంగాణ మధ్య ఉద్రిక్తతల తగ్గింపు. నాగార్జునసాగర్ డ్యాం, శ్రీశైలం డ్యాం నిర్వహణ బదిలీ అంశంపై చర్చ, కృష్ణా రివర్ బోర్డు మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన అంశాలు మొదలైనవి ఎజెండాగా సమావేశం జరిగింది. దాదాపు గంట పాటు జరిగిన ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

అయితే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సమావేశానికి హాజరు కాలేననీ, ఈ నెల 5కు సమావేశాన్ని మార్చాలని కోరారు. అందువల్ల ఇరు రాష్ట్రాల అధికారులతో ఈనెల 6న వీడియో సమావేశం నిర్వహించి అన్ని అంశాలను కూలంకుషంగా చర్చించి ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్యదర్శి ముఖర్జీ అన్నారు. అప్పటి వరకూ ఇరు రాష్ట్రాలు పూర్తి సంయమనం పాటించాలని సూచించారు. అదే విధంగా నీటి విడుదలకు సంబంధించి ఏపీ ఇచ్చిన ఇండెంటుపై ఈ నెల 4న (సోమవారం) కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని కెఆర్ఎంబి చైర్మన్ శివనందన్‌కు జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సూచించారు.

విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్. జవహర్ రెడ్డి మాట్లాడుతూ నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద నెలకొన్న పరిస్థితులను వివరించారు. విభజన చట్టంలో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణా వ్యవహరించడం, రాష్ట్ర తాగునీటి అవసరాలకు నీరు విడుదలకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోని కారణంగానే ప్రస్తుత పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు.

సాగర్ జల వివాదాన్ని తక్షణమే పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఎన్నికల బిజీలో ఉన్న సమయంలో ఉన్నట్టుండి వివాదం తలెత్తిందని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల మధ్య సామరస్యతను నెలకొల్పి సానుకూలంగా సమస్యను పరిష్కరించవలసిన కేంద్రం ఆ పాత్ర పోషించలేదని తెలిపారు. ఇప్పటికైనా రంగంలోకి దిగిన కేంద్రం వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని బాధ్యతాయుతంగా ఆ వివాదాన్ని పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

మెక్సికన్ మహిళపై అఘాయిత్యం.. డీజే అరెస్ట్

తన పైన తరుచూ లైగిక దాడికి పాల్పడుతున్నాడని ఓ విదేశీ మహిళ ఓ డీజే పైన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన ముంబై లో చోటు చేసుకుంది. వివారాలోకి వెళ్తే.. మెక్సికోకి చెందిన ఓ మహిళకు (31) 2017లో సోషల్ మీడియా ద్వారా" స్లిక్ ఎంటర్‌టైన్‌మెంట్" వ్యవస్థాపకుడు అలానే డైరెక్టర్ అయినటువంటి పాండేతో పరిచయం అయ్యింది. ఈ నేపథ్యంలో మోడల్ కావాలనే ఉద్దేశంతో మెక్సికో నుండి ఇండియాకి వచ్చింది మహిళ. కాగా పాండే 2019 జూలైలో బాంద్రా లోని తన ఇంటిలో మొదటిసారిగా ఆమె పైన లైగిక దాడికి పాల్పడ్డాడని.. తరువాత పదేపదే తన పైన లైగిక దాడికి పాల్పడుతున్నట్లు తెలిపింది. కాగా అతనికి 2020 లో మరో మహిళతో వివాహం జరిగిందని.. అయిన తనకు అసభ్యకర సందేశాలను పంపిస్తూ.. లైగికంగా వేధిస్తున్నాడని.. అతను చెప్పిన దానికి నిరాకరిస్తే అసైన్‌మెంట్ నుంచి గెంటేస్తానని బెదిరించి నిందితుడు తనపై బలవంతం చేశాడని.. అలానే అతను తన కొన్ని సన్నిహిత చిత్రాల ద్వారా ఆమెను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని.. కాగా ప్రస్తుతం తాను వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉంటున్నానని తెలిపింది.. ఈ నేపథ్యంలో అతను ఆమెను చంపేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. కాగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బాంద్రా పోలీసులు నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు.

భారత్‌లో కొత్తగా 88 కరోనా కేసులు..

న్యూఢిల్లీ: 2020ని ప్రపంచం ఎప్పటికీ మరవదు. అనూహ్యంగా మనమధ్యకు వచ్చిన ఈ వైరస్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. ఈ వైరస్ పుట్టుక, మనుగడ తెలుసుకునేలోపే లక్షల్లో ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. వ్యాక్సినేషన్లు రావడంతో కరోనా నుంచి ఉపశమనం లభించింది. క్రమంలో కరోనా తగ్గుముఖం పట్టింది. కానీ పూర్తిగా మాత్రం పోలేదు. ఇంకా మహమ్మారి మన మధ్యే ఉంది. రీసెంట్‌గా మరోసారి ఈ మహమ్మారి మరోసారి బయటకు వచ్చింది. యూకేలో మార్పు పొంది కొత్త వెరియంట్‌తో విజఈంభించేసుందుకు రెడీగా ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా భారత్‌తో కొత్తగా 88 కరోనా కేసులు వెలుగుచూసినట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతేకాదు సూమారు 400 మంది ఈ వైరస్‌కు చికిత్స పొందుతున్నట్టు తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్య శాఖ తన వెబ్‌సైట్‌లో కరోనా కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం.. గతంలో ఈ మహమ్మారి కారణంగా 5,33,300మంది ప్రాణాలు కోల్పోగా.. కరోనా సోకిన వారి సంఖ్య 4,50,02,103గా ఉన్నట్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా కరోనా నుంచి కోలుకున్న వారి శాతం 98.81 కాగా, మరణాల రేటు 1.19 శాతం ఉన్నట్టు చెప్పింది. అలాగే ఇప్పటివరకు దేశంలో 220.67 కోట్లకు పైగా జనాలకు కోవిడ్ -19 వ్యాక్సిన్‌లు అందించినట్టు తెలిపింది. అయితే ఇటీవల కరోనా పాజిటివ్‌లో సిమ్లా ఇందిరా గాంధీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఓ మహిళ మృత్యువాత పడ్డంటు పేర్కొంది.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి: మాయావతి

లక్నో: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి డిమాండ్ చేశారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆల్ పార్టీ మీటింగ్‌లో ఆమె ఈ డిమాండ్ చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో ఈ మీటింగ్‌ను నిర్వహించారు. కుల గణన కోసం దేశంలోని అన్ని దిక్కుల నుంచి డిమాండ్ వస్తున్నట్లు ఆమె తెలిపారు. కుల గణన డిమాండ్‌తో బీజేపీ నిద్రలేని రాత్రులు గడుపుతోందని విమర్శించారు. జాతీయ స్థాయిలో సరైన పద్ధతిలో కుల గణన చేపట్టాలని, ప్రజలకు అందాల్సిన హక్కుల్ని అందేలా చూడాలని మాయావతి డిమాండ్ చేశారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాలు డిసెంబర్ 4వ తేదీన ప్రారంభంకానున్నాయి. డిసెంబర్ 22వ తేదీ వరకు 15 సిట్టింగ్స్ ఉంటాయి.

న్యాయం కోసం

• టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌లో 500 రోజులుగా యువత ఆందోళన
• యోగి సర్కారుపై ఆగ్రహం



లక్నో : యూపీలో టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌పై అక్కడి యువత ఎడతెగని పోరాటం చేస్తున్నది. న్యాయం కోసం చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నారు. 500 రోజులకుపైగా వారు ఆందోళనలు చేస్తున్నారు. యూపీలో అసిస్టెంట్ టీచర్లు, ఇతర 69,000 టీచర్‌లో నియామకాలతో పాటు వివిధ రిక్రూట్‌మెంట్లలో జరిగిన కుంభకోణం లో న్యాయం చేయాలని యువత ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీకి తమ సందేశాన్ని తెలియజేయడానికి సోషల్ మీడియాలో వీరి తరఫున ప్రచారం జరుగుతున్నది. చర్యలు తీసుకోవటంలో విఫలమైన యోగి సర్కారు తీరు పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేండ్లు పూర్తి కానున్నది. ఇటు యూపీలో ముఖ్యమంత్రిగా యోగి రెండో సారి అధికారంలో ఉన్నారు. అయినప్పటికీ, ఉద్యోగాలు వంటి వాగ్దానాల జాబితా కేవలం మాటలకు మాత్రమే పరిమితమైందని అక్కడి యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి యువత, నాయకుల మాటలు నిజమని నమ్మి, కోచింగ్ కోసం డబ్బు ఖర్చు పెడుతున్నారనీ, ఇంటికి దూరంగా ఉంటూ, వయస్సు మీద పడిపోతుంటే నిరాశ, నిస్పృహలతో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆందోళనకారు లు అంటున్నారు. రాష్ట్రంలోని బీజేపీ సర్కారు మాత్రం ఇప్పటివరకు తమకు ఇచ్చిన హామీలలో 1 శాతం కూడా నెరవేర్చలేదని వాపోతున్నారు. ప్రైమరీ ఎడ్యుకేషన్ రిక్రూట్‌మెంట్, ఎల్టీలు, పోలీసు శాఖలో దాదాపు 6 లక్షల ఖాళీ పోస్టులను పునరుద్ధరించాలని గత కొన్నేండ్లుగా యువమంచ్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తున్నది. కానీ, ఇక్కడి ప్రభుత్వం మాత్రం వారి డిమాండ్లను పట్టించు కోవడం లేదు. మరోసారి, లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో మూడు రోజుల ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు యోగి సర్కారు పిలవటంతో.. తమ అభిప్రాయాలను సభలో లేవనెత్తవచ్చనే ఆశ యువతలో తలెత్తింది.

తన డిమాండ్లను అసెంబ్లీకి తెలియజేయడానికి యువ మంచ్ రాష్ట్ర కార్యవర్గం సామాజిక మాధ్యమాల ద్వారా ఉపాధి సమస్య మీద ఉద్యమించాలనీ, డిసెంబరు మొదటి వారంలో ఉద్యమానికి దిగాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉద్యోగాల విషయమై యువమంచ్ సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించగా.. అందులో ఖాళీగా ఉన్న 6 లక్షల పోస్టుల భర్తీకి ఎన్నికల హామీని అమలు చేస్తామని అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సంయుక్త యువమోర్చా కేంద్ర బృందం సభ్యుడు, యువమంచ్ కన్వీనర్ రాజేష్ సచన్ మాట్లాడుతూ.. 6 లక్షల ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని, పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల హామీపై ప్రభుత్వం సీరియస్‌గా లేదని అన్నారు. గౌరవప్రదమైన ఉపాధి కల్పించడం ప్రభుత్వ రాజ్యాంగ బాధ్యతనీ, ఉద్యోగ హక్కుల కోసం శాంతియుతంగా గళం విప్పడం యువత ప్రజాస్వామిక హక్కు అనీ, అయితే ప్రభుత్వం శాంతియుత ఉద్యమాలను అణిచి వేసేందుకు పూనుకున్నదని తెలిపారు. 69 వేల టీచర్ రిక్రూట్‌మెంట్‌లో రిజర్వేషన్ స్కామ్‌లో బాధితులైన అభ్యర్థులకు సత్వర న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) విజ్ఞప్తి చేసింది. రిజర్వేషన్ స్కామ్ బాధితులు గత కొన్ని నెలలుగా లక్నోలోని ఎకో గార్డెన్‌లో నిరసనలు చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో వారు ఎకో గార్డెన్ గేట్ వద్దకు వచ్చారు. ఈ అభ్యర్థులకు సీపీఐ (ఎంఎల్) మద్దతుగా నిలిచింది. ప్రభుత్వం తన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు అభ్యర్థులపై నిందలు వేస్తున్నదని ఆరోపించింది. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ-ఓబీసీ రిజర్వేషన్లను రద్దు చేయాలనుకుంటున్నదని ఆరోపించింది. లక్నోలోని ఎకో గార్డెన్‌లో 526 రోజులకు పైగా కొనసాగుతున్న ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న విజయ్ కుమార్ మాట్లాడుతూ.. "69,000 టీచర్ రిక్రూట్‌మెంట్‌లకు మేమంతా అభ్యర్థులం. మా నిరసన 526 రోజులకు పైగా సాగుతున్నది. మేము ఎకో గార్డెన్‌లో ఆందోళన చేయవలసి వచ్చింది. మా ఏకైక డిమాండ్ జాతీయ వెనుకబడిన కమిషన్‌ను ప్రభుత్వం వినాలనేది. 2021, ఏప్రిల్‌లో కమిషన్ నివేదిక.. 69,000 మంది టీచర్ల రిక్రూట్‌మెంట్‌లో రిజర్వేషన్ స్కామ్ జరిగిందని అంగీకరించింది. యూపీ ప్రభుత్వానికి లేఖ పంపింది. స్కాంలో ప్రభావితమైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇవ్వాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తన లేఖలో పేర్కొన్నది" అని తెలిపారు.

మిజోరం ఓట్ల లెక్కింపు రేపటికి వాయిదా

• ఎన్నికల సంఘం వెల్లడి

ఐజ్వాల్ : ఈశాన్య రాష్ట్రం మిజోరం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపును రేపటికి (సోమవారానికి) వాయిదా పడ్డాయి. ఎన్నికల ఫలితాలను ఒకరోజు వాయిదా వేసినట్టు ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. మిజోరంలో నవంబర్ 7న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ముందుగా ఈశాన్య రాష్ట్రంలోని ఓట్ల లెక్కింపు ఎన్నికలు జరిగిన నాలుగు ఇతర రాష్ట్రాలైన చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణలతో కలిపి జరగాల్సి ఉన్నది. అయితే, డిసెంబర్ 3న (ఆదివారం) మిజోరాం ప్రజలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉన్నందున కౌంటింగ్ తేదీని మార్చాలని ఈసీకి అభ్యర్థనలు అందాయి. దీంతో వారి అభ్యర్థలను ఆమోదించినట్టు ఈసీ వెల్లడించింది. మిగిలిన నాలుగు రాష్ట్రాల కౌంటింగ్ తేదీలో ఎలాంటి మార్పు లేదు. మిజోరాంకు చెందిన ఎన్జీవో కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కమిషన్ ఈ నిర్ణయం తీసుకున్నది. "మిజో క్రిస్టియన్ ప్రజలకు గౌరవప్రదమైన రోజు ఆదివారం నాడు (డిసెంబర్ 3) మిజోరాం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీని భారత ఎన్నికల సంఘం నిర్ణయించడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము" అని ఎన్జీఓ కోఆర్డినేషన్ కమిటీ పేర్కొన్నది.

మిజోరాం అసెంబ్లీలో మొత్తం 40 స్థానాలు ఉండగా, మెజారిటీకి 21 సీట్లు అవసరం. గురువారం విడుదలైన కొన్ని ఎగ్జిట్ పోల్స్ రాష్ట్రంలోని అధికార మిజో నేషనల్ ఫ్రంట్ కంటే జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ ముందుంటుందని అంచనా వేస్తున్నాయి.

ఈడీ ఆఫీసుపై ఏసీబీ దాడి

• తమిళనాడులోని మధురై కార్యాలయంలో సోదాలు

చెన్నై : తమిళనాడులో ఏసీబీ.. ఈడీ కార్యాలయంపై దాడులు చేసింది. లంచం కేసులో ఈడీ అధికారి ఇటీవల అరెస్టయిన విషయం తెలిసిందే. ఈ ఘటన అనంతరం తమిళనాడు అవినీతి నిరోధక పోలీసులు ఈడీ కార్యాలయంపై దాడి చేశారు. తమిళనాడు డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ అధికారులు శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మధురై కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. ఈడీ సీనియర్ అధికారి అంకిత్ తివారీని అరెస్టు చేసిన తర్వాత ఈ ఆపరేషన్ జరిగింది. ఒక వ్యక్తి నుంచి రూ.20 లక్షలు లంచం తీసుకున్నారనే ఆరోపణలపై సదరు ఈడీ అధికారిని ఏసీబీ శుక్రవారం దిండిగల్ జిల్లాలో అదుపులోకి తీసుకున్నది.

ఈ కేసులో ఫిర్యాదుదారుడు ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ సురేశ్ బాబు. 2018లో ఈయనపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. అయితే, ఈ కేసులో రూ.3 కోట్లు లంచం ఇవ్వకుంటే అరెస్ట్ చేస్తామని బాబును తివారీ బెదిరించినట్టు సమాచారం. తర్వాత ఆ మొత్తాన్ని రూ.51 లక్షలకు తగ్గించేందుకు బాబు.. తివారీతో బేరం కుదుర్చుకున్నట్టు తెలిసింది. నవంబర్ 1న తివారీకి బాబు రూ.20 లక్షలకు పైగా నగదు చెల్లించినట్టు సమాచారం. కేంద్ర ఏజెన్సీ అధికారి మిగిలిన చెల్లింపును డిమాండ్ చేయడంతో డాక్టర్ తమిళనాడు పోలీసులను ఆశ్రయించారు.

బంగ్లాదేశ్‌లో భారీ భూకంపం..

• పశ్చిమబెంగాల్, లడఖ్‌లోనూ ప్రకంపనలు

ఢాకా: బంగ్లాదేశ్‌లో శనివారం ఉదయం 5.6 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. చిట్టగాంగ్‌లోని భూమి అంతర్భాగంలో 55 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు సంభవించాయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. ఈ భూకంపం కారణంగా పొరుగు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌లోనూ భూప్రకంపనలు సంభవించాయి. కోల్ కతా సహా బెంగాల్ లోని పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తమ ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే రాష్ట్రంలో ఈ ప్రకంపనల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లలేదని పశ్చిమ బెంగాల్ విపత్తు నిర్వహణ శాఖ తెలిపింది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం.. , ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదు' అని అధికారులు తెలిపారు. కోల్ కతా పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. కాగా, శనివారం ఉదయం 9.41 గంటలకు చిట్టగాంగ్‌లోని రామ్‌గంజ్‌లో భూమి కంపించింది. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ ప్రకారం, రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 5.6గా నమోదైంది. భూమి అంతర్భాగంలో 55 కిలోమీటర్ల లోతులో కదలికలు వచ్చినట్టు వెల్లడించారు. భూకంప కేంద్రం రామ్‌గంజ్ సమీపంలో ఉందని పేర్కొంది. నిమిషాల వ్యవధిలోనే చిట్టగాంగ్ ప్రావిన్స్‌లోని లక్ష్మీపూర్, చాంద్‌పూర్, కొమిల్లాలో భూమి కంపించింది. అదేవిధంగా, రాజ్‌షాహి, సిల్హెట్, ఢాకా, నౌఖాలీ మరియు కుస్తియాలో కూడా ప్రకంపనలు సంభవించాయి. భూకంపం వల్ల సంభవించిన నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు.

లడఖ్‌లో భూకంపం.. 3.4 తీవ్రత నమోదు

శ్రీనగర్: ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా భూప్రకంపనలు చోటుచేసుకుంటున్నాయి. దేశంలోని ఏదోక ప్రాంతంలో భూకంపం సంభవిస్తుంది. శనివారం బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్‌లో భూకంపం చోటుచేసుకోగా.. ఇదే రోజు లెహ్ లడఖ్‌లోనూ భూకంపం సంభవించడం గమనార్హం. ఇవాళ ఉదయం 8. 25 నిమిషాల ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 3.4 తీవ్రతో అక్కడ భూకంపం సంభవించినట్టు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. భూకంప కేంద్రం 35.44 అక్షాంశం, 77.36 రేఖాంశంలో 10 కిలో మీటర్ల లోతులో కేంద్రీకతమై ఉంది. 'స్థానం: లడఖ్.. భూకంపం తీవ్రత: 3.4, 02-12-2023న లాడఖ్‌లో భూప్రకంపనలు సంభవించాయి.

భారత సంతతి వ్యక్తి హత్యకు ఖలిస్తాన్ తీవ్రవాదుల కుట్ర.. ముగ్గురికి శిక్ష విధింపు..

న్యూయార్క్: ఇటీవల కాలంలో ఖలిస్తానీ వేర్పాటువాద నేతలు యాక్టీవ్ అవుతున్నారు. ముఖ్యంగా కెనడా, యూఎస్, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో వారి కార్యకలాపాలు పెరిగాయి. భారత వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నారు. ఇదే కాకుండా ఖలిస్తానీ భావజాలానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని హతమర్చాడానికి ప్రయత్నించడంతో పాటు భయాందోళనకు గురిచేస్తున్నారు. కెనడాలో ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత అక్కడ హిందువులను టార్గెట్ చేసుకుంటూ గురుపత్వంత్ సింగ్ పన్నూ అనే ఖలిస్తాన్ ఉగ్రవాది బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇదిలా ఉంటే ఖలిస్తాన్ భావజాలానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడనే కోపంతో న్యూజిలాండ్ ఆక్లాండ్‌లో రేడియో హెూస్ట్ హర్నెక్ సింగ్‌పై ముగ్గురు ఖలిస్తాన్ తీవ్రవాదులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ కేసులో ముగ్గురికి శిక్ష పడింది. 27 ఏళ్ల సర్వజీత్ సిద్ధూ హత్యాయత్నానికి పాల్పడ్డాడని, 44 ఏళ్ల సుఖ్‌ప్రీత్ సింగ్ దీనికి సహకరించాడని, మూడో వ్యక్తి ఆక్లాండ్ నివాసి అని ది ఆస్ట్రేలియన్ టుడే నివేదించింది. ఈ కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి మార్క్ వూల్‌ఫోర్డ్ సమాజ రక్షణ, మతపరమైన మతోన్మాదానికి వ్యతిరేకంగా బలమైన చర్యల అవసరాన్ని నొక్కి చెప్పారు. డిసెంబర్ 23,2020న హర్నెక్ సింగ్‌ను అతని ఇంటిబయట ఖలిస్తానీ తీవ్రవాదులు దాడికి పాల్పడ్డారు. 40 కంటే ఎక్కువ సార్లు కత్తితో పొడిచారు. ఈ ఘటనలో 350 కంటే ఎక్కువ కట్లు పడటంతో పాటు అతనికి అనేక సర్జరీలు చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. హర్నెక్ సింగ్‌ని హత్య చేయడానికి ఖలిస్తానీ భావజాలం ఉన్న వ్యక్తులు మూడు కార్ల నిండా వ్యక్తులు అతడిని అనుసరించారు. ప్రమాదాన్ని గమనించి కార్ డోర్లు మూసేసి, గట్టిగా కార్ హారన్ కొట్టడంతో ఇరుగుపొరుగు వారు ఈ దాడిని చూడగలిగారు. ప్రముఖ కివీస్ రేడియో హెూస్ట్‌గా ఉన్న హార్నెక్ సింగ్ ఖలిస్తాన్‌కి వ్యతిరేకంగా గళం విప్పినందుకు ఈ దాడి జరిగింది.

ఈ దాడికి పాల్పడిన వ్యక్తుల్లో 48 ప్రధాన సూత్రధారికి 13.5 ఏళ్ల శిక్ష విధించబడింది. సర్వజీత్ సిద్ధూకి 9.5 ఏళ్లు జైలు శిక్ష, సుఖ్‌ప్రీత్ సింగ్‌కి 6 నెలల గృహ నిర్బంధం విధించబడింది. మరో ఇద్దరు వ్యక్తులు జగరాజ్ సింగ్, గుర్బిందర్ సింగ్‌కి వ్యతిరేకంగా సాక్ష్యాలు లేకపోవడంతో నిర్దోషులుగా విడుదలయ్యారు. మరో ఇద్దరు జోబన్ ప్రీత్ సింగ్, హర్దీప్ సింగ్‌కి ఈ హత్యయత్నంలో ప్రమేయం ఉండటంతో వచ్చే ఏడాది ప్రారంభంలో శిక్ష విధించబడనుంది.

కేంద్రం ఆధీనంలో సాగర్ డ్యామ్

పరిశీలించిన సీడబ్ల్యూసీ, కేఆర్‌ఎంబీ సభ్యులు


- సీఆర్‌పీఎఫ్ బలగాల పహారా
- ఏపీకి కొనసాగుతున్న నీటి విడుదల
- ఇరు రాష్ట్రాలు ఒకరిపై ఒకరు కేసు నమోదు

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ ప్రాజెక్టు డ్యామ్‌ను సీఆర్‌పీఎఫ్ బలగాలు ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణ బాధ్యతలను కృష్ణా బోర్డుకు, కేంద్ర బలగాలకు అప్పగించాలన్న కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనకు.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంగీకరించిన నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బలగాలు సాగర్ డ్యామ్ స్వాధీనం చేసుకున్నాయి. సీఆర్‌పీఎఫ్ బలగాల రాకతో.. తెలంగాణ పోలీసులు డ్యామ్ వద్ద నుంచి వెనుదిరిగారు. కానీ ఆంధ్రప్రదేశ్ పోలీసులు రైట్ బ్యాంక్ పరిసరాలలో మోహరించారు. మరోవైపు సాగర్ డ్యామ్ నుంచి కుడి కాలువకు నీటి విడుదల కొనసాగుతూనే ఉంది. కుడి కాలువ ద్వారా ప్రస్తుతం 5,450 క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నట్టు సమాచారం.

డ్యామ్‌ను సందర్శించిన కేఆర్‌ఎంబీ సభ్యులు

సాగర్ డ్యామ్‌ను శనివారం కేఆర్‌ఎంబీ సభ్యులు ఎస్.సి అశోక్ కుమార్, ఈ.ఈ రఘునాథ్ సందర్శించారు. తెలంగాణ వైపు డ్యామ్‌ను సందర్శించిన అనంతరం ఆంధ్ర వైపు వెళ్లారు. అధికారులకు పలు సూచనలు చేశారు.



తెలుగు రాష్ట్రాల పోటాపోటీ కేసులు

నాగార్జున సాగర్ డ్యాంపై తాజాగా చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఏపీ, తెలంగాణ పోలీసులు పరస్పరం తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. డ్యాంపైకి అక్రమంగా చొరబడి తమపై దాడి చేసి.. తమ విధులను ఆటంకపరిచి దౌర్జన్యంగా కుడి కాలువకు నీరు విడుదల చేశారన్న ఫిర్యాదుపై ముందుగా సాగర్ పోలీస్ స్టేషన్‌లో ఏపీ పోలీసులపై కేసు నమోదైంది. తెలంగాణ ఇరిగేషన్ అధికారులు, డ్యాం ఎస్‌పీఎఫ్ సిబ్బంది ఫిర్యాదుతో ఈ కేసు నమోదు చేశారు. ప్రతిగా సాగర్ డ్యాంపై తమ విధులను అడ్డుకున్నారని ఏపీ ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు గుంటూరు జిల్లా విజయపురి సౌత్ పోలీస్ స్టేషన్లో తెలంగాణ పోలీసులపై రెండు కేసులు నమోదు చేశారు. నాగార్జున సాగర్ డ్యాం నిర్వాహణ హక్కులపై రేగిన తాజా వివాదంలో రెండు రాష్ట్రాల పోలీసులు పరస్పరం పోటాపోటీగా కేసులు పెట్టుకోవడం చర్చనీయాంశమైంది.

టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎంఎకె దత్తు కన్నుమూత

నేడు అల్వాల్‌లో అంత్యక్రియలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర సీనియర్ నాయకులు ఎంఎకె దత్తు (77) హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడు తున్న ఆయన కొన్ని రోజుల క్రితం ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యం విషమించి శనివారం రాత్రి 9.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఉపాధ్యాయుల సందర్శనార్థం ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయం దోమల్‌గూడలో ఆయన భౌతికకాయాన్ని అందుబాటులో ఉంచుతారు. అనంతరం అల్వాల్‌లోని ఆయన స్వగృహానికి తరలించి సాయంత్రం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య లలిత, ఇద్దరు కుమారులు ప్రపూర్ణ, ప్రఫుల్ల ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, కోశాధికారిగా, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా, చైర్మెన్‌గా, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా వివిధ హోదాల్లో ఆయన సుదీర్ఘకాలం పనిచేశారు. గుంటూరు జిల్లా ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారు. మొదటితరం నాయకులైన ఎ వెంకటస్వామి, దాచూరి రామిరెడ్డి, మైనేనితోపాటు నాగటి నారాయణ, కొండవీటి జోజయ్యతో కలిసి పనిచేశారు. ప్రస్తుత నాయకత్వానికి ఆయన ఉద్యమ సన్నిహితుడిగా ఉన్నారు. గుంటూరు జిల్లా అమరావతిలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా 2004లో ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో 2021 వరకు ఆయన పూర్తికాలం స్వచ్ఛందంగా సేవలందించారు. శాస్త్రీయ దృక్పథం, సామాజిక అవగాహన కలిగిన మంచి నాయకునిగానే కాకుండా గణిత ఉపాధ్యాయునిగా పేరుపొందారు. అకడమిక్ అంశాలపై విశేషమైన పట్టు ఉన్నది. పాఠ్యపుస్తక రచనలోనూ, వృత్యంతర శిక్షణలో జాతీయస్థాయిలో రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఏ స్థాయి బాధ్యతలైనా సంతృప్తికరంగా, సమర్థవంతంగా నిర్వహించారు. ఆయన సోదరులు ప్రమోద్, రాధేశ్యాం, సోదరి పద్మశ్రీ సీఐటీయూ నాయకులుగా ఉన్నారు. భార్య, కుమారులు అభ్యుదయ ఆలోచనలతో ప్రజాతంత్ర ఉద్యమాలకు సహకరిస్తున్నారు. దత్తు మరణం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఉపాధ్యాయులను, యూటీఎఫ్ కార్యకర్తలను తీవ్ర విచారానికి గురిచేసింది. దత్తు మరణం పట్ల టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, కోశాధికారి లక్ష్మారెడ్డి, నాయకులు సింహాచలం, పి మాణిక్‌రెడ్డి, మస్తాన్‌రావు సంతాపం ప్రకటించారు. ఆస్పత్రికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన మరణం బాధాకరమనీ, ఉపాధ్యాయ ఉద్యమానికి తీరనిలోటని పేర్కొన్నారు.



ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఉద్రిక్తత

- రెండ్రోజులైనా కార్యాలయంలోనే పోస్టల్ బ్యాలెట్స్
- స్ట్రాంగ్ రూమ్ సీల్ తొలగించడంపై కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన
- భారీ స్థాయిలో తరలి వచ్చిన కార్యకర్తలు

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ సీల్‌ను తొలగించారని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతలు, స్వతంత్ర అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ సీల్ తొలగించారని శనివారం రాత్రి వారు నిరసన చేపట్టారు. స్ట్రాంగ్ రూంలో ఉండాల్సిన పోస్టల్ బ్యాలెట్లు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యక్షం కావడంతో కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థి ఏజెంట్లు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోస్టల్ బ్యాలెట్ బాక్స్ సీల్ తొలగించి ఉండటం, అందులో ఉన్న బ్యాలెట్లు లేకపోవడంపై రిటర్నింగ్ అధికారిని నిలదీశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించి 3,057 పోస్టల్ ఓట్లు నమోదయ్యాయి. వీటికి సంబంధించిన ఆరు బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌లో ఉండాలి. కానీ, అవి ఆర్డీవో కార్యాలయంలో ఉండటంపై కాంగ్రెస్ నేతలు అనుమానం వ్యక్తం చేశారు. రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తీరును వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు.

భారీ స్థాయిలో తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

పోస్టల్ బ్యాలెట్ బాక్స్ ఓపెన్ చేసి ఉండటం పట్ల కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహానికి గురయ్యారు. ఈ విషయం ఒక్కసారిగా వ్యాపించడంతో వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఆర్డీఓ కార్యాలయానికి తరలించారు. ఆర్డీవో చాంబర్‌ను ముట్టడించారు. వారిని అదుపు చేయడం పోలీసుల తరం కాలేకపోయింది. అధికార పార్టీతో కుమ్మక్కై ఆర్డీఓ అనంత రెడ్డి పోస్టల్ బ్యాలెట్లను మార్పిడి చేశారని ఆరోపించారు. పోస్టల్ బ్యాలెట్ బాక్సులు 30వ తేదీ లోపే కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్‌కి చేరాల్సి ఉంటే ఎందుకు ఆర్డీవో కార్యాలయంలో పెట్టుకున్నారని నిలదీశారు. మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ కేఎస్ రావు ఆధ్వర్యంలో ఆందోళనకారులను సముదాయించారు. ఆర్డీఓ అనంతరెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డితో చర్చించారు. శాంతించాలని ఫోన్‌లో కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. దాంతో కార్యకర్తలు ఆర్డీఓ చాంబర్‌ను వదిలి బయటకు వెళ్లారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

ఎన్‌ఎంఎంఎస్‌ఎస్ దరఖాస్తు గడువు 31 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్‌ఎంఎంఎస్‌ఎస్)కు 2023-24 విద్యాసంవత్సరంలో ఎంపికైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 31వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తుల పునరుద్ధరణ, ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేసే గడువు ఈనెల 31 వరకు పొడిగించామని తెలిపారు. సకాలంలో దరఖాస్తు చేసేలా విద్యార్థులను వివరించాలని సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు.

మావోయిస్టు పార్టీ సాంకేతిక నిపుణుల టీం సభ్యులు అరెస్ట్

రామగుండం పోలీస్ కమిషనర్ రెమారాజేశ్వరీ వెల్లడి

నవతెలంగాణ-గోదావరిఖని



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి మంచిర్యాల జోన్ జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందారంలో నిషేధిత సీపీఐ(మావోయిస్టు) టెక్నికల్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ టెక్నికల్ టీం క్యాడర్ సభ్యులు ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీపీ రెమారాజేశ్వరీ తెలిపారు.

రామగుండం కమిషనరేట్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డెల్టా గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన డి.గంగాధర రావు 1969లో వైజాగ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ చదివారు. 1972లో జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లి అక్కడే ఓ ప్రయివేటు కంపెనీలో చేరారు. 1980 వరకు అక్కడే పని చేసిన గంగాధరరావు మావోయిస్టు పార్టీ సిటీ కమిటీ ఆర్గనైజర్ విశ్వం అనే వ్యక్తితో పరిచయం ఏర్పడ్డాక అందులో చేరారు. ఈయనకు డీవీసీఎం సీపీఐఎం డీకేఎస్‌జెసీ-సీపీఐ మావోయిస్టు పార్టీ సభ్యురాలు భవానితో వివాహమైంది.

వీరికి ఒక కూతురు ఉంది. ఈ నేపథ్యంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ గంగాధరరావుకు 2000లో సాంకేతిక విభాగం బాధ్యతలు అప్పగించగా ఆయుధాలు, పేలుడు పదార్థాల తయారీ చేసేవాడు.

పది నెలల కిందట కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న ఆదేశాల మేరకు ఆయన భార్య భవానితో కలిసి మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం వచ్చారు. జాలంపెల్లి బక్కయ్య, జాలంపెల్లి లక్ష్మీ పేర్లతో నకిలీ ఆధార్ కార్డులు, పాన్ కార్డులు తయారు చేసి, ఆ పేర్లతో ఇందారంలో స్థలం కొనుగోలు చేసి చిన్న ఇల్లు నిర్మించుకున్నారు.

ఇందారం నుంచే కార్యకలాపాలు

దంపతులిద్దరూ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సిరొంచకు వెళ్లి, మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కర్, బండి ప్రకాష్, బడే చొక్కారావు, ఏ.దామోదర్‌తో కలిసి పార్టీ సమావేశాలకు హాజరయ్యేవారు. పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన విషయాలను వారితో వాట్సాప్‌లో చర్చించేవారు. తెలంగాణ, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, రాష్ట్రాల్లో రెండు మూడు సంవత్సరాలుగా మావోయిస్టు కార్యకలాపాలు నిర్వహించారు.

కొద్ది నెలల కిందట ఇందారం గ్రామానికి రాగా పక్కా సమాచారం మేరకు పోలీసులు వారిని అరెస్టు చేశారు. వీరికి సాయం చేసిన సీపీఐ మావోయిస్టు సానుభూతిపరుడైన కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటకు చెందిన చిప్పకుర్తి శ్రీనివాస్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతనికి కోసం పోలీసుల ప్రత్యేక బృందం గాలిస్తోంది. పట్టుబడిన వీరిపై జైపూర్ పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వారి నుంచి నకిలీ ఆధార్, పాన్‌కార్డులు, బ్యాంక్‌పుస్తకాలు, ఒక మొబైల్ ఫోన్, 6 మెమోరీ కార్డులు, ఒక ట్యాబ్, రెండు పెన్ డ్రైవ్‌లు, ఒక పాకెట్ డైరీ, ఒక పెన్, రెండో సెషన్ రిజల్యూషన్‌లు, తెలంగాణ రాష్ట్ర రెండో ప్లీనరీ తీర్మానాలు స్వాధీనం చేసుకున్నారు.

హైదరాబాద్ నగర శివార్లో డ్రగ్స్ తయారీ

- సోషల్ మీడియా ద్వారా విక్రయాలు
- ముగ్గురుని అరెస్టు చేసిన నార్కోటిక్ బ్యూరో

నవతెలంగాణ-సిటీబ్యూరో




హైదరాబాద్ నగర శివార్లో డ్రగ్స్ తయారు చేస్తున్న ముగ్గురు నిందితులను తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో(టీఎస్-ఎన్ఏబీ) అధికారులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 150 అసిటోన్ బాటిల్స్‌లో నిలువ ఉంచిన 60గ్రాముల క్రిస్టల్ మెథాం ఫెటమైన్, 700 ఎంఎల్ లిక్విడ్ మెథాంఫెటమైన్ డ్రగ్స్‌తోపాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.50లక్షలుంటుందని పోలీసులు తెలిపారు. శనివారం బషీర్‌బాగ్‌లోని పాత పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎస్-ఎన్ఏబీ ఎస్పీ జి.చక్రవర్తి, డీఎస్పీ శ్రీధర్ మీడియాకు వివరాలు తెలిపారు.

వెస్ట్ గోదావరికి చెందిన కమ్మ శ్రీనివాస్, పోలవరానికి చెందిన జి.నరసింహ రాజు, ఈస్ట్ గోదావరికి చెందిన డి.మణికంఠ వీరవెంకట నాగరాజు స్నేహితులు. ఉపాధికోసం హైదరాబాద్‌కు వచ్చిన వీరు సూరారం పరిధిలోని గాజుల రామారంలో నివాసముంటున్నారు. ప్రయివేట్ సంస్థలో పనిచేస్తున్న శ్రీనివాస్‌కు డ్రగ్స్ తయారీపై అవగాహన ఉంది. 2013లో ఓ పరిశ్రమలో డ్రగ్స్ తయారు చేస్తున్నాడన్న సమాచారం అందుకున్న పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత నరసింహరాజు, మణికంఠతో కలిసి సూరారంలో ఓ ఇంట్లో డ్రగ్స్ తయారీ చేయడం ప్రారంభించారు. రెండేండ్లుగా డ్రగ్స్ తయారు చేస్తున్న వీరు సోషల్ మీడియా ద్వారా తెలిసిన వారికి, కావాల్సిన వారికి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న నార్కోటెక్ బృందం సూరారం పోలీసులతో కలిసి ముగ్గురిని అరెస్టు చేశారు. లిక్విడ్ మెథాం ఫెటమైన్ తీసుకుని దాన్ని ప్రాసెస్ చేసి డ్రై చేస్తే క్రిస్టల్ మెథాం ఫెటమైన్ డ్రగ్ తయారవుతుందని విచారణలో నిందితులు తెలిపారు. అలా తయారు చేసిన మాదక ద్రవ్యాలను విక్రయిస్తూ భారీ మొత్తంలో డబ్బులు సంపాదించారు. నిందితులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో నార్కోటెక్ ఇన్‌స్పెక్టర్లు పి.రమేష్‌రెడ్డి, డి.సంతోష్ కుమార్, జీఎస్ డానియల్‌తోపాటు ఎస్ఐ సీ.వెంకటరాములు తదితరులు ఉన్నారు. .

సమస్యల పరిష్కారం కోసం ప్రజాపోరాటాలు

- ముఖ్య కార్యకర్తల సమావేశంలో జూలకంటి



నవతెలంగాణ-మిర్యాలగూడ

సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మిర్యాలగూడలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో నియోజవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఎన్నికల్లో డబ్బులు, మద్యం, మాంసం విచ్చలవిడిగా పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభపెట్టారని చెప్పారు. కోట్ల రూపాయలు చేతులు మారాయని, బహిరంగంగా ఓటుకు నోటు ఇచ్చారని, డబ్బు, మద్యం, మాంసం విచ్చలవిడిగా అందజేశారని అయినప్పటికీ ఎన్నికల అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వానికి మద్దతు ఎప్పుడూ ఉంటుందని, ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తే పోరాటాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తామని చెప్పారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు వీరపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, భావండ్లపాడు, రవి నాయక్, శశిధర్ రెడ్డి రాగిరెడ్డి మంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో ఏపీ ప్రభుత్వం దుస్సాహసం

- గేట్లను ఆక్రమించడం దుర్మార్గం
- రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఫాల్స్ :గుత్తా సుఖేందర్ రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

'ఇది చాలా తీవ్రమైన అంశం. ఏపీ ప్రభుత్వం దుస్సాహసం చేసింది. సాగర్ ప్రాజెక్టుపై దండయాత్ర చేసి 13 గేట్లను ఆక్రమించడం దుర్మార్గపు చర్య. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం శ్రీశైలం ఆంధ్రప్రదేశ్ నిర్వహణలో, సాగర్ తెలంగాణ నిర్వహణలో ఉంది' అని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దురాక్రమణ చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యానికి ఇది విరుద్ధం.. రెండు రాష్ట్రాల ప్రజల మధ్య సామరస్య వాతావరణానికి విఘాతం కలిగేలా ఉందని, దూరాలోచనతోనే గేట్లను ఆక్రమణ చేశారని అన్నారు. ఇప్పటికే కృష్ణా రివర్‌బోర్డ్ ఆదేశించిందని, అయినా ఆంధ్ర పోలీసులు వెనక్కి పోవడం లేదన్నారు. ఆంధ్రకు నీటి విడుదల కూడా కొనసాగుతోందని చెప్పారు. రాష్ట్రాల పరిధిలో వుండే హక్కులను కేంద్రం చేతుల్లోకి పోయే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుట్ర చేసిందని విమర్శించారు. తమకు సంపూర్ణ విశ్వాసం ఉంది.. మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది.. ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఫాల్స్ అని అన్నారు. ఎన్నికల కౌంటింగ్‌లో బీఆర్ఎస్ ప్రభంజనం వస్తుందని, కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని చెప్పారు.

గంజాయి తరలిస్తున్న వాహనం బోల్తా

- రూ.40 లక్షల విలువ గల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-జహీరాబాద్

గంజాయి తరలిస్తున్న ఓ వాహనం బోల్తా పడటంతో.. రెండు క్వింటాళ్ల గంజాయి పోలీసులకు పట్టుబడింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరిధిలోని బూచినెల్లి గ్రామ పరిధిలో గల జాతీయ రహదారి 65పై శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్యం ప్రాంతం నుంచి కారులో సుమారు రెండు క్వింటాళ్ల గంజాయిని తరలిస్తున్నారు. ప్రమాదవశాత్తు బూచినెల్లి గ్రామ పరిధిలో ఆ వాహనం బోల్తా పడింది. దాంతో రోడ్డుపై వెళ్తున్న వారు వాహనం వద్ద పరిశీలించగా గంజాయి సంచులు కనిపించాయి. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. చిరాక్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గంజాయితో పాటు.. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.40 లక్షల ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఉపా చట్టాన్ని ఎత్తివేయాలి

- భారత్ బచావో నాయకులపై అక్రమ కేసులను తొలగించాలి
- పౌరసమాజం క్రియాశీలంగా వ్యవహరించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో రాబోయే ప్రభుత్వం ఉపా చట్టాన్ని వ్యతిరేకించాలి

నిర్బంధ వ్యతిరేక వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



ఉపా చట్టాన్ని ఎత్తివేయాలనీ, భారత్ బచావో నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. నిర్బంధ వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ బీజేపీ భావజాలాన్ని, ఫాసిస్టు విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై వామపక్ష తీవ్రవాదులుగా ముద్రవేసి అక్రమంగా నిర్బంధిస్తున్నారని అన్నారు. రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రధాని మోడీ లాంటి వారే అసలైన తీవ్రవాదులని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువల కోసం పాటు పడుతున్న భారత్ బచావో నాయకులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ..నర్సింహారావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉపా చట్టాన్ని అమాయకులు, హక్కుల పోరాట యోధులపై పెడుతోందని విమర్శించారు. ఆ చట్టం ఎత్తివేయాలనే ప్రధాన డిమాండ్‌తో విశాల వేదికను ఏర్పాటు చేసి పోరాటం సాగించాలని సూచించారు. సీపీఐ(ఎం) పార్టీఈ చట్టాన్ని అన్ని వేదికలపై వ్యతిరేకించిందని గుర్తు చేశారు. నిర్బంధ వ్యతిరేక వేదిక చేసే పోరాటాలకు తమ పార్టీ పూర్తి మద్దతునిస్తుందని హామీ ఇచ్చారు.. తెలంగాణ జన సమితి అధ్యక్షులు కోదండరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే వారిపై కక్ష సాధించేందుకు పాలక పక్షాలు ఉపా చట్టాన్ని పావుగా వాడుకుంటున్నాయని అన్నారు. ఈ చట్టం వల్ల కలిగే అనర్ధాలపై జనబాహుళ్యంలో విస్తృతమైన సైద్ధాంతిక చర్చ జరగాలని ఆకాంక్షించారు. నిర్బంధ వ్యతిరేక వేదిక కన్వినర్ ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ డాక్టర్ గోపినాథ్, గాదె ఇన్నయ్య, జంజర్ల రమేశ్‌లపై పెట్టిన ఉపా కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టాడా, పోటా లాంటి చట్టాల స్థానంలో తీసుకు వచ్చిన ఊపా చట్టం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.

ఈ చట్టం కింద అరెస్టయిన వ్యక్తికి ఆరు నెలల వరకు బెయిల్ ఉండదని, ఎన్ని సంవత్సరాలైన కేసు కొనసాగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భీమా కోరేగాం కేసులో అరెస్టయిన సుధా భరద్వాజ్ లాంటి వారు ఐదేండ్లుగా జైల్లో మగ్గుతున్నారని గుర్తు చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ పాలక పక్షాలు ప్రశ్నించే గొంతుకలపై పెడుతున్న చట్టాన్ని వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. అధికార, రాజకీయ, న్యాయ వ్యవస్థలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా పని చేస్తున్నాయని అన్నారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ భారత్ బచావో నాయకులపై పెట్టిన కేసులు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు.

ఈ చట్టాన్ని ఎత్తి వేసేందుకు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా పోరాటం చేయాలని సూచించారు. వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ తెలంగాణలో దాదాపు 250 మొంది పై ఉపా కేసులు పెట్టారని అన్నారు. ప్రజా జీవితంలో ఉండే వారిపైన్నే కాకుండా, ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో అనేక మంది గిరిజనులపై కేసులు నమోదు చేసారని గుర్తు చేశారు.. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వం ఉపాకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జాతీయ అధ్యక్షురాలు సంధ్య, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోవర్దన్, ప్రముఖ సామాజిక వేత్త విస్సా కిరణ్, నిర్బంద వ్యతిరేక వేదిక నాయకులు నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలపై నిర్బంధం

భారత్ బచావో నాయకులు డాక్టర్ గోపినాథ్

కేంద్రంలోని బీజేపీ, తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు గడిచిన పదేండ్లలో తమ విధానాలనుప్రశ్నించే వ్యక్తులపై అక్రమంగా ఉపా కేసులు పెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ బచావో వేదిక ఆధ్వర్యంలో దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే డిమాండ్‌తో ఢిల్లీలో సమావేశం పెట్టినందుకు తమపై అక్రమంగా ఉపా కేసు నమోదు చేశారని అన్నారు. భారత దేశం ఫాసిస్టు విధానం వైపు వెళుతోందనీ, ఈ చర్యను అడ్డుకోవడానికి పౌరసమాజం ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు.

గెలుపు అధికారం కోసం, ఆధిపత్యం కోసం అయినపుడు, తీవ్రమైన పోటీ ఏర్పడుతుంది. ఎలాగైనా సరే గెలవాలనే ఆలోచనతో యుద్ధం జరుగుతుంది. ప్రజాస్వామిక వ్యవస్థగా చెప్పకొంటున్న పోటీలో, ప్రజలు గెలుస్తున్నారా! ప్రజాకాంక్షలు నెరవేరుతున్నాయా? అనేది ప్రశ్నగానే మిగులుతుంది. నేడు ఎన్నికలలో నిజాయితీగా ప్రజాభిమానాన్ని గెలుచుకుని నిలబడిన నాయకులు ఎంతమంది ఉన్నారు! నిజమైన ప్రజానాయకులకు ఈ ఎన్నికల పోటీలో స్థానముంటున్నదా! ఇవన్నీ గెలుపులు తేలాక సమీక్షించుకోవాల్సిన విషయాలు.



గెలుపు

సంపాదకీయం

గెలుపు ఎవరికైనా బోలెడంత సంతోషాన్ని, ఉత్సాహాన్నీ ఇస్తుంది. గెలుపోటములన్నీ మన సామాజిక నిర్మాణాల్లోంచి వచ్చినవే. అసలు గెలవటం అంటే ఏమిటో నిర్వచించుకుంటే ఓటమి కుంగుబాటూ, నిరుత్సాహము అనే వాటిని గెలవగలుగుతాము. గెలుపంటే విజయం అని కూడా. పూర్వము రాజులు రాజ్యాల కోసం యుద్ధం చేసి, ఎదుటి రాజ్యాన్ని ఆక్రమించుకోవటాన్ని విజయమని పేర్కొనేవాళ్లు. రాజ్యమే కాదు, ఏదైనా పోటీ పడటంలోనే గెలుపు అనేది వస్తుంది. ఆటలు, చదువులు, కుస్తీలు అన్నీ నేడు పోటీలే. జ్ఞాన సముపార్జనలోనూ పోటీలు, గెలుపోటములు, సంపాదన, ఖర్చుల్లోనూ ఇది పెరిగిపోయింది. పెట్టుబడిదారీవిధాన ఫలితం ప్రతి అంశంలోనూ ఈ పోటీని, గెలుపు ఓటమిని తీసుకువచ్చింది. అయితే మంచితనం, మానవీయత కలిగి వుండటంలో ఈ పోటీతత్వం లేదు. నిజాయితీ, విలువలుగల ఉన్నత జీవనంలో ఈ పోటీలు లేవు. ఎందుకంటే వీటి వెనకాల ధనానికి, వ్యాపారానికి అవకాశం లేదు. పోటీలు పెరిగిన ప్రతి అంశం వెనకాల వ్యాపా రాత్మక ధన ప్రమేయాన్ని మనం చూస్తాము.

వెలుగునంటుకొని చీకటి వున్నట్లుగానే, కుడి ఎడమలున్నట్లే గెలు పున్నచోటే ఓటమీ వుంటుంది. అయితే ఏ గెలుపూ శాశ్వతం కానట్లే ఓటమీ శాశ్వతం కాదు. ఈ వ్యవస్థలో ఎప్పటికీ కొన సాగేది పోటీ మాత్రమే. నెగ్గినవాడు తానధికుడని భావిస్తాడు. ఓడినవారు కొందరు నిరాశకు లోనయి కుంగిపోతారు. మరి కొందరు కసితో రగిలిపోతారు. ఇంకొందరేమో ఓటమి కారణా లను సమీక్షించుకొని పాఠాలు నేర్చుకుంటారు. తిరిగి గెలుపు కోసం ప్రయత్నాలు మొదలెడతారు. గెలిచిన వారిలో కొందరు నమ్రతగా వ్యవహరించి తమ గెలుపు కొనసాగేట్లు చూసుకుం టారు. క్రీడలలో మాత్రం ఆడటమే ఉత్సాహాన్ని నింపుతుంది. గెలుపు ఓటములనేవి ఆటలో ఒక భాగం మాత్రమే. కానీ ఆటకూ మతాన్ని, కులాన్ని, ప్రాంతాన్ని అంటగట్టి గెలుపు ఓట ములు లెక్కించినపుడు, అవి విభేదాలకు, విద్వేషాలకు దారి తీస్తాయి. ఓటమిని జీర్ణించుకోలేనితనమూ ఏర్పడుతుంది. ఆటలదలా వుంచితే. గెలుపు అధికారం కోసం, ఆధిపత్యం కోసం అయినపుడు, తీవ్రమైన పోటీ ఏర్పడుతుంది. ఎలాగైనా సరే గెలవాలనే ఆలోచనతో యుద్ధం జరుగుతుంది. ప్రజాస్వామిక వ్యవస్థగా చెప్పకొంటున్న పోటీలో, ప్రజలు గెలుస్తున్నారా! ప్రజా కాంక్షలు నెరవేరుతున్నాయా? అనేది ప్రశ్నగానే మిగులుతుంది. నేడు ఎన్నికలలో నిజాయితీగా ప్రజాభిమానాన్ని గెలుచుకుని నిలబడిన నాయకులు ఎంతమంది ఉన్నారు! నిజమైన ప్రజా నాయకులకు ఈ ఎన్నికల పోటీలో స్థానముంటున్నదా! ఇవన్నీ గెలుపులు తేలాక సమీక్షించుకోవాల్సిన విషయాలు.

గెలవడం కోసం మనం ఎన్నిసార్లు మనుషులుగా ఓడిపోతున్నామో ఎపుడైనా ఆలోచించామా! గెలవడం కోసం నిజాయితీని, నీతిని, ధర్మాన్ని, న్యాయాన్ని ఎంత ఫణంగా పెడతామో! ఎన్నికల సందర్భంగానైతే, డబ్బును, మద్యాన్ని, కులాన్ని, మతాన్ని, ప్రాంతాన్ని, అన్నింటినీ పోటీలో తమకు బదులుగా నిలబెడతాంకదా! అంతేకాదు, బెదిరింపులకు, బల ప్రయోగాలకు, హతమార్చడానికి, హత్యలకూ పూనుకుంటాము. ఇవన్నీ ప్రయోగించిన మీదట గెలిచినది ఎవరని ఒకసారి ప్రశ్నించుకుంటే, వ్యక్తులది గెలుపు కాదని తెలిసిపోతుంది. అపుడు గెలవటమనేది నిలువెత్తు ఓటమిలా కపనడుతుంది. నేటి ఎన్నికలలోనయితే గెలిచిన వారందరి గెలుపు వారిదికానే కాదు. డబ్బు ఆధిపత్యం గల సమాజంలో ప్రతిదీ డబ్బు సాధించేదే. డబ్బే అన్ని కొనిపెడుతుంది. అమ్మిపెడుతుంది కూడా.

అయినా ఈ గెలుపే అధికారాన్ని తెచ్చి పెడుతుంది. ఎవరు తమ గెలుపుకు కారణమో వారివైపే గెలిచిన వారు నిలుస్తారనేది. చెప్పక పోయినా తెలిసే విషయం. ఆ విషయాలెలా వున్నా, గెలుపు వెనకాల ఎన్నో ఓటములు దాగున్నాయని అర్థం చేసుకోవాలి. గెలుపోటముల గూర్చి సామాజిక విమర్శకులేమంటారంటే, 'గెలుపు నిన్ను ప్రపంచానికి పరిచయం చేస్తే ఓటమి, నీకు ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది' అని కాబట్టి ఈ గెలుపోటములను అర్థం చేసుకుని, పాఠాలను తీసుకుని భవిష్యత్తును నిర్మించుకోవటమే మనం నిరంతరం చేయాల్సిన పని. ఈ సామాజిక పరిణామక్రమంలో వెనక్కు తిరగకుండా ముందుకు మునుముందుకు కదలిపోవటమే నిజమైన గెలుపు. విలువలను, మానవీయతను వొదిలివేయటమే ఓటమి.

ఎగ్జిట్ లెక్కలు ఎంత నిజం?

ఓటింగు కౌంటింగు మధ్యలో ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ అనే మకో మధ్యంతర దశ ప్రవేశించింది. అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఇప్పుడు మనముందు ఆవిష్కరించబడ్డాయి. అంతకంతకూ విస్తరించిన ఈ మధ్యంతర ఘట్టానికి రాజ్యాంగపరంగా గానీ, రాజకీయ విలువగాని లేకున్నా ప్రజల పార్టీల ఉత్సుకతను పెంచేస్తున్నది. పోలింగు ముగిసీముగియక ముందే పోటాపోటీగా వెలువడే ఈ ఎగ్జిట్ ఫలితాలు ఒక ప్రీ కౌంటింగ్ ప్రహసనంగా తయారైనాయి. ఒపీనియన్ పోల్స్, సర్వేలు అన్నవి విస్తరించిన కొద్దీ ఎగ్జిట్ పోల్స్ కూడా అనివార్య ఘట్టంగా మారాయి. సోషల్‌మీడియా, మీడియా, మార్కెటింగ్ ఎన్నికల ప్రక్రియలో కీలకపాత్రలోకి మారాక వ్యాపార పరంగానూ ఇదో వ్యవస్థగా తయారై కూచుంది. ఆయా పార్టీల కమిటీలు నాయకత్వాలు సమావేశాలు గాక వ్యూహకర్తలే ఎన్నికల విధానాల నిర్ణాయకులైనందువల్ల తమ పాత్రను చూపించుకోవడానికి కూడా వారికి దశల వారీ సాధనాలుగా ఇవన్నీ అక్కరకు వస్తున్నాయి. ఇదిగాక భారీ బెట్టింగుల కోసం కూడా అనేక వలలు. ఇన్ని వ్యూస్, ఇన్ని క్లిక్స్, ఇన్ని లైక్స్, విజిటర్స్ అంటూ చూపించడం



తెలకపల్లి రవి

ఎగ్జిట్‌పోల్స్ ఓటింగు తర్వాత వస్తాయి గనక పార్టీలకు పెద్దగా ఉపయోగపడవు. కానీ సర్వే సంస్థలతో కుదుర్చుకునే ఒప్పందాలలో అవీ భాగంగా వుంటాయి.వాటి వ్యాపారం కోసమే గాక పోటీలో ప్రత్యేకత నిలబెట్టుకోవడానికి కూడా ఏవో చిట్కాలు ప్రయోగించడం కద్దు. మీడియా చర్చల సందర్భంలోనూ ఇతరత్రానూ ఇలాంటివారితో మాట్లాడితే చిత్రమైన సంగతులు చెబుతుంటారు.ఆయా పార్టీల ప్రభుత్వాల నాయకులను కలుస్తూ నిరంతర సంబంధాలు నెరుపుతుంటారు. ప్రత్యర్థి పార్టీల తరపున కూడా పనిచేస్తుంటారు. ప్రశాంత్ కిశోర్ మోడీకి, రాహుల్‌కు కూడా కూడా పనిచేయడం విడ్డూరమేమీ కాదు.ఏదైనా తప్పుచెబితే తమ మనుగడకే ముప్పు గనక కావాలని ఎందుకు చెబుతామని వారంటుంటారు. కానీ మీడియా ప్రచారం,సర్వేలు, యాడ్లు అన్ని కలిసిన ప్యాకేజీలు గనక రకరకాల సేవలు తప్పవు.

క్లయింట్లయిన రాజకీయ పార్టీలనూ అభ్యర్థులనూ ఒప్పించే ప్రక్రియగా మారింది. 1990లలో ప్రణయ్‌రాయ్ ఎన్‌డిటీవీ టీం భారతీయులను దగ్గర చేసిన ఈ ప్రక్రియ ఇప్పుడు అచ్చంగా వ్యాపార రాజకీయ పోటీగా మారింది. సాంకేతికంగా దాని పరిమితులు ఒక క్రమపద్ధతిలో నిర్వహించినా వుండే తేడాలు ఒకటైతే అచ్చమైన వ్యాపారంగా మారాక దీని ప్రామాణికత అసలే ప్రశ్నార్థకమవుతున్నది. చాలాసార్లు నిజమైనా కొన్నిసార్లు ఘోరంగా దెబ్బతిన్నా ఎగ్జిట్‌పోల్స్ చర్చను మాత్రం దాటేయగల స్థితి ఇప్పుడు లేదు. ఎగ్జిట్ అనుకూలంగా వచ్చినవారు ఆనందిస్తే రానివారు అసహనానికి గురైతే ఎటొచ్చీ పూర్తి ఫలితాలకోసం వేచిచూడడం అనివార్యమే అవుతుంది. కాకపోతే ఈలోగా మీడియా చర్చలకూ పార్టీల పరస్పర సవాళ్లకు మరో కొత్త అస్త్రం దొరికినట్టయింది.

తెలంగాణలో ప్రభుత్వం మార్పు?

తెలంగాణలో అత్యధిక ఎగ్జిట్లు కాంగ్రెస్‌కు ఆధిక్యతను సూచిస్తున్నాయి. ఆ పట్టికలు పరస్పర తేడాలు చూడొచ్చు. అదే సమయంలో మూడు నాలుగు సంస్థలు బీఆర్‌ఎస్‌కే మెజార్టీ వస్తుందని చెప్పినవీ వున్నాయి కానీ వాటిని పెద్దగా పరిగణనలోకి తీసుకోవడం లేదు. హంగ్ వస్తుందని కూడా సూచనలు వున్నాయి. కానీ ఎక్కువ భాగం కాంగ్రెస్‌కే ఇచ్చాయి గనక అంతకుముందు నుంచి ఈ మాట వినిపిస్తున్నది గనక బీఆర్‌ఎస్ ఓటమి తప్పదనే తరహాలో చర్చలు నడుస్తున్నాయి.ఆ పార్టీ నేత కేటీఆర్ మాత్రం ఎగ్జిట్లు చెత్త అని తాము 70 స్థానాలు తెచ్చుకుంటామని ప్రకటిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు 25కంటే రానివ్వబోమంటున్నారు. ఇక బీజేపీ నేతలైతే హంగ్ అంచనాలు కొనసాగిస్తున్నారు. హంగ్ వస్తే బీఆర్‌ఎస్ బీజేపీ మద్దతు తీసుకుంటుందా అనేది ఒక ప్రశ్న అయితే, కాంగ్రెస్ తన ఎంఎల్‌ఎలను నిలబెట్టుకోవడం సవాలవుతుందనే అభిప్రాయాలున్నాయి. ఇప్పటికే ఆ పార్టీ ఎంఎల్‌ఎలను శిబిరాలకు తరలిస్తున్నట్టు సమాచారం. కర్నాటకలో ఇలాంటి వ్యవహారాలలో ఆతితేరిన ఉప ముఖ్యమంత్రి, రేవంత్ సన్నిహితుడు డికె శివకుమార్ ఆ పనిలో పడ్డారని అంటున్నారు. ఈ నాటకీయ పరిణామాల మధ్య ఎవరి లెక్కల్లో వారు మునిగితేలుతున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లోనూ కాంగ్రెస్ ఏదో విధంగా అధికారం నిలుపుకోగలుగుతుందని ఎగ్జిట్లు చాలావరకూ చెబుతున్నాయి. అలాగే బీజేపీ మొదటినుంచి ఎక్కువ ఆశ పెట్టుకున్న రాజస్థాన్‌లో దానికి అనుకూలత కనిపిస్తుంది. కానీ కాంగ్రెస్ కూడా దగ్గరలోనే వుంది. ఇక మధ్యప్రదేశ్‌లో ఎవరు గెలుస్తున్నారన్న దానిపై పరస్పర తేడాలతో అంచనాలు వెలువడ్డాయి. కొన్ని కాంగ్రెస్‌కు కొన్ని బీజేపీకి మొగ్గుచూపాయి. మిజోరాంలోనూ ఎంఎన్‌ఎఫ్ పెద్ద పార్టీగా వుండగా దాని తర్వాత జెడ్‌పిఎం, కాంగ్రెస్ వున్నాయి. ఈశాన్యంలో తాను బాగా బలపడ్డానని చెప్పే బీజేపీ ఇక్కడ కూడా ఒకటి రెండు సీట్లకు పరిమితంఅవుతున్నట్టు ఎగ్జిట్లు అంటున్నాయి. రాజకీయంగా ప్రధాని మోడీ మంత్రజాలం పెద్దగా పనిచేయలేదన్నది ఈ సర్వేలన్నిటిలోనూ విదితమవుతున్నది. కాంగ్రెస్ పట్ల మొగ్గు పెరిగినా పోటాపోటీగానే వున్నట్టు కనిపిస్తుంది. కాంగ్రెస్ నేతల కలహాలు, లౌకికపార్టీల విశాల ఐక్యతకు ఆపార్టీ సహకరించకపోవడం వల్ల ప్రతిచోటా సందిగ్ధతే కొనసాగుతుందనిపిస్తుంది. లోక్‌సభ ఎన్నికల ముందు ఇది బీజేపీకి ఓటర్ల హెచ్చరికగానే భావించాల్సి వుంటుంది.

జాతీయంగా గత ప్రహసనాలు

ఏమైనా మౌలికంగానే ఇవి పరిశీలనలే గానీ ఫలితాలు కావు. సర్వేలకన్నా ఎగ్జిట్లకు కొంత వాస్తవికత వుందని అంటుంటారు గాని అదేస్థాయిలో పరిమితులు కూడా వుంటాయి. అందుకే ఎగ్జిట్ ఎక్సాక్ట్ కాదనే నానుడి ఏర్పడింది. ముందే చెప్పుకున్నట్టు వీటికి ఏ విధమైన ప్రామాణికత ఇవ్వడం కష్టం. స్థూలంగా వాటిలో చెప్పిన వారు గెలిస్తే పర్వాలేదనుకోవడం తప్ప ఎగ్జిట్ లెక్కల ఆధారంగా మరీ లోతుల్లోకి వెళ్లి వ్యాఖ్యలు విశ్లేషణలు చేయడానికి ఖచ్చితమైన ప్రతిబంధకాలున్నాయి. పైగా గతంలో చాలాసార్లు ఈ ఎగ్జిట్లు తారుమారైన ఉదాహరణలున్నాయి. ఎక్కడిదాకానో ఎందుకు తెలుగు రాష్ట్రాలలోనే 2018, 2019 ఎన్నికల ఎగ్జిట్లకు వాస్తవ ఫలితాలకు చాలా తేడాలొచ్చాయి. 2004లో వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్‌డిఎ మళ్లీ ఆధిక్యత సాధిస్తుందని 240 నుంచి 250 స్థానాలు తెచ్చుకుంటుందని ఎగ్జిట్లు చెబితే వాస్తవంలో 187కు పరిమితమైంది. కాంగ్రెస్ కూటమికి 170 నుంచి 205 వస్తాయని చెబితే వాస్త వంలో 216 వచ్చాయి. ఈ ఉదాహరణలలోకెల్లా దారు ణమైంది ఉత్తరప్రదేశ్‌లో 2007లో మాయావతి బీఎస్పీ పూర్తి మెజార్టీ తెచ్చుకోవడం. చాలామంది బీఎస్పీ పెద్ద పార్టీగా రావచ్చని అంచనా వేసిన వారు కూడా పూర్తి మెజార్టీ ఊహించలేదు. 117-168మధ్య ఆమెకు సీట్లు వస్తాయని లెక్కలేయగా వాస్తవంలో ఏకంగా 206 తెచ్చుకుని అయిదేళ్లు పాలించారు. 2014లో మోడీకి అనుకూలత చూపినా బీజేపీకి మెజార్టీ వస్తుందని చెప్పలేకపోయాయి. ఒకరు మాత్రం 300 వస్తాయని చెప్పిందీ నిజం కాలేదు. ఆ తర్వాత 2015లో బీహార్‌లో నితీశ్‌కుమార్ బీజేపీతో విడగొట్టుకుని ఆర్జేడీతో కలసి పోటీ చేసినప్పుడు కూడా ఆ కూటమి ఘనవిజయం ఎగ్జిట్లకు అందలేదు. 2017లో యూపీలో యోగి మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు కూడా ఎగ్జిట్లు పూర్తి ఆధిక్యతను పసిగట్టలేకపోయాయి. కొన్నిసార్లు పూర్తి విరుద్ధంగా వచ్చాయి. కేరళలో గతసారి మాత్రం పినరాయి విజయన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని దాదాపు అన్ని ఎగ్జిట్లు అంచనా వేశాయి. ఎగ్జిట్లు నిజమైతే ఎవరూ మాట్లాడుకోరు, తప్పయితే మాత్రం దాడి చేస్తారు అని సర్వే సంస్థలు అంటుంటాయి. అయితే పాలకవర్గ పార్టీలు సర్వేలను కూడా ప్రచారాస్త్రాలుగా మార్చుకోవడం వల్లనే ఈ సందేహాలు పెరుగుతున్నాయి. బిగ్‌డేటాతో తిమ్మిని బొమ్మిని చేస్తామనే వ్యూహకర్తలు అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలు ప్రజాభిప్రాయ ప్రకటనను ప్రహసనంగా చేశాయి. కార్పొరేట్ సంస్థల ప్రవేశం మరింత గందరగోళానికి దారి తీసింది. 1980లో ఇందిరాగాంధీ పునరాగమన ఎన్ని



2004లో వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్‌డిఎ మళ్లీ ఆధిక్యత సాధిస్తుందని 240 నుంచి 250 స్థానాలు తెచ్చుకుంటుందని ఎగ్జిట్లు చెబితే వాస్తవంలో 187కు పరిమితమైంది. కాంగ్రెస్ కూటమికి 170 నుంచి 205 వస్తాయని చెబితే వాస్తవంలో 216 వచ్చాయి. ఈ ఉదాహరణలలోకెల్లా దారుణమైంది ఉత్తర ప్రదేశ్‌లో 2007లో మాయావతి బీఎస్పీ పూర్తి మెజార్టీ తెచ్చుకోవడం. చాలా మంది బీఎస్పీ పెద్దపార్టీగా రావచ్చని అంచనా వేసిన వారు కూడా పూర్తి మెజార్టీ ఊహించలేదు. 117-168 మధ్య ఆమెకు సీట్లు వస్తాయని లెక్కలేయగా వాస్తవంలో ఏకంగా 206 తెచ్చుకుని అయిదేళ్లు పాలించారు.2014లో మోడీకి అనుకూలత చూపినా బీజేపీకి మెజార్టీ వస్తుందని చెప్పలేకపోయాయి.

కలతో మొదలై ఆమె హత్యానంతరం 1984 ఎన్నికలలో రాజీవ్‌గాంధీ హయాంలో ఈ మార్కెటింగ్ విజృంభించింది. 2013 మోడీ అభ్యర్థిత్వం నాటికి పరాకాష్టకు చేరింది. కార్పొరేట్ కాన్సెప్ట్ క్యాచీ క్యాంపైన్స్ ఓటర్లపై ప్రయోగించబడుతున్నాయి. బెట్టింగ్ సర్వేలు కలిపిన వ్యాపార సామ్రాజ్యాలేర్పడ్డాయి. 2018లో రేపు తెలంగాణ పోలింగ్ అనగా ఒకరోజు ముందు అత్యంత హాస్యాస్పదమైన సర్వే విడుదల చేసిన మాజీ ఎంపీని ఉదంతం ఎవరు మర్చిపోగలరు? ఈ ధోరణి ముదిరి పోయి ఉపఎన్నికలకు కూడా సర్వే సంస్థలను రంగంలోకి దించడం, ముందే ఒక క్రమపద్ధతిలో ప్రచారం చేయడం అంచనాలు వదలడం పరిపాటిగా మారింది. పార్టీల పోటీ కాస్త సర్వే సంస్థల పోటీగా మారింది.

తెలంగాణలో అత్యధిక ఎగ్జిట్లు కాంగ్రెస్‌కు ఆధిక్యతను సూచిస్తున్నాయి.ఆ పట్టికలు పరస్పర తేడాలు చూడొచ్చు.అదే సమయంలో మూడు నాలుగు సంస్థలు బీఆర్‌ఎస్‌కే మెజార్టీ వస్తుందని చెప్పినవీ వున్నాయి కానీ వాటిని పెద్దగా పరిగణనలోకి తీసుకోవడం లేదు. హంగ్ వస్తుందని కూడా సూచనలు వున్నాయి. కానీ ఎక్కువ భాగం కాంగ్రెస్‌కే ఇచ్చాయి గనక అంతకుముందునుంచి ఈ మాట వినిపిస్తున్నది గనక బీఆర్‌ఎస్ ఓటమి తప్పదనే తరహాలో చర్చలు నడుస్తున్నాయి.ఆ పార్టీ నేత కేటీఆర్ మాత్రం ఎగ్జిట్లు చెత్త అని తాము 70 స్థానాలు తెచ్చుకుంటామని ప్రకటిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు 25కంటే రానివ్వబోమంటున్నారు. ఇక బీజేపీ నేతలైతే హంగ్ అంచనాలు కొనసాగిస్తున్నారు.

వ్యూహకర్తల విన్యాసాలు

ఎగ్జిట్‌పోల్స్ ఓటింగు తర్వాత వస్తాయి గనక పార్టీలకు పెద్దగా ఉపయోగపడవు. కానీ సర్వే సంస్థలతో కుదుర్చుకునే ఒప్పందాలలో అవీ భాగంగా వుంటాయి. వాటి వ్యాపారం కోసమే గాక పోటీలో ప్రత్యేకత నిలబెట్టుకోవడానికి కూడా ఏవో చిట్కాలు ప్రయోగించడం కద్దు. మీడియా చర్చల సందర్భంలోనూ ఇతరత్రానూ ఇలాంటివారితో మాట్లాడితే చిత్రమైన సంగతులు చెబుతుంటారు. ఆయా పార్టీల ప్రభుత్వాల నాయకులను కలుస్తూ నిరంతర సంబంధాలు నెరుపుతుంటారు. ప్రత్యర్థి పార్టీల తరపున కూడా పనిచేస్తుంటారు. ప్రశాంత్‌కిశోర్ మోడీకి, రాహుల్‌కు కూడా కూడా పనిచేయడం విడ్డూరమేమీ కాదు.ఏదైనా తప్పుచెబితే తమ మనుగడకే ముప్పు గనక కావాలని ఎందుకు చెబుతామని వారంటుంటారు. కానీ మీడియా ప్రచారం, సర్వేలు, యాడ్లు అన్ని కలిసిన ప్యాకేజీలు గనక రకరకాల సేవలు తప్పవు. రాజకీయ మొగ్గులూ వుంటాయి. ఒకప్పుడు ఇలాంటి సేవలందించిన వారెందరో తర్వాత ఆయా పార్టీలలో చేరడం చూస్తాం. ఉదాహరణకు బీజేపీ ఎంపీ జీవిఎల్ నరసింహారావు సెఫాలజిస్టుగా పనిచేసిన వారేనని అందరికీ తెలుసు. ప్రశాంత్‌కిశోర్ రాజకీయ పాత్రకోసం ఎలా తహతహలాడుతున్నదీ చూస్తున్నాం, యోగేంద్రయాదవ్ విషయం కూడా సెఫాలజిస్టుగా చేసి తర్వాత ప్రజా జీవితంలోకి వచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ ఈ సారి సురేష్ కనుగోలు సేవలు తీసుకుంది. ఆయన కూడా ప్రశాంత్ కిశోర్‌తో పనిచేసిన వారే. తమాషా ఏమంటే రాహుల్, ప్రియాంకలే గాక రాష్ట్ర నాయకులతో సహా ఎవరు ఎప్పుడు ఏ విషయం లేవనెత్తాలి, ఏ సభలో ఏ సందర్భంలో ఏ అంశం తీసుకెళ్లాలి వంటిది కూడా వీరే నిర్దేశిస్తారట. మాకు సలహాలివ్వడం గాక మేము ఏం చేయాలో కూడా వారే చెబితే ఎలా అంటూ బీఆర్‌ఎస్ ప్రశాంత్ టీమ్‌ను పంపేసిందని కేటీఆర్ సూచనగా చెప్పారు. ఏపీలో మాత్రం వీరి సేవలు ప్రభుత్వ యంత్రాంగంలోకి కూడా చొరబడుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇది మార్కెటీకృత ప్రజాస్వామ్యమన్నమాట. ఈ క్రమంలో ఇప్పుడొచ్చిన ఎగ్జిట్ ఫలితాలు మిశ్రమ సంకేతాలిచ్చాయనేది వాస్తవం. నిజమైన ఫలితాలతో ఇవి సరిపోలుతాయా లేదా అనేది రేపటికిగానీ తేలదు. వాస్తవ ఫలితాలకూ ఎగ్జిట్ల ప్రదర్శనకూ మధ్య ఎంత తేడా వుందో ఎన్నిరకాల తేడా వుందో అప్పుడే తెలుస్తుంది. అయినా ఈ రాజకీయ వ్యాపార క్రీడ మాత్రం ఆగదు.

ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎటువైపు?


నెలన్నర ఎన్నికల ప్రచార హడావిడి ముగిసింది. పోలింగ్ కూడా ప్రశాంతంగా జరిగింది. నేడు ఫలితాలు. అయితే ఈ తడవ ఎన్నికల్లో ఓ ప్రత్యేక విషయం వ్యక్త మౌతుంది. అనేక సందర్భాల్లో ఏకపక్ష గాలి వీచి పార్టీల అంచనాలు తారుమారైన సందర్భాలున్నవి కానీ ఈ సారి అనూహ్యంగా కమ్యూనిస్టులకు, కాంగ్రెస్‌కు కాలం పట్టంగట్టే అవకాశాలు మెండుగా వున్నట్టున్నాయి. ఒక్కసారిగా బీజేపీ శిబిరం ఖాళీ కావటమే కొంత ఆశ్చర్యానికి గురి చేస్తుంది. పెద్ద పెద్ద నాయకులు చిన్న ఉపన్యాసాలతో రాష్ట్రంలో విన్యాసాలు చేసి వెళ్లారు. నిజానికి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల కన్న నిప్పులా రాజేసుకుంటున్న ప్రభుత్వ వ్యతిరేక ఓటు బాగా పెరిగిందనే చర్చజరుగుతోంది. ఈ వ్యతిరేక ఓటు ఎవరిని వరిస్తే వారిదే గెలుపు. అయితే ప్రజలు కూడా గెలుపు గుర్రాలకే ఓటు అన్న చందాన కాంగ్రెస్ పార్టీ పంచన చేరుతున్న సంకేతాలు స్పష్టంగా ఉన్నవి. అయితే పదేళ్ళ పాలనానంతరం మార్పు కావాలనే ప్రచారం జోరుగానే సాగుతున్నది. అయితే గెలుపెవరిదైనా ప్రకటించిన హామీల పరంపర ఒకింత భయాన్ని కలిగించేలా ఉన్నది.



జి.తిరుపతయ్య
9951300016

విపరీత హామీలే వినాశకర పరిపాలనకు నాంది పలుకుతున్నాయి. అధికార పార్టీ లేదా ప్రతిపక్ష పార్టీ ఏదైనా త్వరలోనే కొత్త ప్రభుత్వం కొలువు దీరనుంది. అయితే ఈసారి ఎన్నికల్లో ఇచ్చిన హామీల పైత్యం రాజకీయ నాయకులకు బాగా పెరిగిందనే చర్చ నడిచింది. ఫలానా పార్టీ ప్రకటించే ఉచిత పథకాలకు సరిపడా రాష్ట్ర ఖజానా లేదు అంటూ వాదిస్తూనే అన్ని పార్టీలు అదేవిధంగా తాయిలాల్ని ప్రకటించడానికి వెనుకాడ లేదు. రోజు నాలుగు నుంచి పది మహాసభల్లో ప్రసంగించిన నాయకులకు తామేమి మాట్లాడుతున్నామో, తామేమి వరాలిస్తున్నామో? ఆ వరాల ఫలితాలు, ప్రతిఫలాలు ఎలా ఉంటాయో మైమరచి విపరీత పోకడలకు పోయారు. మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ ప్రాంతంలో నిర్వహించిన బహిరంగసభలో తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు ప్రసంగిస్తూ మైనారిటీ యువకులకు ఐటీ హబ్ ప్రత్యేకంగా నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. వెంటనే ప్రధాని మోడీ రంగంలోకి దిగి ధర్మం పేరిట ఐటీ హబ్‌లు ఏర్పాటు చేయడం వీలవుతుందా? ఇది మైనారిటీలను, ముస్లిం మతస్తులను ఆకట్టు కోవడం చేస్తున్న ఎత్తుకాదా?.. అంటూ కేసీఆర్‌పై విరుచుకుపడ్డారు. అవును.. కులం, మతం, ప్రాంతం ఆధారంగా రాజకీయాలు నేరపరాదు! పరిపాలనలో అలాంటి వాటికి స్థానం కల్పించరాదు. ఇదే సందర్భంగా ఒక ఆశ్చర్యకరమైన విష యాన్ని మనం గుర్తుకు తెచ్చుకోవాలి. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై, బీఆర్‌ఎస్ పార్టీ అనేక వారంటీలపై స్పందిస్తూ బీజేపీ అగ్రనాయకులు అమిత్‌షా తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఉచితంగా గ్యాస్ సిలిండర్లు వంటివి ఇస్తామని ప్రకటిస్తూనే, పాల్గొన్న ప్రతి బహిరంగసభలోనూ అయోధ్యలో నిర్మితమవుతున్న రామమందిర దర్శనాన్ని ఉచితంగా కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఇందులో ప్రశ్నించవలసిన మొదటిది ఏమంటే ఒక తీర్థయాత్ర లేదా పుణ్యక్షేత్ర దర్శనం కూడా ఓటర్లను ఆకర్షించే విధంగా రాజకీయాలను దిగజార్చడం. రెండవది రామమందిరం దర్శనానికి ఎవరు ఆసక్తి చూపుతారు? కేవలం ఒక ధర్మానికి సంబంధించిన వారు మాత్రమే కాదా? గురివింద గింజ తన మచ్చ ఎరుగనట్టుగా రాజకీయాలను పూర్తిగా అస్తిత్వ స్థాయికి తోసి వేసిన ఘనత ఇలాంటి పార్టీ వాళ్లదే కాదా? ముస్లిం లకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని బీఆర్‌ఎస్ ప్రకటిస్తే, ఆ రిజర్వే షన్లను రద్దు చేస్తామని బీజేపీ ప్రకటించింది. మరోచోటకు వెళ్లి గిరిజనులకు పన్నెండు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని బీజేపీయే చెబుతున్నది. ఈ ప్రకటన లన్నీ రాజకీయ ఆధిపత్యం కోసం సామాన్య ప్రజల మనోభావాలను అడ్డం పెట్టుకున్నట్టుగానే కనిపిస్తున్నాయి తప్ప నిజాయితీలేదు. ఎందుకంటే రిజర్వేషన్లు కల్పించాలంటే రిక్రూట్‌మెంట్లు ఉండాలి. నియా మకాలు లేకుండా నీతి వాక్యాలు ఎన్ని వల్లించినా ఉపయోగమేంటి? కేంద్రస్థాయిలో పరిపాలన సాగిస్తూ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రాజకీయ విధానానికి తెరతీసిన బీజేపీ అస్తిత్వవాద రాజకీయాలు తప్ప సమధర్మపాలన అనే ఆలోచన దాదాపు తక్కువే.



తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఓటర్లు తరచుగా ప్రభుత్వాలను మారుస్తుంటారు. నేడది తెలంగాణాలో ప్రతిబింబించేలా కనిపిస్తున్నది. ఏ పార్టీపై కూడా వ్యతిరేకత ఉండాల్సిన అవసరం లేదు. అభివృద్ధి పనులు జరిగినా నియంతత్వానికి ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలనలు అవకాశమిస్తున్నాయి. మితిమీరిన అహంకారం, నియంతత్వం, లెక్క చేయనితనం పెరిగిపోకూడదు. అలాంటివి గమనిస్తే ఓటర్లు పోలింగ్ బూతుల్లో సమా ధానం చెబుతారు. ఒక వేళ కాంగ్రెస్‌కు అవకాశమొస్తే గతంలో చేసిన పొరపాట్లను చేయకుండా ప్రజా ఆశీర్వాద పనులు చేసుకునే అవకాశమున్నట్లే. బీఆర్‌ఎస్ మెజార్టీ వస్తే ఈ ఎన్నికల ప్రచారంలో వ్యతిరేకంగా వీచిన గాలి తప్పకుండా ఒళ్లు దగ్గరబెట్టుకునేలా చేస్తుంది. ఎన్నికల సంఘం కన్నుగప్పి ఎక్కువ ఖర్చు చేసినా ప్రజలు మాత్రం రాజకీయాలపై చాలా చర్చలు జరిపారు. ఈ ఆలోచనలన్నీ ఆచరణల్లోకి మారి మార్పుకు నాంది పలికితే ఆహ్వానించదగినదే. ఏది ఏమైనా నేటి ప్రజాతీర్పు కోసం వేచిచూడాల్సిందే.

ప్రకటనలన్నీ రాజకీయ ఆధిపత్యం కోసం సామాన్య ప్రజల మనోభావాలను అడ్డం పెట్టుకున్నట్టుగానే కనిపిస్తున్నాయి తప్ప నిజాయితీ లేదు. ఎందుకంటే రిజర్వేషన్లు కల్పించాలంటే రిక్రూట్‌మెంట్లు ఉండాలి. నియామకాలు లేకుండా నీతి వాక్యాలు ఎన్ని వల్లించినా ఉపయోగమేంటి? కేంద్రస్థాయిలో పరిపాలన సాగిస్తూ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రాజకీయ విధానానికి తెర తీసిన బీజేపీ అస్తిత్వవాద రాజకీయాలు తప్ప సమధర్మపాలన అనే ఆలోచన దాదాపు తక్కువే.

'పెట్టెలో' ఏముంది...?

పెట్టె అంటే డబ్బా. డబ్బా అంటే బాక్సు. ఆ పెట్టె గళ్ళా పెట్టె కావచ్చు. పుస్తకాల పెట్టె కావచ్చు. మందులుండొచ్చు. విలువైన పత్రాలుండవచ్చు. లేదా ఖాళీగానో ఉండొచ్చు. ఇంట్లో సద్దిపెట్టె కూడా ఒక పెట్టెనే. సూటుకేసులు, బ్యాగులు కూడా పెట్టెలే. రూపు మారిందంతే. అవే ఇప్పుడు మనుషుల రూపు కూడా మారుస్తాయి. వారి భవిష్యత్తునూ మారుస్తాయి. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశ పెడతారు. అందులో ఆదాయమెంత, ఖర్చులు దేనికి ఎంత చేయాలి, అసలు వేటిపై ఖర్చు పెట్టకూడదు, ఆదాయం కావాలంటే వేటిని అమ్మాలి ఇలాంటివన్నీ ఉంటాయి. ఇక్కడ బడ్జెట్ అంటే ఏమిటో, ఆ పదం ఎక్కడినుండి వచ్చిందో తెలుసుకోవాలి. ఫ్రెంచి భాషలో బడ్జెట్ అంటే బ్రీఫ్ కేసు. ఇంతకుముందే చెప్పుకున్నట్టు అదో పెట్టె. పైకి ఆ పెట్టె అందరిది అని చెప్పినా, అందులో కావలసినవాళ్ళకు కావలసినన్ని ఉంటాయి. ఆ విషయాలన్నీ ఫిబ్రవరిలో చెప్పుకుంటే బాగుంటుంది. అప్పుడు అమాత్యులవారు తాము చేయవలసింది చేసి ఎవరెవరికి ఏమేమి చేయాలి అన్న పనిపైనే ఉంటారు. పెట్టె అంటే డబ్బా. డబ్బా అంటే బాక్సు అని గుర్తుపెట్టుకుంటూ ముందుకు పోదాం.



జంధ్యాల రఘుబాబు
9849753298

డబ్బా వాయించడం అయిపోయింది. అందరూ అలసిపోయిన యుద్ధవీరుల్లా ఉన్నారు. క్షతగాత్రుల్లా ఉన్నారు. ఇప్పుడు అందరి భవిష్యత్తూ డబ్బాలో దాగుంది. ఇప్పటికే డబ్బా అంటే ఏమిటో అందరికీ అర్థమైపోయి ఉంటుంది. ఓట్ల డబ్బా... బ్యాలెట్ బాక్సు. అసలు గుండ్రంగా ఉంది కాని ఈ ప్రపంచమే ఒక డబ్బా. గుండ్రటి డబ్బా. ఈ డబ్బానిండా డబ్బు, హోదా, రాజకీయం, రావణీయం, కీచకీయం ఇలా ఎన్నో కీయాలు. కొత్త పేర్లలో కొన్నింటికి 'కీ' కలిపి కూడా వాడుకోవచ్చు. 'కీ' మాత్రం ప్రజల చేతిలో ఉండింది. ఇప్పుడు ఆ తాళం చెవితో డబ్బా తీయాలి. అసలైన ఉత్కంఠ. సర్వత్రా సస్పెన్స్ ఇప్పుడే. ఎవరు రాజో, ఎవరు మంత్రో, ఎవరు బంటో, ఎవరు చాణక్యుడో, ఎవరు శ్రీకష్ణుడో, ఎవరు శకుని మామో, తొడలు విరిగిన సుయోధనుడో తెలి సేది ఇప్పుడే. ఇదో రసవత్తరమైన ఘట్టం. ఈ మెలో డ్రామాను వివరించాలంటే మళ్ళీ ఓ తిక్కన రావలసిందే. ఆయనైతే మాంచి నాటకీయత కలిపి చెల్లియో చెల్లకో అంటూ అందరికీ చెల్లుబాటయ్యే పద్యాలు చెబుతాడు. ఏ ఎన్నిక చూసినా ఏమున్నది గర్వకారణం అనేవారేమో మహాకవి శ్రీశ్రీ.

కొందరు ఈ రాష్ట్రంలో కూడా డబ్బా పగలగొట్టి తమ డబ్బాల సంఖ్యను పెంచుకుందామని దూకుడుగా వచ్చి, మధ్య లో తమకు ఇంకొన్ని రాష్ట్రాలు కూడా ఉన్నాయి, అవే ముఖ్యం కదా అని తెలుసుకొని మిడిల్ డ్రాపులా కాకుండా కొనసాగి ఉండొచ్చు. ఇంకొందరు అసలు ఈ డబ్బాలన్నీ మావి కావలిస్తే చరిత్ర చదూకొండి అని కబడ్డీ డబ్బాలో లాగ తాము అరవాల్సింది అరవొచ్చు. జీవుల్లో ఉండే కణం ఒక పెట్టె. మనుషులు కూడా జీవులే కాబట్టి వారిలోనూ కొన్ని కోట్ల పెట్టెలు అంటే కణాలు ఉంటాయి. కొన్ని కణాలు కలిస్తే కణజాలమని మా జువాలజీ సారు ఎప్పుడో చెప్పింది గుర్తుంది. ఒక్కో కణం ఒక బ్యాటరీ లాంటిది. మనకి శక్తిని స్తూ ఉంటుంది. అలాంటి శక్తినిచ్చే డబ్బాలు మనిషికి ఇంకా ఎన్నో ఉన్నాయి. వాటిల్లో కొన్నింటి గురించి ఇప్పుడు మాట్లాడుకుంటున్నాం.



బాక్సు బద్దలవడం గురించి అందరూ వినే ఉంటారు. అందుకే ఎవరి బాక్సులు వారు బద్దలవకుండా చూసుకోవాల్సిందే.

అసలు జీవితమే ఒక డబ్బా. అందులోనే అందరమూ తిరుగుతూ ఉంటాం. మన ఊరే అనుకుంటే అది చిన్న డబ్బా. లేదూ మన జిల్లా, లేదా రాష్ట్రం అనుకుంటే కొంచెం పెద్ద డబ్బా. కాదూ దేశమంతా నాదే అనుకుంటే ఓ మాదిరి డబ్బా. ప్రపంచమంతా అనుకుంటే ఇంకా పెద్దది. అదీ దాటి అనుకుంటే డబ్బా సైజు పెరుగుతుంది. గ్రహాలు ఇప్పుడు తొమ్మిది కాదని గ్రహించాలి అందరూ. ఈ విశ్వమే ఓ గుండ్రటి డబ్బా అని తేల్చేశారు శాస్త్రవేత్తలు. డబ్బాకు ఈ గుండ్రటి అస్సలు సరిపోతుందనే ఒక విస్మయం. క్రికెట్ బంతి ఏ ఆకారం? అది ఎన్ని రకాలుగా డబ్బు చేస్తుందో చెప్పాలి. దాని వెనుక టీవీ అనే డబ్బాలో చల్లని పానీయాలు, విదేశీ చెప్పులు, బాడీ స్ప్రేలు, ఆరోగ్య పానీయాలు, కార్లు, జీపులు, గుట్కాలు, పాన్ మసాలాలు ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ ప్రకటనలే. అన్నీ స్టేడియం అనే డబ్బా చుట్టూ తిరిగేవే. డబ్బుకు లోకం దాసోహం అని తెలిపేవే.

డబ్బానిండా బంగారం, డబ్బూ ఉన్నవారే సీఎం అవుతారు అంతే కాని ఇదేమీ సినిమా కాదు అని మా మిత్రుడు అంటాడు. రఘు అను నేను సీఎం అవ్వడానికి ఎటువంటి అవకాశమూ లేదు. కేజ్రీవాల్ కాలేదూ... అని ఎవరైనా ప్రయత్నిస్తే తప్పు లేదు.. ప్రజలే నా బంగారం, ప్రజలే నా డబ్బు, ప్రజలే నా సర్వస్వం అన్జెప్పినా వెంటనే ఎవ్వరూ నమ్మరు. నమ్మకం రావడానికి చాలా ఏండ్లు పడుతుంది. నమ్మకం కలిగేంతలో వింతలూ, విడ్డూరాలు జరగొచ్చు. ఒకసారి సెంటిమెంటే డబ్బూ, బంగారం అవ్వొచ్చు. అది డబ్బాలో పెట్టి కొద్దికొద్దిగా వాడుతూ ఉంటే కొంత కాలానికి అదీ అయిపోతుంది. అది తెలిసిన వాళ్లు ఈసారి ప్రజల్ని రెచ్చగొట్టడమే బంగారం అది మా దగ్గరా డబ్బాలకు డబ్బాలుంది అని ప్రయత్నాలూ చేసే అవకాశమూ ఉంది. నీచగుణ ములెల్ల నిర్మూలమె పోవు, కొదువలేదు సుజన గోష్ఠివలన అని వేమన అన్నట్టు, చెప్పలేదంటనకపొయ్యేరు అని బ్రహ్మం గారన్నట్టు ఎప్పుడూ ఎవరో ఒక మహాత్ములు చెబుతూనే ఉంటారు. వినేవాళ్లు దొరకడమే కష్టం. ఆ వినేవాళ్లు పల్లె ల్లోనే ఎక్కువగా ఉన్నట్టున్నారు, నగరవాసులకు ఇంకే భాషలో చెప్పాలో మరి? ఇక్కడ ఇంకో విషయం, ఆ నగర వాసులు మౌన భాషలో ఏం చెప్పదలచారో అది తెలుసుకోవాలి మరి!!

***

మెజీషియన్ బాక్స్ లేదా ఇంద్ర జాలికుల పెట్టె, అది టోపీ రూపంలో ఉంటుంది. అందులోనుంచి ఏవేవో వస్తువులు తీసి చూపిస్తుంటారు. ఏవేవో మంత్రాల్లాంటి మాటలు చెబుతుంటారు. ఖాళీ టోపీలోంచి పక్షుల్ని, కుందేళ్ళనీ తీస్తారు, ఇంకా ఎన్నో. ఇప్పుడు ఆ టోపీ ఓటరు చేతిలో ఉంది. తనకు టోపీ పెట్టిన, పెట్ట దలచిన వాళ్ళను ఓ చూపు చూసి ఉంటారు. ఓటరేమి చేసేదీ చూద్దాం రండి......



హాం ఫట్... అబ్రకదబ్ర.... దబ్రక అబ్ర...

ఇదో ఖాళీ టోపీ కావలిస్తే బోర్లిస్తాను చూడండి... నిజమే ఖాళీదే

హాం ఫట్... అబ్రకదబ్ర.... దబ్రకఅబ్ర... చేతిలోని మంత్రదండం టోపీ చుట్టూ తిప్పి...

చిలకను తీస్తాను చూడండి...

అందులోంచి ఎలక వచ్చింది... మాయమైంది

ఈసారి పావురం తీస్తాను.....

డేగ వచ్చింది... మాయమైంది

కర్చీపు తీస్తానిప్పుడు....

చిరిగిపోయిన ఖద్దరు అంగీ వచ్చింది....మాయమైంది

అబ్బో... ఎంత ఆశనో.. ఆశ దోశ అప్పడం.... ఇంకొన్ని గంటలు ఆగండి మరీ ఎందుకంత తొందర.....

నా షోని అంటే ఇంద్రజాల కార్యక్రమాన్ని టీవీ తెరమీదకు మారుస్తున్నాను...

ఓట్లు వేశాం ఇక కొట్టుకుచావండి...

తాంబూలాలిచ్చాం.... ఇక తన్నుకు చావండి... మహాకవి గురజాడా నీకు హ్యాట్సాఫ్...

రైతు నేతలపై చర్యల వెనుక కుట్ర

లిఖిత పూర్వక వాగ్దానాల ఉల్లంఘనే

- 11న జిల్లా కలెక్టర్లకు వినతులు
- రాష్ట్రపతి, కేంద్ర హోంశాఖ కార్యదర్శికి లేఖలు
- విలేకరుల సమావేశంలో ఎస్‌కేఎం నేతలు

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

రైతు నేతలపై ఢిల్లీ పోలీసులు, ఎన్ఐఏ తీసుకుంటున్న చర్యల వెనుక కుట్ర దాగి ఉందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) సమన్వయ కమిటీ నేతలు విమర్శించారు. ఈ మేరకు శనివారం నాడిక్కడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌కేఎం దర్శన్‌పాల్, రాకేష్ టికాయత్, పి కృష్ణప్రసాద్, ప్రేమ్ సింగ్, సత్యవాన్, కుల్దీప్ పునియా మాట్లాడారు. '2020-21 చారిత్రాత్మక రైతు ఉద్యమం సందర్భంగా పెట్టిన కేసులను ఉపసంహరించు కుంటామని కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇచ్చింది. అయితే నవంబర్ 28న ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం లో ఎస్‌కేఎం కౌన్సిల్ సభ్యుడు, రైతు నాయకుడు యుధ్వీర్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైతు సంఘాల నిరసనతో విడుదల చేశారు. హర్యానా రైతు నాయకుడు వీరేంద్ర సింగ్ హుడాకు నవంబర్ 22న ఢిల్లీ సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని నోటీసు అందింది. గతేడాది డిసెంబర్ 7న బీకేయూ నేత అర్జున్ బల్యాన్ నేపాల్ వెళ్లకుండా న్యూఢిల్లీ విమానాశ్రయంలో పోలీసులు అడ్డుకున్నారు. పంజాబ్‌కు చెందిన ఎస్‌కేఎం నాయకులు సత్నామ్ సింగ్ బెహ్రూ, హరీందర్ సింగ్ లోకోవాల్ ఢిల్లీ రైతుల పోరాటానికి సంబంధించి ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో విచారణను ఎదుర్కొంటు న్నారు. కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని కేసులను తక్షణమే ఉపసంహరించుకోవడానికి పూర్తిగా అంగీకరించాయని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ సంతకం చేసి 2021 డిసెంబర్ 9న ఇచ్చిన లిఖిత పూర్వక లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. రైతుల పోరాటానికి సంబంధించి ఇంకా, కేంద్ర ప్రభుత్వం, దాని ఏజెన్సీలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలన విభాగాలు అన్ని కేసులను ఉపసంహరించుకోవడానికి కూడా అంగీకరించాయి. రైతుల పోరాటంపై కేసులను ఉపసంహరించు కోవాలని అన్ని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలను కూడా అభ్యర్థించినట్టు లేఖలో పేర్కొన్నారు.



రైతు చారిత్రాత్మక పోరాటం సందర్భంగా రైతులపై దాఖలు చేసిన 86 కేసులను ఉపసంహరించు కుంటామని వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ రాజ్యసభలో సమాధానమిచ్చారు. అయితే రైతు నేతలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) లుకౌట్ నోటీసు జారీ చేసింది. ఈ విషయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన వైఖరిని స్పష్టం చేయాలి. రైతు నాయకులకు జరిగిన అవమానం, అసౌకర్యానికి కేంద్ర హోంమంత్రి క్షమాపణ చెప్పాలి. ఈ చట్టవిరుద్ధమైన, ప్రతీకార చర్యకు పాల్పడిన సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమాన్ని అణచివేయడానికి మోడీ ప్రభుత్వ చట్టవిరుద్ధమైన వ్యూహాలను ప్రతిఘటించేం దుకు ఎస్‌కెఎం కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రకటించింద న్నారు. ఎస్‌కెఎం నేతలపై విధించిన నిషేధాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 11న జిల్లా కలెక్టర్ల ద్వారా రాష్ట్రపతి, హోంశాఖ కార్యదర్శికి వినతిపత్రం పంప నున్నామని తెలిపారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరామని, కేంద్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయడానికి మెమోరాండంను సమర్పిస్తామని అన్నారు. ఎస్‌కేఎంకు చేసిన రాతపూర్వక వాగ్దానాలను ఉల్లంఘించకూడదని, ప్రతీకార చర్యకు దూరంగా ఉండాలని అన్నారు. ఎస్‌కేఎం నాయకులపై జారీ చేసిన లుకౌట్ నోటీసులు, పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఎస్‌కేఎం హోం సెక్రటరీకి మెమోరాండంను కూడా సమర్పిస్తామని తెలిపారు.

స్వదేశీ, విదేశీ కార్పొరేట్ మూలధనం కింద వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఢిల్లీలో రైతుల పోరాటం జరిగిందని గుర్తు చేశారు. రైతు నేతలను క్రిమినల్ కేసుల్లో ఇరికించే ప్రస్తుత విధానం మోడీ ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని ఉల్లంఘించడమేనని విమర్శించారు. అటువంటి చర్యలను ఎస్‌కేఎం గట్టిగా తిప్పికొడుతుందని, కేంద్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని ఉల్లంఘించడానికి ఎన్ఐఏ, ఇతర దర్యాప్తు సంస్థలను ఎందుకు ఉపయోగిస్తున్నారో హోంమంత్రి అమిత్ షా వివరించాలని డిమాండ్ చేశారు. రైతుల ఉద్యమంపై ప్రతీకారం తీర్చుకునే ఏ చర్యనైనా దేశం అంతటా భారీ పోరాటాలతో ఎదుర్కొంటామని ఎస్‌కేఎం హెచ్చరిస్తుందని అన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల పేలుడు

- సీఆర్‌పీఎఫ్ జవాన్లకు గాయాలు

ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో శనివారం ఉదయం జరిగిన మావోయిస్టుల దాడిలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లకు, ఒక మీడియా వ్యక్తికి గాయాలయ్యాయి. గత ఏడాది వివిధ కారణాలతో ప్రాణాలు కోల్పోయిన 54 మంది నక్సలైట్ల జ్ఞాపకార్థం నేటి నుంచి డిసెంబర్ 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు జరుపుకోనున్నట్టు మావోయిస్టులు కరపత్రాలను విడుదల చేశారు. కొన్నిచోట్ల పోస్టర్లను అంటించారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన జవాన్లు శనివారం ఉదయం పీఎల్‌జీఏ వారోత్సవాలకు సంబంధిచిన పోస్టర్లను ఆ ప్రాంతం నుండి తొలగిస్తున్నారు. దీంతో ఛత్తీస్‌గఢ్ లోని దంతేవాడలో మావోయిస్టులు.. ఈరోజు ఉదయం సీఆర్పీఎఫ్ జవాన్లు టార్గెట్‌గా ఐఈడీ పేల్చారు. ఈ పేలుడులో సీఆర్పీఎఫ్ 195 బెటాలియన్‌కు చెందిన ఇద్దరు జవాన్లకు, అలానే ఒక మీడియా వ్యక్తికి గాయాలయ్యాయి. కాగా గాయపడిన సీఆర్పీఎఫ్ జవాన్లను చికిత్స నిమిత్తం సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించారు. జవాన్ల పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

హమాస్ నాయకుల్ని హతమార్చేందుకు ఇజ్రాయిల్ ప్లాన్



గాజా: హమాస్ నాయకుల్ని హతమార్చేందుకు ఇజ్రాయిల్ అధ్యక్షుడు బెంజిమన్ నెతన్యాహు రంగం సిద్ధం చేస్తున్నట్టు తాజాగా వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక వెల్లడించింది. ఇప్పటికే ఈ పనిని అమలు చేయడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని ఇంటెలిజెన్స్ ఏజెన్సీ మొస్సాద్‌ను నెతన్యాహు ఆదేశించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ నివేదిక పేర్కొంది. ముఖ్యంగా టర్కీ, లెబనాన్, ఖతార్ దేశాల్లోని హమాస్ ఆఫీసులపై దాడులు చేసి నాశనం చేయాలని మొస్సాద్ డ్రాయింగ్‌లతో ప్లానింగ్ సిద్ధం చేసినట్టు ఈ నివేదిక తెలిపింది. ఇస్మాయిల్ హనియే మహమ్మద్ దీఫ్, యాహ్యా సిన్వార్, ఖలీద్ మషాల్ వంటి హమాస్ గ్రూపుకు చెందిన ప్రముఖ నాయకులు మొస్సాద్ హతమార్చే జాబితాలో ఉన్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ నివేదిక తెలిపింది.

మధ్యప్రదేశ్‌లో మరో పోలింగ్ అధికారిపై వేటు

భోపాల్: బ్యాలట్‌ను తారుమారు చేసిన ఆరోపణలపై మధ్యప్రదేశ్ లోని బాలాఘాట్ రిటర్నింగ్ అధికారి, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ గోపాల్ సోనీపై సస్పెన్షన్ వేటు వేశారు. పోస్టల్ బ్యాలట్ నోడల్ అధికారిగా వ్యవహరించిన తహసిల్దార్ భావేదీని ఇటీవల ప్రధాన ఎన్నికల అధికారి అనుపమ్ రాజన్ సస్పెండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పుడు సోనీపై కూడా వేటు పడింది. కాంగ్రెస్ ప్రతినిధి బృందం చేసిన ఫిర్యాదు మేరకు జబల్పూర్ డివిజన్ కమిషనర్ విచారణ జరపగా అవకతవకలు బయటపడ్డాయి. కొందరు వ్యక్తులు పోస్టల్ బ్యాలట్ బాక్సులు తెరిచి, వాటిలో కొన్ని బ్యాలట్ పేపర్లను కలిపారు. దీనికి సంబంధించిన వీడియోను రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అనంతరం ఆ వీడియో వైరల్ అయింది. ఎన్నికల అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఇలా జరిగిందని విచారణలో తేలింది.

ఇండో - బంగ్లా సరిహద్దుల్లో 716 మంది చొరబాటుదారుల అరెస్ట్..!

అగర్తాల: త్రిపురలోని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో ఈ ఏడాది 716 మందిని అరెస్టు చేశారు. చొరబాటుదారుల్లో 112 మంది రోహింగ్యాలు, 319 మంది బంగ్లాదేశీయులు ఉన్నారని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అధికారి పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా త్రిపుర ఫ్రాంటియర్ హెడ్‌క్వార్టర్స్‌ను ఉద్దేశించి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆర్కే సింగ్ మాట్లాడారు. గతేడాది ఈశాన్య రాష్ట్రాలతో అంతర్జాతీయ సరిహద్దు దాటి అక్రమంగా 150 మంది బంగ్లాదేశీయులు, 160 మంది భారతీయులు, 59 మంది విదేశీయులు ఉన్నారన్నారు. 2023లో 319 మంది బంగ్లాదేశీయులు, 112 మంది రోహింగ్యాలు, 285 మంది భారతీయులను పట్టుకున్నారు. ఈ ఏడాది బీఎస్ఎఫ్ రూ.23.12 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది.

స్మార్ట్ మీటర్లపై సీపీఐ (ఎం) ప్రచార భేరి

ప్రాజెక్టును రద్దు చేయాలని స్టాలిన్ ప్రభుత్వానికి డిమాండ్

చెన్నయ్ : స్మార్ట్ విద్యుత్ మీటర్ల ప్రాజెక్టు వాస్తవానికి 'స్మార్ట్' ప్రాజెక్టు ఏమీ కాదని సీపీఐ (ఎం) వ్యాఖ్యానించింది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వాలకు, దేశ ప్రజలకు ఉపయోగపడుతుందా అని ప్రశ్నించింది. స్మార్ట్ విద్యుత్ మీటర్ల వినియోగానికి వ్యతిరేకంగా సీపీఐ (ఎం) తమిళనాడు రాష్ట్ర కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారోద్యమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యుత్ బోర్డులను (ఎస్ఈబీలు) ప్రైవేటీకరించే ఉద్దేశంతోనే ఈ ప్రాజెక్టును అమలు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం ఒత్తిడి తెస్తోందని విమర్శించింది.



స్మార్ట్ మీటర్లు పెట్టాలని, ఒకవేళ వ్యతిరేకిస్తే నిధులు ఇవ్వబోనని రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి తెస్తోందని సీపీఐ (ఎం) తెలిపింది. రాష్ట్రంలో ఈ ప్రాజెక్టు అమలును నిలిపివేయాలంటూ డీఎంకే ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్రంలో సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపట్టింది. తమిళనాడులో ఇప్పటికే 1.4 లక్షల స్మార్ట్ మీటర్లను అమర్చారు.

గత వారం నుండి సీపీఐ (ఎం) కార్యకర్తలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇంటింటికీ తిరుగుతూ సంతకాలను సేకరిస్తున్నారు. ప్రాజెక్టును అమలు చేయడం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తున్నారు. విద్యుత్ రంగం సేవల రంగమని, దానిని ప్రైవేటీకరించకూడదని చెబుతున్నారు. స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టును పూర్తిగా నిలిపివేయాలని డీఎంకేను కోరుతున్నామని, పేదలు, రైతులకు అందజేస్తున్న సబ్సిడీలను ఈ ప్రాజెక్టు నిలిపివేస్తోందని వారు వివరిస్తున్నారు. తాలూకా, మున్సిపాలిటీలలోని విద్యుత్ శాఖ అధికారులకు సంతకాలతో కూడిన డిమాండ్ పత్రాన్ని అందజేయడానికి ముందు పార్టీ సభ్యులు, మద్దతుదారులు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

లండన్‌లో భారత విద్యార్థి మిత్ కుమార్ మృతి

లండన్: లండన్‌లో భారత విద్యార్థి మిత్‌కుమార్ పటేల్ (23) మతి చెందాడు. ఈ మేరకు సమాచారాన్ని పోలీసులు వెల్లడించారు. మిత్ కుమార్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఉన్నత చదువుల కోసం లండన్‌కు వెళ్లాడు. రెండు నెలల అనంతరం నవంబర్ 17వ తేదీన మిత్‌కుమార్ అదృశ్యమయ్యాడు. దీంతో బంధువుల ఫిర్యాదుమేరకు అతనిపై మిస్సింగ్ కేసు నమోదైంది. ఆ తర్వాత నాలుగురోజులకు నవంబర్ 21వ తేదీన తూర్పు లండన్‌లోని కానరీ వార్ఫ్ ప్రాంతానికి సమీపంలో థేమ్స్ నదిలో పోలీసులు అతని మృతదేహాన్ని గుర్తించారు. అతని మృతదేహాన్ని మెట్రోపాలిటన్ పోలీసులు బయటకు తీశారు. అయితే మిత్‌కుమార్ మృతికి సంబంధించి ఎలాంటి అనుమానాలు లేవని మెట్రోపాలిటన్ పోలీసులు తెలిపారు. కాగా, మిత్‌కుమార్ వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు. అతని తల్లిదండ్రులకు ఆర్థిక సాయం చేసేందుకు గో ఫండ్ మీ అనే ఆన్‌లైన్ ఫండ్ రైజర్ ద్వారా నిధుల సేకరణ ప్రారంభించినట్లు తన బంధువు పార్థ్‌పటేల్ తెలిపాడు. ఒక్క వారం వ్యవధిలోనే జీబీపీ (గ్రేట్ బ్రిటన్ పౌండ్స్) 4,500కి (భారత కరెన్సీలో 4 లక్షల 76 వేలు) పైగా వచ్చాయని పటేల్ అన్నారు. ఉన్నత చదువుల కోసం మిత్‌కుమార్ సెప్టెంబర్‌లో లండన్‌కి వచ్చాడు. షెఫీల్డ్ హాలం విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సు చదవడానికి ఇక్కడికి వచ్చాడు. ఇక్కడ అమెజాన్‌లో అతనికి పార్ట్‌టైం జాబ్ కూడా వచ్చింది. నవంబర్ 17వ తేదీ డైలీ వాక్‌కి వెళ్లిన మిత్.. మళ్లీ తిరిగి ఇంటికి వెళ్లలేదు. మాకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇంతలోనే చనిపోవడం బాధకు గురిచేస్తుంది. 'సేకరించిన డబ్బుల్ని అతని కుటుంబానికి అందజేస్తాం. మృతదేహాన్ని భారత్‌కి పంపిస్తాం.' అని పార్థ్‌పటేల్ అన్నారు.

66 శాతం మలేరియా కేసులు భారత్‌లోనే

డబ్ల్యూహెచ్ఓ

న్యూయార్క్ : 2022లో ఆగ్నేయాసియా ప్రాంతంలో 66శాతం మలేరియా కేసులు భారతదేశంలేనే నమోదు అయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రచురించిన ప్రపంచ మలేరియా నివేదిక - 2023లో పేర్కొంది. వీటిలో దాదాపు 46శాతం ప్లాస్మోడియం వైవాక్స్ వల్ల సంభవించాయని తెలిపింది.



దోమ తెరలు, మందులు వినియోగించడం ద్వారా చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీల్లో మలేరియాను నివారించడంలో సహాయపడతాయని తెలిపింది. ఆగ్నేయాసియా ప్రాంతంలో 77శాతం మరణాలు తగ్గాయని తెలిపింది. కాగా ఆగ్నేయాసియాలోని మొత్తం మలేరియా మరణాల్లో 94శాతం మరణాలు భారత్, ఇండోనేషియాలో ఉన్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 2019లో 233 మిలియన్ల మలేరియా కేసులు నమోదు కాగా, 2022లో 249 మిలియన్ కేసులు చేరుకున్నాయి. 2019 కంటే 2022లో 16 మిలియన్ కేసులు పెరిగాయని నివేదిక పేర్కొంది.

కోవిడ్-19, మాదకద్రవ్యాలు మరియు పురుగుమందుల నిరోధకత, మానవతా సంక్షోభాలు, వనరుల పరిమితులు, వాతావరణ మార్పుల ప్రభావాలు వంటివి మలేరియాపై పోరాటానికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొంది. 2016 నుండి నేటి వరకు శ్రీలంక మలేరియా రహిత దేశంగా కొనసాగుతుందని పేర్కొంది.

పచ్చి మోసం

సీఎంఐఈ నివేదికపై ఆర్థికవేత్తల ఆగ్రహం



ఉపాధి ఎక్కడ పెరిగిందని నిలదీత

న్యూఢిల్లీ: 2022 జూన్-2023 మార్చి మధ్యకాలంలో దేశంలో కోటిన్నర మందికి ఉపాధి లభించిందంటూ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) చేసిన ప్రకటనపై పలువురు ఆర్థికవేత్తలు మండిపడ్డారు. ఈ నివేదిక పచ్చి మోసమని అభివర్ణించారు. నిరుద్యోగం తగ్గడమంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడం కాదని వారు గుర్తు చేశారు. రాజధాని న్యూఢిల్లీలో సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబులిటీ, ఎకనమిక్ రిసర్చ్ ఫౌండేషన్, ఫోకస్ ఆన్ ది గ్లోబల్ సౌత్ సంస్థలు నిర్వహించిన రెండు రోజుల సదస్సులో పలువురు ఆర్థికవేత్తలు పాల్గొన్నారు. వివిధ కేటగిరీలలో కార్మికుల సగటు ఆదాయం పెరిగిందని సీఎంఐఈ చెబుతోందని, అయితే దినసరి కార్మికుల వేతనాలు మాత్రమే పెరిగాయని వారు ఎత్తిచూపారు. ఇతర కార్మికుల ఆదాయం స్థిరంగా ఉండడమో లేదా తగ్గడమో జరిగిందని తెలిపారు. దీనితోపాటు ఉద్యోగాలు కల్పించే సంస్థల శాతం కూడా స్థిరంగానే ఉన్నదని వివరించారు.

కార్మికుల వేతనాలలో ఎలాంటి పెరుగుదల కన్పించడం లేదని ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి చెందిన మృణాళిని ఝూ చెప్పారు. 'ఇప్పుడు మనం కార్మిక గణాంకాలను కూడా సవాలు చేయాల్సి ఉంది. మహిళల్లో నిరుద్యోగం విషయంలో ఎలాంటి సమస్య లేదని చెప్పేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది' అని అంబేద్కర్ యూనివర్సిటీకి చెందిన దీపా సిన్హా విమర్శించారు. వేతనం లేకుండా ఇళ్లలో పనిచేస్తున్న వారిని కూడా ప్రభుత్వం లెక్కలోకి తీసుకోవడం మొదలు పెట్టిందని సిన్హా ఎద్దేవా చేశారు. 'ఇది మహిళా సాధికారత ఎలా అవుతుంది? మనం నిజంగా వారి పని గురించి శ్రద్ధ చూపాలని అనుకుంటే వారికి మద్దతుగా మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు పెట్టాలి. కానీ మన ఆసక్తి కేవలం వారి పనిని లెక్కించే విషయంలోనే ఉంది. ఉపాధి అవకాశాలు పెరిగాయని గొప్పలు చెప్పుకోవడంలోనే ఉంది' అని విమర్శించారు.

భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని ప్రభుత్వం అంటోందని, ఈ వాదనకు ఐరాస, ఐఎంఎఫ్ కూడా వంత పాడుతున్నాయని, అవి కేవలం ప్రభుత్వం ఇచ్చిన గణాంకాల పైనే ఆధారపడుతున్నాయని జేఎన్‌యూ మాజీ ప్రొఫెసర్ అరుణ్ కుమార్ తెలిపారు. అవన్నీ పాత లెక్కలని, నూతన సూచికలు తాజా సర్వేల ఆధారంగా ఉండాలని, అయితే అసంఘటిత రంగంలో 2015 నుండి సర్వే అనేదే జరగలేదని ఆయన చెప్పారు. దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఆర్‌బీఐ ఇటీవల గుర్తించిందని అంటూ జీవన వ్యయ సంక్షోభం, పెరిగిన ప్రభుత్వ రుణాలు, సంక్లిష్టంగా ఉన్న ఆర్థిక పరిస్థితి, యుద్ధ అనిశ్చితి, వాతావరణ సంక్షోభం వంటి అంశాలు వాటిలో ఉన్నాయని వివరించారు.

చమురు, ఆహారం కారణంగా ద్రవ్యోల్బణం పెరుగుతోందని, అది ప్రజల కష్టాలను మరింత పెంచుతోందని ఎకనమిక్ రిసర్చ్ ఫౌండేషన్ రిటైర్డ్ ప్రొఫెసర్ సీసీ చంద్రశేఖర్ తెలిపారు.

బిజినెస్



విప్రో కన్స్యూమర్ రూ.250 కోట్ల స్టార్టప్ ఫండ్

బెంగళూరు : విప్రో కన్స్యూమర్ కేర్ వెంచర్స్ స్టార్టప్‌లకు మద్దతును ఇవ్వడానికి మరోమారు ప్రత్యేకంగా ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. రూ.250 కోట్లను తమ వెంచర్ ఫండింగ్‌కు అందిస్తున్నట్టు పేర్కొంది. దీంతో భారత్ సహా ఆగ్నేయాసియాలో వినియోగదారుల స్టార్టప్‌లలో పెట్టుబడి పెట్టడం, మద్దతు ఇవ్వనున్నట్టు పేర్కొంది. వినియోగదారుల అవసరాలను తీర్చే లక్ష్యంతో ఏర్పాటయ్యే వినూత్న సంస్థలలో పెట్టుబడి పెట్టనున్నట్టు వెల్లడించింది. మైనారిటీ వాటా విధానాన్ని (25 శాతం వరకు) అవలంభిస్తామని తెలిపింది. అవసరమైన విధంగా స్టార్టప్‌లకు సహాయం, వృద్ధి కోసం తమ వ్యూహాన్ని కొనసాగిస్తామని విప్రో కన్స్యూమర్ కేర్ - వెంచర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సమిత్ కేషన్ తెలిపారు. వ్యక్తిగత సంరక్షణ, చర్మ సంరక్షణ, గృహ సంరక్షణ, ఆరోగ్యం, ఆహారం, సువాసనలు, వ్యక్తిగత సంరక్షణ మొదలైన వాటిలో పనిచేసే సంస్థలపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. ఈ సంస్థను నాలుగు సంవత్సరాల క్రితం రూ.200 కోట్ల పెట్టుబడితో ప్రారంభించారు. ఇప్పటి వరకు 10 పెట్టుబడులు పెట్టింది.

బైజూస్‌లో వేతనాల చెల్లింపుల్లో ఆలస్యం

బెంగళూరు : ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌లో నిధుల కటకట మరింత పెరిగింది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఈ సంస్థ తాజాగా ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితికి జారిందని ఎకనామిక్స్ టైమ్స్ ఓ కథనంలో పేర్కొంది. నవంబర్‌కు సంబంధించిన వేతనాలు ఆలస్యం అయ్యాయని ఆ వ్యవహారంతో సంబంధం కలిగిన వారు తెలిపారు. దాదాపుగా 1,000 మంది ప్రభావితం అయ్యారు. వారికి సోమవారం వేతనాలు వేసే అవకాశాలు ఉన్నాయని సమాచారం. బైజూస్‌కు ఇండియాలో 14,000 మంది పైగా ఉద్యోగులు ఉన్నారు.

ఆథెర్ ఎనర్జీ 9,344 యూనిట్ల అమ్మకాలు

ATHER

న్యూఢిల్లీ : విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ దారు ఆథెర్ ఎనర్జీ 2023 నవంబర్‌లో 9,344 యూనిట్లను విక్రయించినట్టు ప్రకటించింది. గతేడాది ఇదే మాసం అమ్మకాలతో పోల్చితే 22.5 శాతం వృద్ధిని కనబర్చినట్టు తెలిపింది. గడిచిన అక్టోబర్‌లో 10,056 యూనిట్ల అమ్మకాలను చేసింది. గడిచిన నెలలో దేశంలో కొత్తగా 11 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అదే విధంగా అంతర్జాతీయంగా తొలి డీలర్‌షిప్‌ను నేపాల్‌లో తెరిచినట్లు తెలిపింది. దేశంలో మొత్తంగా 100 నగరాల్లో 176 అవుట్‌లెట్స్‌కు విస్తరించినట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఈ సంస్థ ఆథెర్ 450, ఆథెర్ 450 ఎక్స్ మోడళ్లను విక్రయిస్తుంది.

రూ.1000 కోట్ల నిధుల సమీకరణలో ఐఐఎఫ్ఎల్ సమస్తా

న్యూఢిల్లీ : బ్యాంకింగేతర విత్త సంస్థ, మైక్రోఫైనాన్స్ కంపెనీ ఐఐఎఫ్ఎల్ సమస్తా రూ.1,000 కోట్ల నిధులను సమీకరించనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం నాన్ కన్వర్టెడ్ డిబెంచర్ (ఎన్‌సిడి) సెక్యూర్డ్ బాండ్లను జారీ చేయనున్నామని పేర్కొంది. సంస్థ మూలధన అవసరాలు, వ్యాపార విస్తరణ కోసం ఈ నిధులను ఉపయోగించనున్నట్లు వెల్లడించింది. 60 నెలల కాలపరిమితి కలిగిన బాండ్లపై గరిష్ఠంగా 10.50 శాతం వడ్డీ అందించనున్నట్టు తెలిపింది. అదే విధంగా 24, 36, 60 నెలల కాలపరిమితితో కూడిన బాండ్లపై నెలసరి లేదా ఏడాదికి ఒక్క సారి వడ్డీ రేటును పొందవచ్చని పేర్కొంది.

ఈ ఇష్యూ డిసెంబర్ 4న ప్రారంభమై.. 15న ముగుస్తుందని ఆ సంస్థ తెలిపింది. ఈ బాండ్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వేదికలపై లిస్టింగ్ చేయనున్నట్టు పేర్కొంది. రూ.1,000 ముఖ విలువ కలిగిన ఈ బాండ్లను ఒక దరఖాస్తులో కనీసం రూ.10,000 కొనాల్సి ఉంటుంది. ఐఐఎఫ్ఎల్ సమస్తా ఫైనాన్స్‌కు 1500 శాఖలు ఉన్నాయని ఆ సంస్థ ఎండి, సిఇఒ వెంకటేష్ ఎన్ తెలిపారు. 2023 సెప్టెంబర్ ముగింపు నాటికి తమ సంస్థ రూ.12,196 కోట్ల ఎయుఎంను కలిగి ఉందన్నారు. 2023-24 సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో సంస్థ రూ.233 కోట్ల లాభాలు నమోదు చేసిందన్నారు.

ఇండస్ యాప్‌స్టోర్‌లోకి ప్రధాన గేమ్ డెవలపర్ల రాక

Indus Appstore

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఉన్న వినియోగ దారులకు గేమింగ్ అనుభవాన్ని మరింత చేరువ చేయడానికి ప్రముఖ గేమ్ డెవలపర్లను ఆన్‌బోర్డింగ్ చేస్తున్నామని ఇండస్ యాప్‌స్టోర్ పేర్కొంది. ఆండ్రాయిడ్ ఆధారిత మొబైల్ యాప్ స్టోర్ అయిన ఇండస్ యాప్‌స్టోర్‌తో డ్రీమ్11, నజారా టెక్నాలజీస్, ఎ23, ఎంపిఎల్, కార్డ్ బాజీ, జంగిల్ రమ్మీ తదితర సంస్థలు తమతో ఒప్పందం కుదర్చుకున్నాయని పేర్కొంది. ఈ భాగస్వామ్యం లక్షలాది మంది వినియోగదారులకు గేమింగ్ అనుభవాన్ని మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురానుందని ఆ సంస్థ అభిప్రాయపడింది. ఈ గేమింగ్ దిగ్గజాలను ఇండస్ యాప్‌స్టోర్ కుటుంబంలోకి ఆహ్వానించడం తమకెంతో సంతోషంగా ఉందని ఇండస్ యాప్‌స్టోర్ కో-ఫౌండర్ ఆకాశ్ డోంగ్రే పేర్కొన్నారు.

సత్యాన్ని నాశనం చేస్తాయి

- ప్రజాస్వామ్య చర్చను దెబ్బతీస్తుంది
- ఫేక్ న్యూస్‌పై సీజేఐ చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై. చంద్రచూడ్ నకిలీ వార్తలపై కీలక వ్యాఖ్యలు చేశారు. నిజాలను నాశనం చేయటమే నకిలీ వార్తల లక్ష్యమని అన్నారు. ఇది ప్రజా స్వామ్య చర్చను దెబ్బతీస్తుందని చెప్పారు. ఫేక్ న్యూస్ నిజమైన సమాచారాన్ని ముంచేస్తుందని హెచ్చరించారు. 'డిజిటల్ యుగం లో పౌర హక్కులను సమర్థించడం ' గోప్యత, నిఘా మరియు స్వేచ్ఛా ప్రసంగం' అనే అంశంపై సీజేఐ న్యూఢిల్లీలో జస్టిస్ వి.ఎం. తార్కుండే స్మారక ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పై విధంగా స్పందించారు. "కేవలం వ్యాప్తి యొక్క స్థాయి కారణంగా, నకిలీ వార్తలు నిజమైన సమాచారాన్ని ముంచేస్తాయి. తప్పుడు సమాచారం ప్రజాస్వామ్య ఉపన్యాసాన్ని శాశ్వతంగా దెబ్బతీసే శక్తిని కలిగి ఉన్నది" అని చంద్రచూడ్ తెలిపారు.

డిజిటల్ యుగంలో గోప్యత అనేది కేవలం డేటా రక్షణకు సంబంధించిన అంశం కాదనీ, అది ప్రాథమిక హక్కు అని ఆయన నొక్కి చెప్పారు. గోప్యతను పరిరక్షించడంలో సాంకేతికత నుంచి ప్రపంచ వ్యాప్తంగా న్యాయవ్యవస్థ సవాళ్లను ఎదుర్కొంటుందనీ, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌లను అభివృద్ధి చేయడం చాలా కీలకమని ఆయన అన్నారు.

2022 టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్. రోహిత్ శర్మ చివరగా భారత్‌కు ఆడిన టీ20 మ్యాచ్. ఏడాది కాలంగా పొట్టి ఫార్మాట్‌కు దూరమైన హిట్‌మ్యాన్.. ఒక్కసారిగా 2024 టీ20 ప్రపంచకప్ కెప్టెన్సీ రేసులోకి దూసుకొచ్చాడు. రోహిత్ రాకతో నాయకత్వ రేసు మొదలవగా.. విరాట్ కోహ్లి సైతం పొట్టి ప్రపంచకప్‌లో ఆడేందుకు సుముఖంగా ఉండటంతో తుది జట్టు కూర్పు సైతం ఆసక్తికరంగా మారుతోంది.

పొట్టి ఫార్మాట్‌లో కెప్టెన్సీ వార్?

- సారథ్య రేసులోకి రోహిత్ శర్మ
- 2024 వరల్డ్‌కప్‌కు అతడి నాయకత్వంలోనే

హార్దిక్‌ను తప్పించనున్న సెలక్షన్ కమిటీ

నవతెలంగాణ క్రీడావిభాగం



మరో 7 టీ20 మ్యాచులు, ఓ సీజన్ ఐపీఎల్...వచ్చే ఏడాది మెన్స్ ఐసీసీ టీ20 ప్రపంచకప్ ముంగిట టీమ్ ఇండియాకు మిగిలిన సన్నాహక మ్యాచులు ఇవే. వెస్టిండీస్, యుఎస్‌ఏ (అమెరికా) సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న 2024 టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి 20 జట్లు పోటీపడుతున్నాయి. 2007 తర్వాత మళ్లీ టీ20 ప్రపంచకప్ అందుకోని భారత్.. మరోసారి పొట్టి కప్పు కొట్టాలనే తపనలో ఉంది. 2022 టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ పరాజయం తర్వాత.. ఈ ఫార్మాట్‌కు కుర్రాళ్లనే ఎంపిక చేస్తూ, కుర్ర కెప్టెన్ సారథ్యంలో ముందుకు సాగటంతో సీనియర్లకు ఇక సెలవు అనిపించింది. కానీ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి మళ్లీ ఈ ఫార్మాట్‌పై మక్కువ కనబరుస్తున్నారు. విశ్రాంతి పేరుతో రోహిత్, విరాట్‌ను సెలక్షన్ కమిటీ ఇన్నాండ్లు పక్కనపెట్టింది. కానీ మరోసారి ప్రపంచకప్ వేట సాగించాలనే పట్టుదల ప్రదర్శిస్తున్న విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు భారత జట్టులో సరికొత్త రేసుకు తెరతీశారు. రోహిత్ రాకతో నాయకత్వ వార్ మొదలవగా.. విరాట్ రేసులో నిలువటంతో మిడిల్ ఆర్డర్ కూర్పు కఠినం కాబోతుంది.

ఇప్పటికీ అతడే కెప్టెన్

విరాట్ కోహ్లిని నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించిన తీరు వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. కోహ్లి టీ20 పగ్గాలు వదిలేయగా.. వైట్‌బాల్ ఫార్మాట్‌లో ఇద్దరు కెప్టెన్లను కొనసాగించలేమని వన్డే బాధ్యతలను లాగేసుకుంది. దీంతో విరాట్ టెస్టు ఫార్మాట్ సారథ్యం సైతం త్యజించాడు. కోహ్లి నిష్క్రమణతో.. బీసీసీఐ తన ఫార్ములాను తనే పాటించలేదు. రోహిత్‌కు వన్డే పగ్గాలు అప్పగించి.. హార్దిక్ పాండ్యకు టీ20 ఫార్మాట్‌లో కెప్టెన్సీ అప్పగించింది.

అయితే, అధికారికంగా భారత జట్టు మూడు ఫార్మాట్ల కెప్టెన్‌గా ఇప్పటికీ రోహిత్ శర్మ కొనసాగుతున్నాడు. హార్దిక్ పాండ్య కేవలం తాత్కాలిక కెప్టెన్‌గా ప్రతి సిరీస్‌కు బాధ్యతలు స్వీకరిస్తున్నాడు. ఇప్పుడు గాయంతో పాండ్య దూరం కాగా సూర్య కుమార్ యాదవ్ చేతికి కెప్టెన్సీ పగ్గాలు చిక్కాయి. సఫారీ పర్యటనలో వన్డేలకు సైతం రోహిత్ దూరమవగా.. కెఎల్ రాహుల్ నాయకత్వం వహించనున్నాడు. రెగ్యులర్‌గా ద్వైపాక్షిక సిరీస్‌లకు రోహిత్ శర్మ దూరమైనా.. మూడు ఫార్మాట్ల కెప్టెన్‌గా అతడే కొనసాగుతున్నాడు. అధికారికంగా బీసీసీఐ మరెవరికీ నాయకత్వ పగ్గాలు అప్పగించలేదు.

రోహిత్‌పై సెలక్టర్ల నజర్

స్వదేశంలో జరిగిన 2023 మెన్స్ ఐసీసీ ప్రపంచకప్‌లో భారత జట్టును రోహిత్ శర్మ నడిపించిన తీరు విమర్శకుల మెప్పు పొందింది. టైటిల్ పోరు వరకు టీమ్ ఇండియా అజేయంగా నిలిచింది. ప్రపంచకప్‌లో ఆడిన అన్ని జట్లను ఓడించిన జట్టుగా నిలిచింది. ఫైనల్లో కప్పు చేజారినా.. రోహిత్ శర్మ నాయకుడిగా మంచి మార్కులు దక్కించుకున్నాడు. చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ బృందాన్ని కొనసాగించిన బీసీసీఐ.. అదే తరహాలో రోహిత్ శర్మ నాయకత్వం సైతం కొనసాగించేందుకు సిద్ధమైంది. అందుకే, 2024 టీ20 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ భారత జట్టుకు నాయకత్వం వహించాలని సీనియర్ సెలక్షన్ కమిటీ భావిస్తోంది. అజిత్ అగార్కర్ టీమ్ ఇప్పటికే ఈ విషయాన్ని రోహిత్ శర్మకు తెలియజేసినట్టు సమాచారం. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్‌కు ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మ.. భారత్‌కు టీ20 ఫార్మాట్‌లో మరో కప్పు కొడతాడనే నమ్మకం బీసీసీఐ పెద్దల్లోనూ కనిపిస్తోంది. ఐపీఎల్ తర్వాతి ద్వైపాక్షిక సిరీస్‌ల్లో రోహిత్ శర్మ జట్టు బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

హార్దిక్‌కు మొండిచేయి?

గాయంతో ఇబ్బందులు పడుతున్న స్థితి నుంచి అనూహ్యంగా భారత జట్టు నాయకత్వ బృందంలో కీలకంగా ఎదిగాడు హార్దిక్ పాండ్య. గుజరాత్ టైటాన్స్‌ను తొలి సీజన్లోనే చాంపియన్‌గా నిలపటం, రెండో సీజన్లో రన్నరప్‌గా చేయటం కెప్టెన్‌గా పాండ్య స్థాయిని పెంచాయి. అందుకే, ఇటీవల ఐపీఎల్ ఆటగాళ్ల బదిలీ ప్రక్రియలో హార్దిక్ పాండ్య కోసం ముంబయి ఇండియన్స్ సుమారు రూ.30 కోట్ల వరకు వెచ్చించింది. గత ఏడాది కాలంగా భారత టీ20 సారథిగా కొనసాగుతున్న పాండ్య.. మంచి విజయాలు సాధించాడు. కెప్టెన్‌గానూ మంచి మార్కులు సాధించాడు. 2024 ప్రపంచకప్‌కు అతడే సారథి అనుకోగా.. ఇప్పుడు రోహిత్ శర్మ రాక అతడికి తలనొప్పిగా మారింది. ముంబయి ఇండియన్స్‌లో రోహిత్ శర్మ వారసుడిగా అడుగుపెట్టిన పాండ్య.. భారత జట్టులో మాత్రం అతడి కోసం కెప్టెన్సీ కుర్చీ త్యాగం చేయాల్సి వస్తోంది. హార్దిక్ పాండ్య గాయంతో బాధపడుతున్న నేపథ్యంలో సెలక్టర్లు, బీసీసీఐ నిర్ణయం అతడిని మరింత బాధకు గురి చేసే అవకాశం లేకపోలేదు. అయితే, 2024 టీ20 ప్రపంచకప్ అనంతరం భారత జట్టు కెప్టెన్సీ భవిష్యత్ హార్దిక్ పాండ్య అనే భరోసా బీసీసీఐ పెద్దలు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.

మిడిల్‌లో సెగ



రోహిత్‌తో పాటు విరాట్ సైతం పొట్టి ఫార్మాట్‌కు దూరంగా ఉంటున్నాడు. అధికారికంగా ఈ ఇద్దరూ టీ20లకు వీడ్కోలు పలుకలేదు. 2024 టీ20 ప్రపంచకప్ రేసులో రోహిత్ రాక కెప్టెన్సీతో పాటు ఓపెనింగ్ స్థానంపై హీట్ పెంచగా.. విరాట్ కోహ్లి మిడిల్ ఆర్డర్‌లో సెగ పెంచాడు. నం.3 బ్యాటర్ స్థానం కోసం శ్రేయస్ అయ్యర్‌తో యువ తిలక్ వర్మ పోటీపడుతున్నాడు. ఇప్పుడు కోహ్లి అడుగు పెట్టడంతో శ్రేయస్ అయ్యర్‌కు గట్టి పోటీ తప్పటం లేదు. రోహిత్ ఎంట్రీ ఇస్తే రెండో ఓపెనర్ స్థానం కోసం ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్‌లు పోటీపడాల్సి ఉంటుంది.



4-1.. టీమ్ ఇండియా ఆశిస్తున్న టీ20 సిరీస్ విజయం. 2-3... టీ20 సిరీస్‌కు ఆస్ట్రేలియా ఇవ్వాలని అనుకుంటున్న ముగింపు. తొలి మూడు మ్యాచుల్లో పరుగుల వరదకు రాయ్‌పూర్‌లో బ్రేక్ పడగా.. ఇప్పుడు బెంగళూర్‌లో మళ్లీ పరుగుల వేటకు తెరలేవనుంది. బ్యాటర్లు శాసించే చిన్నస్వామి స్టేడియంలో విజయంతో టీ20 సిరీస్‌ను అందుకునేందుకు సూర్యసేన సిద్ధమవుతుండగా.. ఊరట విజయంతో స్వదేశానికి చేరుకోవాలని కంగారూలు భావిస్తున్నారు. భారత్, ఆస్ట్రేలియా చివరి టీ20 పోరు నేడు.

విజయంతో ముగిస్తారా?

- భారత్, ఆస్ట్రేలియా ఐదో టీ20 నేడు
- బెంచ్ ఆటగాళ్లకు నేడు అవకాశం

రాత్రి 7 నుంచి జియో సినిమాలో..

నవతెలంగాణ-బెంగళూర్



యశస్వి నిలిచేనా?

భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్. టీ20 కెరీర్‌ను గొప్పగా ఆరంభించాడు. ఆసీస్‌తో సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లో మినహా అన్నింటా ధనాధన్ ఆరంభాలను అందించాడు. పవర్‌ప్లే ఆరు ఓవర్లలో జైస్వాల్ కంటే ఎక్కువ పరుగులు మరొకరు చేయలేదు. తొలి ఆరు ఓవర్లలో 174.62 స్ట్రయిక్‌రేట్‌తో చెలరేగుతున్న యశస్వి పవర్‌ప్లే దాటి నిలువటం లేదు. జట్టు మేనేజ్‌మెంట్ అతడి నుంచి మరింత కుదురైన ఇన్నింగ్స్‌లు ఆశిస్తోంది. స్వార్థరహిత క్రికెట్‌తో జైస్వాల్ అభిమానుల మనసులు గెలుస్తున్నా.. జట్టులో పోటీ తట్టుకునేందుకు మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చిన్నస్వామిలో నేడు యశస్వి పవర్‌ప్లే దాటి నిలుస్తాడేమో చూడాలి. రింకూ సింగ్ ఈ ఫార్మాట్‌లో టీమ్ ఇండియాకు ఎక్స్ ఫ్యాక్టర్‌గా నిలుస్తున్నాడు. డెత్ ఓవర్లలో సూర్య కుమార్ యాదవ్‌కు రింకూ సింగ్ తోడవటంతో భారత్ దుర్భేద్యంగా కనిపిస్తోంది. చివరి మ్యాచ్‌లో బెంచ్ ఆటగాళ్లకు అవకాశం కల్పించనున్నారు. దీంతో తుది జట్టు కూర్పులో కొన్ని మార్పులు ఉండవచ్చు. తిలక్ వర్మ వాషింగ్టన్ సుందర్, దీపక్ చాహర్ తుది జట్టులోకి రానున్నారు.

హార్డీ మెరిసేనా?



ఆరోన్ హార్డీ. భారత్‌తో టీ20 సిరీస్‌లో పెద్దగా ఎవరూ పట్టించుకోని పేరు. ఈ ఏడాది బిగ్‌బాష్ లీగ్‌లో అత్యధిక పరుగులు బాదిన ఆరోన్ హార్డీ.. ఈ సిరీస్‌లో అంచనాలను అందుకోలేదు. వికెట్‌పై పేస్, బ్యాట్‌పైకి బంతి రావటాన్ని ఆస్వాదించే హార్డీ బ్యాటింగ్ శైలికి చిన్నస్వామి స్టేడియం చక్కటి వేదిక. ధనాధన్ నైపుణ్యం చాటుకునేందుకు హార్డీకి ఇది చివరి అవకాశం. జట్టులో 13 మందే అందుబాటులో ఉండటంతో ఆసీస్‌కు పెద్దగా ఆప్షన్లు లేవు. ట్రావిశ్ హెడ్, జోశ్ ఫిలిప్ సహా కెప్టెన్ మాథ్యూ వేడ్ కంగారూలకు కీలకం కానున్నారు.

పిచ్, వాతావరణం

చిన్నస్వామి స్టేడియం అనగానే చిన్న బౌండరీలు. సిరీస్ చివరి మ్యాచ్‌లో సైతం పరుగుల వరద పారనుంది. తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు అలవోకగా 200 పరుగుల మార్క్ చేరుకునేందుకు పిచ్ సహకరించనుంది. భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌కు వర్షం ముప్పు పెద్దగా లేదు. మంచు ప్రభావం రెండు ఇన్నింగ్స్‌లకు ఉండనుంది. టాస్ నెగ్గిన జట్టు ఛేదనకు మొగ్గుచూపవచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్ : యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్/తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), జితేశ్ శర్మ (వికెట్ కీపర్), రింకూ సింగ్, అక్షర్ పటేల్/వాషింగ్టన్ సుందర్, దీపక్ చాహర్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్.

ఆస్ట్రేలియా : జోశ్ ఫిలిప్, ట్రావిశ్ హెడ్, బెన్ మెక్‌డార్మాట్, ఆరోన్ హార్డీ, టిమ్ డెవిడ్, మాథ్యూ షార్ట్, మాథ్యూ వేడ్ (కెప్టెన్, వికెట్ కీపర్), బెన్ వార్‌షిస్, క్రిస్ గ్రీన్, జేసన్ బెహ్రెన్‌డార్ఫ్, నాథన్ ఎలిస్.

ఎక్స్‌ట్రా వినోదంతో అద్భుతంగా ఉంటుంది



వక్కంతం వంశీ, నితిన్

నితిన్ హీరోగా వక్కంతం దర్శకత్వంలో శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మిస్తున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్'.

ఈనెల 8న రిలీజ్ అవుతున్న ఈ సినిమా నుంచి శనివారం 'ఓలే ఓలే పాపాయి..' అనే పాటను చిత్ర బృందం రిలీజ్ చేసింది. హేరిస్ జైరాజ్ సంగీత సారథ్యంలో ఈ పాటను రామ్ మిర్యాల, ప్రియా హేమేష్ పాడారు. కాసర్ల శ్యామ్ పాటను రాశారు. ఈ సందర్భంగా నిర్మాత ఎమ్.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం నితిన్, డైరెక్టర్ వక్కంతం వంశీ ఎంతో కష్టపడ్డారు. టైటిల్‌కి తగ్గట్టు, ప్రేక్షకుల అంచనాలను దీటుగా సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది' అని తెలిపారు. 'ఈ సినిమా టీజర్, పాటలు, ఇప్పుడు ట్రైలర్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్ చూసి ప్రేక్షకులు చాలా బాగా ఎంజాయ్ చేశారు. ట్రైలర్‌లానే సినిమా ఉంటుందా? అని అందరూ అడుగుతున్నారు. ట్రైలర్‌కు పదింతలుగా సినిమా ఉంటుంది. మంచి బిర్యానీ తినిపిస్తా. నితిన్ సపోర్ట్ లేకపోతే ఈ సినిమాను ఇలా తీసేవాడిని కాను' అని దర్శకుడు వక్కంతం వంశీ చెప్పారు.

హీరో నితిన్ మాట్లాడుతూ, 'ట్రైలర్ జనాల్లోకి ఎంత బాగా వెళ్లిందనేది వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే తెలుస్తుంది. ఈ మూవీ ఎక్స్‌ట్రా ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఎక్స్‌ట్రార్డినరీగా ఉండబోతుంది. నా కెరీర్‌లో నేను చేసిన సినిమాల్లో ఇది బెస్ట్ క్యారెక్టర్ అవుతుంది. కచ్చితంగా సినిమాను చూసి ఎంజాయ్ చేస్తారని ప్రామిస్ చేస్తున్నాను. ఈనెల 8 నాతో పాటు నా టీమ్‌కి, ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది' అని అన్నారు.

వెండితెరపై సిల్క్ స్మిత జీవితం



'సిల్క్ స్మిత'గా చంద్రిక రవి

80, 90వ దశకాల్లో గ్లామరస్ తారగా వెలుగొందారు సిల్క్ స్మిత. గ్లామరస్ పాత్రలు, పాటల్లో మెరిసిన ఆమె పీక్ పీరియడ్‌లో బిగ్గెస్ట్ క్రౌడ్-పుల్లర్‌గానూ అలరించారు. సిల్క్ స్మిత అసలు పేరు వడ్లపాటి విజయలక్ష్మి. ఆమె జయంతి పురస్కరించుకొని సిల్క్ స్మిత బయోపిక్‌ను అనౌన్స్ చేశారు దర్శకుడు జయరామ్. సిల్క్ స్మిత క్యారెక్టర్‌లో 'వీరసింహారెడ్డి' సినిమాలోని స్పెషల్ సాంగ్‌లో అలరించిన చంద్రిక రవి చేస్తున్నారు.

ఎస్‌టిఆర్‌ఐ సినిమాస్ పై ఎస్ బి విజయ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా వి.మహాస్త్రీ అమృతరాజ్ సమర్పిస్తారు. సిల్క్ స్మిత కుటుంబ సభ్యుల ఆశీర్వాదంతో మేకర్స్ సిల్క్ స్మిత 'ది అన్‌టోల్డ్ స్టోరీ'ని ప్రపంచానికి చెప్పనున్నారు సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీలో వచ్చే ఏడాది ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.

వాటికి భిన్నంగా పిండం



యశ్వంత్ దగ్గుమాటి

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయి కిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా ఈనెల 15వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం నిర్మాత యశ్వంత్ దగ్గుమాటి మీడియాతో మాట్లాడుతూ,'దర్శకుడు 'పిండం' అనే టైటిల్‌తో కథ చెప్పారు. మీ అందరి లాగానే నేను కూడా మొదట టైటిల్ విని ఆశ్చర్యపోయా. అయితే ఒక జీవి జన్మించాలంటే పిండం నుంచే రావాలి. మరణం తర్వాత పిండమే పెడతారు. జననంలోనూ, మరణం లోనూ ఉంటుంది కాబట్టి ఈ టైటిల్ పెట్టడంలో తప్పేముంది? సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులకి కూడా ఈ టైటిల్ ఎందుకు పెట్టామో అర్థమవు తుందని దర్శకుడు చెప్పారు. ఇది చాలా అద్భుతమైన కథ. ఇది ప్రస్తుతం, 1990లలో, 1930లలో ఇలా మూడు కాలాలలో జరిగే కథ. ఇండియా లోనూ, ఓవర్సీస్‌లోనూ విడుదల చేస్తున్నాం. మిగతా హర్రర్ చిత్రాలతో పోలిస్తే, ఇది భిన్నంగా ఉంటుంది. ఈ తరహాలో సినిమా రావడం ఇదే మొదటిసారి. సినిమా అవుట్ పుట్ చూసుకున్నాక మేము అనుకున్న దానికంటే చాలా బాగా వచ్చింది. దర్శకుడు మాకు చెప్పిన దాని కంటే తక్కువ రోజుల్లోనే పూర్తి చేసి, మంచి అవుట్ పుట్ ఇచ్చారు. నేపథ్య సంగీతం, విజువల్స్ అద్భుతంగా ఉంటాయి' అని చెప్పారు.

నవచిత్రం


సింగిల్ ఫాదర్ ప్రేమలో పడితే?



శౌర్యువ్

నాని నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. వైర ఎంటర్టైన్మెంట్స్ మొదటి ప్రొడక్షన్‌గా రూపొందిన ఈ చిత్రంతో శౌర్యువ్ దర్శకునిగా పరిచయం అవుతున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రాన్ని మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. ఈ సినిమా ఈనెల 7న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఈ సందర్భంగా దర్శకుడు శౌర్యువ్ మీడియాతో మాట్లాతూ, 'జాగ్వార్, అర్జున్ రెడ్డి రీమేక్ ఆదిత్యవర్మ చిత్రాలకు సహాయ దర్శకుడిగా పని చేశాను. దర్శకుడిగా నా ప్రధాన బలం ఎమోషన్. తండ్రీ కూతుళ్ళ మధ్య అనుబంధం, అలానే మృణాల్ పాత్రలో ఉన్న బాండింగ్, అలాగే ఈ కథ అంతా దేనిపై ఆధారపడి వెళ తుందనేది కోర్ స్ట్రెంత్. ఆ ఎమోషన్ కారణంగా నాని ఈ కథని అంగీకరించారు. సింగిల్ ఫాదర్ మళ్ళీ ప్రేమలో పడ్డాడని అనగానే సంతోషం, కుచ్ కుచ్ హోతా హై లాంటి సినిమాలన్నీ గుర్తుకు వచ్చేస్తాయి. అయితే ఇది ఫిక్షనల్ స్టోరీ అయినప్పటికీ జీవితంలో, సమాజంలో పరిశీలించిన అంశాలు ఉంటాయి. 'హాయ్ నాన్న'తో అందరూ ప్రేమలో పడిపోతారు లేదంటే పేరు మార్చుకుంటా అని మృణాల్ చెప్పడానికి సినిమాపై ఆమెకు ఉన్న నమ్మకమే. సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్ పాటలతో పాటు అద్భుతమైన నేపథ్య సంగీతం ఇచ్చారు. 'ఓడియమ్మ..' పాటను విక్రమ్ తనయుడు ధ్రువ్ చక్కగా పాడాడు. బేబీ కియారా ఎమోషన్‌ని అర్థం చేసుకుని అద్భుతంగా నటించింది' అని చెప్పారు.



అనిల్ రావిపూడి, అల్లరి నరేష్

యూనిక్ కథ

హీరో అల్లరి నరేష్ తన 63వ చిత్రాన్ని 'సోలో బ్రతుకే సో బెటర్' దర్శకుడు సుబ్బు మంగాదేవితో చేస్తున్నారు.

హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇది ఈ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం. 4. ఈ చిత్రానికి 'బచ్చల మల్లి' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. ఈ సినిమా ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు ప్రతాప్‌రెడ్డి కెమెరా స్విచాన్ చేయగా, దర్శకుడు అనిల్ రావిపూడి క్లాప్ ఇచ్చారు. విజయ్ కనకమేడల తొలి షాట్‌కి గౌరవ దర్శకత్వం వహించారు. స్క్రిప్ట్‌ని మారుతీ, బుచ్చిబాబు మేకర్స్‌కి అందజేశారు. అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో సూచించినట్లుగా, న్యూ -ఏజ్ యాక్షన్ డ్రామాగా యూనిక్ కథతో ఈ చిత్రం రూపొందుతోంది. అల్లరి నరేష్ ఇంటెన్సివ్ రోల్ ప్లే చేయబోతున్నారు. ఇందులో ఆయనకు జోడిగా అమృత అయ్యర్ కథానాయికగా నటించనుంది. 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఉండబోయే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో స్టార్ట్ కానుంది.

అందరికీ బాగా కనెక్ట్ అయ్యింది



దిల్‌రాజు

రణ్‌బీర్ కపూర్, రష్మిక హీరో, హీరోయిన్లుగా సందీప్ వంగా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యానిమల్'. ఈనెల 1న విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ టాక్‌తో బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్స్‌ను రాబడుతోంది.

ఈ సందర్భంగా ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేసిన నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ,'2023 మాకెంతో కలిసొచ్చింది. నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా చేసిన సినిమాలు మంచి విజయాలను సాధించటం ఎంతో హ్యాపీగా ఉంది. ఈ ఏడాది ఇంకా 'హాయ్ నాన్న'ను కూడా డిస్ట్రిబ్యూట్ చేయబోతున్నాం. 'యానిమల్' సినిమా విషయానికి వస్తే సినిమా బాగా కనెక్ట్ కావటంతో తొలి రోజున మూవీ రికార్డ్ కలెక్షన్స్‌ను సాధించింది. తెలుగు రాష్ట్రాల్లోనూ తొలి రోజు పదిహేను కోట్ల మేరకు గ్రాస్ కలెక్షన్స్ వచ్చాయి. ఇక ఈరోజు, రేపు కూడా ఫ్లో ఎక్కువగా ఉంటుంది. దీంతో ఫస్ట్ వీకెండ్‌లో ముప్పై ఐదు నుంచి యాభై కోట్ల రూపాయల వరకు గ్రాస్ మార్క్‌ను 'అనిమల్' సినిమా అందుకుంటుందని అంచనా వేస్తున్నాం. ఈ సక్సెస్‌ను టీమ్ ఎంతో ఎంజాయ్ చేస్తుంది. సినిమా గ్లోబల్ అయ్యిందనటానికి ఇదొక ఎగ్జాంపుల్. ఇక వచ్చే ఏడాది మా శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో నాలుగు సినిమాలు చేస్తున్నాం. అలాగే దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌లో మూడు సినిమాలు చేస్తున్నాం. మొత్తంగా ఏడు సినిమాలను సరైన సమయంలో ప్రేక్షకుల ముందుకు తీసుకు రావటానికి ప్లాన్ చేసుకుంటున్నాం. 'గేమ్ చేంజర్' సినిమా ఇప్పటికే ఎనభై శాతానికి పైగా చిత్రీకరణను పూర్తి చేసుకుంది. దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్లో చేయబోయే మూడు సినిమాల ద్వారా ముగ్గురు యంగ్ డైరెక్టర్స్ పరిచయం కాబోతున్నారు' అని తెలిపారు.

మాస్.. రత్నం



విశాల్

హీరో విశాల్ కొత్త సినిమా 'రత్నం. స్టోన్ బెంచ్ ఫిల్మ్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి హరి దర్శకత్వం వహించారు. కళ్యాణ్ సుబ్రహ్మణ్యం, అలంకార్ ప్యాండన్ సహ నిర్మాతలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విశాల్ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించారు. దేవీ శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్ర టైటిల్‌తో పాటు ఫస్ట్ షాట్ టీజర్‌ను విడుదల చేశారు.

సినిమా బ్యాక్‌డ్రాప్, ఆ సెటప్, దేవీ శ్రీ ప్రసాద్ ఇచ్చిన ఆర్ఆర్, విశాల్ మాస్ అవతారం ఇలా అన్నీ కలిసి ఈ ఫస్ట్ షాట్ టీజర్‌ను అద్భుతం అనేలా చేశాయి. 'కన్నీరే నెత్తురు చిందగా.. క్రోదమే రుధిరం చిమ్మగా..'అంటూ బ్యాక్ గ్రౌండ్‌లో వచ్చే మాటలు, తలని నరికిన రక్తంతో టైటిల్ పేరు రావడం మాస్ ఆడియెన్స్‌ను ఆకట్టుకునేలా ఉంది. ఈ సినిమాకు వివేక్ పాటలు రాశారు' అని చిత్ర యూనిట్ తెలిపింది.

మంచి సినిమా అని ప్రశంసిస్తున్నారు



క్లూస్ టీం ప్రాధాన్యతను చూపిస్తూ తెరకెక్కించిన చిత్రం అథర్వ. కార్తీక్ రాజు, సిమ్రన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా నటించిన ఈ మూవీకి మహేష్ రెడ్డి దర్శకుడు.

నూతలపాటి నర సింహం, అనసూయమ్మ సమర్పణలో పెగ్గో ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్‌పై సుభాష్ నూతలపాటి నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 1న ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రశంసలను అందుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ చిత్ర సక్సెస్ మీట్ ఈవెంట్‌లో హీరో కార్తీక్ రాజు మాట్లాడుతూ,' మా చిత్రానికి ఫుల్ పాజిటివ్ రిపోర్టులు వచ్చాయి. చాలా చోట్ల హౌస్ ఫుల్స్ కనిపించాయి. మొదటి రోజే ఇంత మంచి ఆదరణ రావడంతో మేం పడ్డ కష్టాన్ని మర్చిపోయాం. మంచి సినిమాను తీశామని అంటున్నారు. అక్కడే మా దర్శకుడు మహేష్ రెడ్డి సక్సెస్ అయ్యారు. మా సినిమాను ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్' అని అన్నారు. 'సినిమాకు ఇంత మంచి రెస్పాన్స్ వస్తుందని అనుకోలేదు. ఆడియెన్స్ మా చిత్రాన్ని ఆదరిస్తున్నారు' అని నిర్మాత సుభాష్ నూతలపాటి చెప్పారు.

దర్శకుడు మహేష్ రెడ్డి మాట్లాడుతూ, 'కొత్త పాయింట్, కొత్త కథ చెబితే ఆడియెన్స్ ఆదరిస్తారని నాకు నమ్మకం ఉంది. అందుకే క్లూస్ టీం మీద సినిమా తీశాను. శ్రీ చరణ్ పాకాల అందించిన ఆర్ఆర్, పాటలు సినిమాకు ప్రాణంలా నిలిచింది. సాయి చరణ్ విజువల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి' అని తెలిపారు.





ఇచ్చిపుచ్చుకునే పద్ధతి

'ప్రతి తల్లిలో ప్రేమ ఉంటుంది. తమ పిల్లలు బాగుండాలని, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటారు. మేము వారి పిల్లల శ్రేయస్సు కోసం పాఠశాలను నిర్మించామని తల్లులు అర్థం చేసుకుని వారు అడవిని నిర్మించే పనిని మరింతగా చేయడానికి ప్రేరేపించబడతారు. తల్లిని అడవిని రక్షించే పనిలో భాగం చేస్తే మొత్తం కుటుంబం ఇందులో భాగమైనట్టే. ఆమె పిల్లలు ఆమెతో పాటు వస్తారు. భర్త కూడా మద్దతుగా ఉన్నారు. తోటల పెంపకం కంటే చెట్లను రక్షించడం చాలా కష్టం అని ఈ పనిలోకి దిగిన తర్వాతే నాకు తెలిసింది' అని ఉమాశంకర్ చెప్పారు.

అమ్మలు నిర్మించిన అడవి

ప్రకృతి వైపరిత్యాలతో మునిగిపోతున్న గ్రామాలను కాపాడుకోవడం తమ బాధ్యతగా భావించారు ఆ తల్లులు. తమ పిల్లలకు సురక్షితమైన భవిష్యత్ ఇవ్వాలని కోరుకున్నారు. పులుల దాడికి గురై భర్తలను పోగొట్టుకున్నారు. ఉపాధి లేక సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన తల్లులే అక్కడ ఎక్కువ. అలాంటి తల్లులు ఇప్పుడు అక్కడ మడ చెట్లను నాటి అడివిని నిర్మించారు. దాన్ని పరిరక్షిస్తూ గ్రామాలను తద్వారా తమ కుటుంబాలను కాపాడుకుంటున్నారు. ఇలాంటి ఓ గొప్ప కార్యక్రమం చేసేందుకు వారికి స్ఫూర్తి నిచ్చిన వారు ఎవరో, అక్కడ ఆ తల్లులు ఏం చేస్తున్నారో తెలుసుకుందాం...



ప్రకృతి పరిరక్షణలో భాగంగా ఉమాశంకర్ స్థాపించిన పుర్బాషా ప్రాథమిక పాఠశాలలో 80 మంది విద్యార్థులు, మడ ఆర్మీ పిల్లలు ఉన్నారు. భౌగోళిక రాజకీయ తగాదాలకు దూరంగా పర్యావరణహితంగా ఉన్న ప్రదేశాలలో సుందర్‌బన్స్ ఒకటి. ఈ బంగాళాఖాతంలో పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ అంతటా విస్తరించి ఉంది. 2009లో వచ్చిన ఐలా తుఫాను, చెట్లను, ఇళ్లను నేలమట్టం చేసి తీరప్రాంతాన్ని నిర్మానుష్యంగా మార్చింది. అలాంటి దెబ్బ తర్వాత సుందర్‌బన్స్ ప్రాంతంలోని ఛర్వేరీ గ్రామంలో పుట్టి పెరిగిన ఉమాశంకర్ గ్రామం రక్షణ కోసం దట్టమైన అటవీప్రాంతాన్ని అందించే లక్షల మడ మొక్కలను నాటడానికి ప్రజలను నడిపించాడు. తర్వాత అతను జంగీపూర్ హైస్కూల్‌లో భౌగోళిక శాస్త్రాన్ని బోధించడానికి ముర్షిదాబాద్‌కు వెళ్ళిపోయాడు. కోల్‌కతా నుండి 110కి.మీ కంటే ఎక్కువ దూరంలో ఉన్న సట్జెలియా ద్వీపంలో చార్వేరి ఉంది.

ఏనాడూ కట్టలు తెగలేదు

లక్షల మడ మొక్కలు ఇప్పుడు చార్వేరి గ్రామం కోసం దట్టమైన అటవిని నిర్మించాయి. సమాజం సృష్టించిన మడ అడవులకు ఎదురుగా చార్వేరీ మట్టి కట్టపై నిలబడి నది సవ్వడులను వినవచ్చు. ఈ నది15 ఏండ్ల కిందట కూడా గట్టును చీల్చివేసి గ్రామాన్ని ముంచెత్తుతుంది. ఇప్పుడు మడ చెట్లతో నిండిన అడవి ఆ సమస్య నుండి గ్రామాన్ని రక్షిస్తుంది. ఉమాశంకర్‌తో కలిసి ఇతరులు నాటిన మడ చెట్లు భవిష్యత్తులో వచ్చే తుఫానుల నుండి గ్రామాన్ని రక్షిస్తున్నాయి. 2020లో అంఫాన్, 2021లో యాస్ తుఫానులు సుందర్‌బన్స్‌ను తాకినప్పుడు ఛార్వేరీ భారీ నష్టం నుండి తప్పించుకుంది. అడవి వచ్చినప్పటి నుంచి ఏనాడూ కట్టలు తెగలేదు. అంతేకాదు వాతావరణ మార్పులకు కీలకమైన కార్బన్ నిల్వగా కూడా అడవి మారింది. ఎనిమిది లక్షల కంటే ఎక్కువ మడ చెట్లు ఇప్పుడు చార్వేరీ గ్రామాన్ని దాటి ఇతర ద్వీప గ్రామాల వరకు విస్తరించాయి. .





కార్బన్ సింక్‌గా మడ అడవులు

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సంక్షోభానికి పరిష్కారాలలో కార్బన్ క్యాప్చర్ ఒకటి. 'వాతావరణ అధ్యయనాలలో బ్లూ కార్బన్ చాలా ముఖ్యమైన ప్రాంతం. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడానికి, బురద చదునైన ప్రదేశాలలో మడ అడవులను నాటడం ద్వారా బ్లూ కార్బన్ స్టాక్‌ను పెంచాలి. చార్వేరీ నుండి మడ అడవులను తొలగించి, అటవీ ప్రాంతాన్ని రక్షించకపోతే వాతావరణంలో కార్బన్ విడుదల అవుతుంది. ఈ ప్రాంతంలో వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతుంది' అని సుందర్‌బన్స్‌లో పనిచేస్తున్న తీరప్రాంత నిర్వహణ నిపుణుడు పాల్ చెప్పారు.

వాటాదారులుగా తల్లులు

మాంచెస్టర్ విశ్వవిద్యాలయంలోని భౌగోళిక విభాగం డాక్టర్ మెహెబూబ్ సహానా మాట్లాడుతూ 'ఉమాశంకర్ చేసిన కృషి ఇక్కడ నిలుస్తుంది. వారు నిర్మించిన అడవిని సంరక్షించడంలో స్థానిక సంఘాలను వాటాదారులుగా మార్చడం మంచి పరిణామం. మడ అడవులను పునరుద్ధరించి వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల నుండి ఈ ప్రాంతాన్ని రక్షించగలుగుతున్నారు. మరియు పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచింది' అన్నారు.

పాఠశాల మంచి అవకాశం

ఈ ఏడాది జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పుర్బాషా ప్రాథమిక పాఠశాల ప్రారంభమైంది. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు పసుపు, ఆకుపచ్చ రంగు యూనిఫారంలో ఉన్న పిల్లలు గుంపులు గుంపులుగా తరగతి గదికి చేరుకుంటారు. 80 మంది విద్యార్థులు మాంగ్రోవ్ ఆర్మీకి చెందిన అబ్బాయిలు, అమ్మాయిలు, సమాజం పెంచిన మడ అడవులను రక్షించడం వారి పనిగా భావిస్తున్నారు. 'మా ఊరిలో మాకు పాఠశాల లేదు. రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నప్పటికీ మా పిల్లలు చదువుకోవడానికి చాలా దూరం వెళున్నారు. ఈ పాఠశాల మాకు ఒక మంచి అవకాశం. దుర్గాపూజ వంటి పండుగలలో పిల్లలకు ఆహారం, పుస్తకాలు, పెన్సిళ్లు, బట్టలు కూడా ఇస్తారు' అని 80 మంది మడ ఆర్మీ సభ్యులలో ఒకరైన నందిని ఘరామి చెప్పారు.

చెట్లకు రాఖీలు కడతారు

వారి పనిలో మొక్కలు నాటడం అత్యంత కీలకం. అలాగే మేకలను పోషించడానికి కలపను, మెత్తటి మడ ఆకులను కత్తిరించే గ్రామస్తుల నుండి కూడా అడవిని రక్షిస్తున్నారు. జూన్ నుండి అక్టోబరు వరకు మడ విత్తనాలను నాటడానికి ఉత్తమ సీజన్. పాఠశాలలో చదువుతున్న నందిని, సబితా మండల్ మాట్లాడుతూ 'చెట్లను పెంచడానికి బయటకు రావడం చాలా సంతోషంగా ఉంది' అంటున్నారు. మడ విత్తనాలు సుదూర అడవుల నుండి నీటిలోకి వస్తాయి. మహిళలు వాటిని సేకరించి, మొలకెత్తిస్తారు. తర్వాత వాటిని నాటుతారు. పీక్ సీజన్ లో వారు ఒక గంటలో దాదాపు 10,000 విత్తనాలు సేకరిస్తారు. మిగిలిన కాలంలో వారు మడ అడవుల బంధన్ వంటి కార్యక్రమాలలో పాల్గొంటారు. వీరంతా చెట్లకు రాఖీలు కడతారు.

స్థిరమైన ఆదాయం...

ఇక్కడ ఉన్న ప్రతి కుటుంబంలో ఒకరు పులి దాడికి గురైన వారే. ఎక్కువ మంది పురుషులు దొంగతనంగా చేపలు పట్టడం, పీతలను పట్టుకోవడం, తేనె సేకరించడం కోసం పులులు అధికంగా ఉండే అడవుల్లోకి ప్రవేశించి ప్రాణాలు కోల్పోయారు. దాంతో వారి భార్యలు సామాజిక, ఆర్థిక సమస్యను ఎదుర్కొంటారు. వీరిలో చాలా మంది ఇరవై ఏండ్ల వయసులో ఉన్నవారే. వీరందరికీ సరైన ఉపాధి లేదు. 'మేము 50 మంది వితంతువులను మడ అడవుల పెంపకంలో పాల్గొనేలా చేయడం ద్వారా స్థిరమైన ఆదాయం అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. వచ్చిన వారికి ఒక్కొక్కరికి 10 బాతులు, 10 కోళ్ల చొప్పున ఇస్తున్నాము. వారు మొదట ఒక మొక్కను నాటారు. ఇప్పుడు ఆ చెట్టుతో పాటు మిగిలిన అడవిని చూసుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నారు. ఇది చాలా మందికి ఇచ్చిపుచ్చుకునే ధోరణిలా అనిపించవచ్చు. కానీ మా ప్రాంతంలో ఇది ప్రభావవంతంగా ఉంటుంది' అని ఉమాశంకర్ చెప్పారు.

ఒక చిన్న తెల్లవెంట్రుక కనబడితే చాలు 60 ఏండ్లు గడిచినట్టు చాలామంది భావిస్తారు. ప్రతి ఒక్కరూ యవ్వనంగా కనబడాలని కోరుకుంటారు. దీని కోసం అనేక మార్గాలను అనుసరిస్తుంటారు. ముందు యవ్వనంగా ఉండాలంటే మీ ముఖం మీది ఉన్న ముడతలను వదిలించు కోవాలి. ఆ తర్వాత యవ్వనం మీ సొంతమవుతుంది. దీని కోసం వేలకు వేలు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. ఆముదం నూనె చాలు.

ఆముదం చాలు...



- చెంచా ఆముదం నూనె, ఒక చెంచా కొబ్బరి నూనె కలిపి ముఖం మీద అప్లై చేసి మెల్లగా మసాజ్ చేయాలి. 20 నిమిషాల తర్వాత దాన్ని తొలగించండి. ఇలా రోజుకు మూడు సార్లు చేస్తే మంచి ఫలితం వుంటుంది.
- ఒక చెంచా ఆముదం, ఒక చెంచా నిమ్మరసం రెండింటినీ కలిపి ముఖానికి రాయాలి. ఆ తర్వాత కడిగేయాలి.
- ఒక చెంచా రోజ్ వాటర్, ఒక చెంచా ఆముదం రెండింటినీ కలిపి ముఖం మీద రాయాలి. ఆ తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. దీని వల్ల ముఖం మీద ముడతలు పోయి చర్మం యవ్వనంగా మారుతుంది.
- చెంచా ఆముదం, ఒక చెంచా పసుపు రెండింటినీ కలిపి ముఖం మీద రాయాలి. 15 నిమిషాల తర్వాత కడగండి. మీ ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.

ఇట్ల చేద్దాం

ఫ్లవర్ వాజ్‌లో పెట్టే పూలు ఎక్కువ సేపు తాజాగా ఉండాలని అందరం కోరుకుంటాం... అందుకోసం... వాజులోని నీటిలో నచ్చిన పరిమళాన్ని ఒక చెంచా వేయాలి. దీనితో పాటు చెంచా చక్కెరను కూడా వేయాలి. ఈ రెండూ పూలను ఎక్కువసేపు తాజాగా ఉంచుతాయి.



రంగంలోకి రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

జరగనున్న 49 కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పరిశీలకులను ఏఐసీసీ నియమించింది. అభ్యర్థులు, పర్యవేక్షకులు, చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎదురయ్యే సాంకేతిక అంశాలపై వివరించారు. అప్పటివరకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సూచించారు. ఎన్నికల ఏజెంట్‌కు ఎమ్మెల్యే ధ్రువపత్రం ఇవ్వాలని తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌ను కలిసి కోరారు. అయితే అలాంటి వెసులుబాటు ఏదీ లేదని వికాస్ రాజ్ వారికి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

మా అభ్యర్థులను ట్రాప్ చేసేందుకు కేసీఆర్ ప్రయత్నం : డీకే

(మొదటిపేజీ తరువాయి)

మా పార్టీ అభ్యర్థులు చెప్పారు. గెలిచిన వారిని క్యాంపులకు తరలించే అవసరం రాదు' అని డీకే తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరూ అలెర్ట్‌గా ఉండాలని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సూచించారు. మరోవైపు ఫలితాల తర్వాత అవసరమనుకుంటే ఎమ్మెల్యేలను క్యాంప్‌కు పంపాలనే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరేంత వరకూ పూర్తి బాధ్యతలను కాంగ్రెస్ హైకమాండ్ డీకేకు అప్పగించింది. ఈ నెల 9న ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారానికి రేవంత్ ముహూర్తం ఖరారు చేశారు. ఆయన ఇంటి వద్ద నేతల హడావిడి చేస్తున్నారు. మొన్నటి నుంచి రేవంత్‌ను కాంగ్రెస్ నేతలు, ఆ పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులు కలుస్తున్న విషయం తెలిసిందే.

దిగిపోయే ముందు కీలక నిర్ణయాలా? : ఉత్తమ్

(మొదటిపేజీ తరువాయి)

పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మధుయాష్కీ, మహేష్‌కుమార్‌గౌడ్, జి. నిరంజన్, హర్కర వేణుగోపాల్, రోహిన్‌రెడ్డితోపాటు ఇతర కాంగ్రెస్ నేతలు సీఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ రైతుబంధు నిధులను కాంట్రాక్టర్లకు చెల్లించకుండా చూడాలని సీఈవోను కోరారు. ఆ పథకం కింద రూ. 6వేల కోట్లు ఇచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. హైదరాబాద్‌లో అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. వాటిని ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయకుండా చూడాలని కోరారు. అసైన్డ్ భూముల రికార్డులు మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ లావాదేవీలపై నిఘా పెట్టాలని కోరారు. ఫలితాల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి విధాన నిర్ణయాలు తీసుకోకూడదని అన్నారు. గెలుపు ధృవపత్రాలను తమ పార్టీ చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు తీసుకుంటారనీ, అందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. సోమవారం కేసీఆర్ మంత్రివర్గ సమావేశాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారో తెలియదన్నారు. రాజీనామాలు సమర్పించేందుకే క్యాబినెట్ ఏర్పాటు చేసి ఉండొచ్చునన్నారు.

అసెంబ్లీ ముస్తాబు... అడుగుపెట్టేదెవరో?

(మొదటిపేజీ తరువాయి)

మార్పులు, చేర్పులు చేస్తున్నారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన జనవరి 16న ముగియనుంది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమవుతుంది. రాత్రి వరకు తుది ఫలితాలు రానున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ నువ్వా...నేనా అన్నట్టు పోరాటగా, సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ మాత్రం కాంగ్రెస్ వైపు ఉన్నాయి. ఈ క్రమంలో సోమవారం సీఎం కేసీఆర్ మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలోనే సీఎం రాజీనామా చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. బీఆర్ఎస్ గెలిస్తే ప్రమాణస్వీకారోత్సవానికి సిద్ధం కానుంది. లేదంటే రాజీనామా చేస్తే ప్రతిపక్షంలో ఉండే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో కాంగ్రెస్ హడావుడి చేస్తున్నది. ఆదివారం ఫలితాలు వెలువడిన తర్వాత వేగంగా పరిణామాలు మారనున్నాయి.

ప్రజా సమస్యలపై సవివరమైన చర్చ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులకు హిందీలో పేర్లు పెట్టడంపై అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తంచేశాయి. ఐపీసీకి బదులుగా భారతీయ న్యాయ సంహిత, సీఆర్‌పీసీకి బదులుగా భారతీయ సివిల్ ప్రొటెక్షన్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్‌కు బదులుగా భారతీయ సాక్ష్యా అధినియం అని పేరు పెట్టారు. ఈ చర్యను దక్షిణ భారతదేశంలోని పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. బీజేపీ అనుకూల వైఖరితో ఉన్న అన్నాడీఎంకే కూడా నిరసనలో భాగస్వామి అయింది. కొత్త పేర్లను పెట్టి క్రిమినల్ చట్టాల్లో హిందీని రుద్దడాన్ని ఆయా పార్టీల నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. జనాభా లెక్కలతోనే సామాజిక వర్గాల వారీ లెక్కలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో బిల్లులపై చర్చలకు సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రతిపక్షాలు ప్రకటించాయి.

అయితే కేంద్ర ప్రభుత్వం తరపున చర్చలో పాల్గొన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ మేఘ్వాల్ లు ప్రతిపక్షాలు లేవనెత్తిన డిమాండ్‌లకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. అఖిల పక్ష సమావేశంలో కాంగ్రెస్ నేతలు జైరాం రమేష్, ప్రమోద్ తివారీ, గౌరవ్ గొగోయ్, టీఎంసీ నేతలు సుదీప్ బంద్యోపాధ్యాయ, డెరెక్ ఓ బ్రియన్, డీఎంకే ఎంపీ విల్సన్, జేఎంఎం ఎంపీ మహువా మజీ, ఎస్పీ ఎంపీ ఎస్‌టీ హసన్, బీఎస్పీ ఎంపీ గిరీష్ చంద్ర, జేడీయూ నేత దిలేశ్వర్ కామత్, ఎన్సీపీ ఎంపీ ఫౌజియా ఖాన్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ ఎన్ డి గుప్తా, సీపీఐ(ఎం) ఎంపీ ఎలమారం కరీం, సంతోష్ కుమార్ (సీపీఐ), అగాథా సంగ్మా (ఎన్సీపీ), ఎన్ కె ప్రేమచంద్రన్ (ఆర్ఎస్‌పీ), నామా నాగేశ్వరరావు (బీఆర్ఎస్), కనకమేడల రవీంద్ర కుమార్ (టీడీపీ) తదితరులు హాజరయ్యారు.

నిర్మాణాత్మక చర్చకు ప్రభుత్వం సిద్ధం: మంత్రి ప్రహ్లాద్ జోషి

సమావేశ అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడారు. 'నిర్మాణాత్మక చర్చల వాతావరణం నెలకొల్పాలని కోరాం. చర్చలు నియమాలు, నిబంధనలు అనుసరించి జరగాలి. అన్ని అంశాలపై చర్చలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నిర్మాణాత్మక చర్చకు ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉంది' అన్నారు.

నిరుద్యోగం, ధరల పెరుగుదలపై చర్చించాలి : ఎలమారం కరీం

సీపీఐ(ఎం) పార్లమెంటరీ పార్టీ నేత ఎలమరం కరీం మాట్లాడుతూ నిరుద్యోగం, ధరల పెరుగుదల, మణిపూర్ వివాదం, బీజేపీయేతర రాష్ట్రాలపై ఆర్థిక వివక్షపై వంటి అంశాలపై సవివరంగా చర్చించాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంపై సభలో చర్చించాలని కోరారు. ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌కి కొత్త పేర్లను పెట్టి క్రిమినల్ చట్టాలలో హిందీని విధించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దక్షిణ భారత రాష్ట్రాలకు చెందిన వ్యక్తులకు సంబంధించినంతవరకు ఉచ్ఛరించడం కూడా చాలా కష్టమనీ, అయితే ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. ముఖ్యమైన బిల్లులకు హిందీలో పేర్లు పెట్టడం మోడీ ప్రభుత్వం హిందీని విధించే ప్రణాళికలో భాగమేనని ఎలమరం కరీం ఎత్తిచూపారు. గవర్నర్లను పకడ్బందీగా ఆయుధాలుగా చేసుకుని రాష్ట్రాల్లో రాజకీయ తిరుగుబాట్లు చేసే ప్రయత్నాలు, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక వివక్షకు స్వస్తి పలకాలని అన్నారు. దేశంలో కుల గణన నిర్వహించే విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే సానుకూల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభకు ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా జరుగుతుందని ఆశిస్తున్నామని అన్నారు.

సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ అదానీ కుంభకోణం, మణిపూర్ వివాదం సహా సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించలేకపోతోందని విమర్శించారు. అలాగే హిందీలో ఐపీసీ తదితర పేర్లను మార్చాలన్న ఎత్తుగడ దేశాన్ని మధ్యయుగానికి నెట్టివేస్తోందని విమర్శించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తాం: నామా నాగేశ్వరరావు

ధరలు పెరుగుదల, నిరుద్యోగ సమస్య, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, ప్రజా సమస్యలపై చర్చ, రైతుకు కనీస మద్దతు ధరకు సంబంధించిన చట్టాలపై ఈ పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలని బీఆర్ఎస్ నేత నామా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కేవలం కొత్త బిల్లులపైనే కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై చర్చించాలని కేంద్రాన్ని కోరినట్టు తెలిపారు. తెలంగాణాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశాల్లో 21 బిల్లులు జాబితా

ఈ పార్లమెంట్ సమావేశాల్లో మొత్తం 21 బిల్లులను ఆమోదించుకునేందుకు ప్రభుత్వం జాబితా చేసింది. అందులో 19 సాధారణ బిల్లులు కాగా, రెండు ఆర్థిక బిల్లులు ఉన్నాయి.

భారతీయ న్యాయ సంహిత బిల్లు 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహితా బిల్లు 2023, భారతీయ సాక్ష్యా బిల్లు 2023 బిల్లు, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం, మహిళా రిజర్వేషన్ చట్టంలోని నిబంధనలను జమ్మూ కాశ్మీర్, పుదుచ్చేరికి విస్తరించడానికి రెండు, సెంట్రల్ యూనివర్శిటీ సవరణ బిల్లు, పోస్టాఫీసు సవరణ బిల్లు, రాజ్యసభలో ఆమోదం పొందిన అడ్వకేట్స్ (సవరణ) బిల్లు, ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పిరియాడికల్స్ తదితర బిల్లులను జాబితా చేసింది.

మోడీ సెల్ఫీ పాయింట్లు!

(మొదటిపేజీ తరువాయి)

కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు అనేక సందర్భాలలో నిరసనలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. యూజీసీ ఆదేశాల ప్రకారం విద్యా సంస్థలు వ్యూహాత్మక ప్రదేశంలో 3డీ లే-అవుట్‌తో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయాలి. విద్యను అంతర్జాతీయం చేయడం, భిన్నత్వంలో ఏకత్వం, స్మార్ట్ ఇండియా హాకథాన్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్, బహుళ భాషలు, ఉన్నత విద్యలో భారత్ పురోభివృద్ధి, పరిశోధనలు, ఆవిష్కరణలు వంటి అంశాలను ఫొటోల రూపంలో ప్రదర్శించాలని యూజీసీ సూచించింది.

సూర్యుడిపై అధ్యయనంలో కీలక ఘట్టం

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో వెల్లడించింది. ఈ పేలోడ్‌లోని రెండు పరికరాలు పరిశోధనలను విజయవంతంగా కొనసాగిస్తున్నాయని, ఇవి సౌర గాలులను అధ్యయనం చేస్తున్నాయని తెలిపింది. ఈ ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ పేలోడ్‌లో రెండు పరికరాలున్నాయి. ఇందులోని సూపర్‌థర్మల్ అండ్ ఎనర్జిటిక్ పార్టికల్ స్పెక్ట్రోమీటర్‌ను సెప్టెంబరు 10న, సోలార్ విండ్ అయాన్ స్పెక్ట్రోమీటర్‌ను నవంబరు 2న యాక్టివేట్ చేశారు. ఈ రెండు తమ కార్యకలాపాలను సజావుగా సాగిస్తున్నాయని ఇస్రో తెలిపింది. స్విస్‌లో ఉన్న రెండు సెన్సర్లు 360 డిగ్రీల్లో తిరుగుతూ పనిచేస్తున్నాయి. ఇవి నవంబరులోని రెండు తేదీల్లో సోలార్ విండ్ అయాన్లు, ప్రైమరీ ప్రోటాన్స్, ఆల్ఫా పార్టికల్స్‌ను విశ్లేషించినట్లు ఇస్రో తెలిపింది. ఈ సెన్సర్ సేకరించిన ఎనర్జీ హిస్టోగ్రామ్‌ను పరిశీలించిన తర్వాత.. ప్రోటాన్, ఆల్ఫా పార్టికల్స్‌లో కొన్ని వైవిధ్యాలు ఉన్నట్లు గుర్తించామని ఇస్రో పేర్కొంది.

మళ్లీ బాంబుల మోత..

(మొదటిపేజీ తరువాయి)

యుద్ధం ప్రారంభం నుంచి ఇప్పటివరకు గాజాలో 15,200 మంది మృతి చెందినట్టు గాజా ఆరోగ్య విభాగం వెల్లడించింది. చనిపోయినవారిలో మూడింట రెండొంతులు మహిళలు, చిన్నారులేనని తెలిపింది. మరో 40 వేలమంది పౌరులు గాయపడినట్లు ప్రకటించింది. అక్టోబరు 7న హమాస్ మెరుపు దాడులకు ప్రతిగా గాజాపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోన్న విషయం తెలిసిందే.

నేడే ప్రజాతీర్పు

(మొదటిపేజీ తరువాయి)

రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు కోసం 28 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పెద్ద నియోజకవర్గాల్లో త్వరగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేసేందుకు ఎన్నికల సంఘం ఈ ఏర్పాట్లు చేసింది. 99 నియోజకవర్గాల్లో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. షాద్ నగర్ నియోజకవర్గంలో 12 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఖమ్మం, కోదాడ నియోజకవర్గాల్లో 16 టేబుళ్లు, తుంగతుర్తి, హుజూర్‌నగర్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో 18 టేబుళ్లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించారు. గెలుపొందిన అభ్యర్థుల విజయ యాత్రల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా చర్యలు తీసుకోవాలని డీజీపీ అంజన్‌కుమార్ పోలీసు అధికారుల్ని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాలు, ఆ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా వివాదాలు, ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో గెలుపుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్లకు ఎలాంటి భద్రత కల్పించకుండా, ఓపెన్‌గా పడేశారంటూ శనివారం రాత్రి కాంగ్రెస్ నేతలు ఆందోళనలకు దిగారు. 29వ తేదీ వేసిన పోస్టల్ బ్యాలెట్లను స్ట్రాంగ్ రూములకు పంపలేదనీ, కనీసం ఆ బాక్సులకు సీల్ కూడా వేయలేదని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. దీనితో అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసు అధికారులు కాంగ్రెస్ కార్యకర్తలకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

కౌంటింగ్ ఇలా...

స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. 40 కంపెనీల కేంద్ర బలగాలు భద్రతా విధుల్లో ఉన్నారు. సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సెంటర్లలో 1,798 లెక్కింపు టేబుళ్లు, 131 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. హెూం ఓటింగ్ బ్యాలెట్లను కూడా పోస్టల్ బ్యాలెట్లతో కలిపే లెక్కిస్తారు. ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు మొదలవుతుంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువగా ఉంటే రెండింటి కౌంటింగ్ సమాంతరంగా జరుగుతుంది. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఎన్నికల సూక్ష్మ పరిశీలకులు, కౌంటింగ్ సూపర్ వైజర్, ఇద్దరు సహాయకులు ఉంటారు. 49 కౌంటింగ్ కేంద్రాల్లో 119 మంది టెక్నికల్ ఇంజినీర్లు కూడా అందుబాటులో ఉంటారు.

డీఏ విడుదలకు ఈసీ అనుమతి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ) విడుదలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) అనుమతి ఇచ్చింది. ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో ఒక డీఏ విడుదలకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఈసీకి విజ్ఞప్తి చేసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, ఈసీ మధ్య సంప్రదింపులు జరిగాయి. డీఏల చెల్లింపు ఆలస్యానికి కారణాలు, గతంలో డీఏల చెల్లింపు విధానాలపైనా ఈసీ ఆరా తీసింది. ఉద్యోగ సంఘాలు కూడా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రాలు పంపాయి. పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఉద్యోగులకు ఒక డీఏ విడుదల చేసేందుకు ఈసీ అనుమతి ఇచ్చింది.

మిచాంగ్ తుపాను దూసుకొస్తోంది : ఐఎండి రెడ్ అలర్ట్..!

అమరావతి : మిచాంగ్ తుపాను దూసుకొస్తున్న వేళ ... ఐఎండి రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడిందని, రేపటికి తుపానుగా మారే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ ముందుగానే వెల్లడించింది. ఆ తర్వాత వాయుగుండం దక్షిణకోస్తా తీరానికి సమాంతరంగా ప్రయాణిస్తుందని, మంగళవారం మధ్యాహ్నం నెల్లూరు-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని తెలిపింది. తుపాను ప్రభావంతో ఆదివారం నుండి మంగళవారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురవనున్నాయి. మంగళవారం అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదైయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

గంటకు 80 -100 కీమీ వేగంతో బలమైన గాలులు....

నెల్లూరు జిల్లా వైపు మిచాంగ్ తుపాను దూసుకొస్తుందన్న ఐఎండి తుపాను హెచ్చరికల నేపథ్యంలో ... 4వ తేదీ జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు జిల్లా కలెక్టర్ ఎం హరి నారాయణన్ సెలవు ప్రకటించారు. ఆదివారం నుంచి కోస్తా తీరం వెంబడి గంటకు 80 -100 కీమీ వేగంతో బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు మంగళవారం వరకు వేటకు వెళ్లకూడదని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు.







నిఘా నీడలో కౌంటింగ్ కేంద్రాలు

• సీసీ కెమెరాలు.. పోలీసు బందోబస్తు • అమల్లో 144 సెక్షన్

నవతెలంగాణ- విలేకరులు

శాసన సభ ఎన్నికల ఫలితాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉన్నతాధికారులు కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి.. ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ మొత్తం సీసీ కెమెరాల నిఘాలో పోలీసు బందోబస్తు మధ్యలో జరగనుంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేయనున్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో కౌంటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రంగారెడ్డి జిల్లాలో 209, వికారాబాద్ జిల్లాలో 61 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు కౌంటింగ్ కేంద్రాలు ఉన్నాయి. గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు ఉంటుంది. గండిపేట పరిధిలోని అప్ప జంక్షన్ లార్డ్ ఇంజినీరింగ్ కాలేజీలో రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఇబ్రహీంపట్నం పరిధిలోని సీవీఆర్ కాలేజీలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉంటుంది. వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ యార్డులో వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూర్ నియోజకవర్గాల ఓట్లు లెక్కించనున్నారు. రంగారెడ్డి జిల్లాలోని 8 నియోజకవర్గాలను 166 టేబుల్స్‌పై ఈవీఎంలు, 51 టెబుల్స్‌పై పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుంది. వికారాబాద్ జిల్లాలోని 4 నియోజకవర్గాలను 56 టెబుల్స్‌పై ఈవీఎంలు, 13 టెబుల్స్‌పై పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 10గంటల 30 నిమిషాలకు మొదటి ఫలితం రానుంది. రంగారెడ్డి జిల్లాలో 1085 మంది, వికారాబాద్ జిల్లాలో 426 మంది చొప్పున సిబ్బంది లెక్కింపు ప్రక్రియలో పాల్గొంటారని ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఇందులో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్స్ స్థాయి ఉద్యోగులు కౌంటింగ్ కేంద్రాల్లో ఉండనున్నారు.

వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ గోదాంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నారాయ ణరెడ్డి పరిశీలించారు. కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం అధికారులతో సమావేశమై పలు సలహాలు, సూచనలు చేశారు. అందరూ తప్పకుండా ఉదయం ఐదు గంటల్లోపు కేంద్రానికి ఐడీ కార్డుతో హాజరుకావాలని సూచించారు. ఇబ్రహీంపట్నం సీవీఆర్ కాలేజీని రాచకొండ సీపీ చౌహాన్ పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్లు, బందోబస్తు నిర్వహణపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

భువనగిరి పట్టణంలోని అరోరా ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ చేయనున్నారు. భువనగిరి నియోజకవర్గంలో 257 బూతులు 14 టేబుల్స్ 19 రౌండ్లు చేయనున్నారు. ఒక్కొక్క రౌండ్‌కు 14 బూత్‌ల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఆలేరు నియోజకవర్గంలో 309 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 14 టేబుల్ 23 రౌండ్లు కౌంటింగ్ చేయనున్నారు.

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలో గల గోదాముల్లో జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుంది. ప్రతి నియోజకవర్గానికీ 14 కౌంటింగ్ టేబుల్లు, ఒక పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్ ఏర్పాటు చేశారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో నాలుగు నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్స్‌తో పాటు కౌంటింగ్‌హాల్స్ ఏర్పాటు చేశారు. హుజూర్‌నగర్ 308 పోలింగ్ కేంద్రాలకు 22 రౌండ్స్, కోదాడ 296 పోలింగ్‌కేంద్రాలకు 22 రౌండ్స్, సూర్యాపేటలోని 271 పోలింగ్‌కేంద్రాలకు 20 రౌండ్స్, తుంగతుర్తిలోని 326 పోలింగ్‌కేంద్రాలకు 24 రౌండ్స్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం హుజూర్‌నగర్ కౌంటింగ్‌హాల్‌కు 4 టేబుల్స్, కోదాడకు 5 టేబుల్స్, సూర్యాపేటకు 6 టేబుల్స్, తుంగతుర్తికి 3 టేబుల్స్ మొత్తం 18 టేబుల్స్ ఏర్పాటు చేశారు.

ఖమ్మంలో..

ఖమ్మం జిల్లాలో ఐదు నియోజకవర్గాల ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ వద్ద శ్రీ చైతన్య కళాశాలలో జరగనుంది. శనివారం కలెక్టర్ విపి గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్ పరిశీలించారు. ఖమ్మం, పాలేరు నియోజక వర్గానికి ఎక్కువ మంది అభ్యర్థులు ఉన్నందున లెక్కించేందుకు కొంచెం ఎక్కువ సమయం పడు తుందని చెప్పారు. ఖమ్మం నియోజకవర్గంలో 25 రౌండ్లు, పాలేరులో 20, మధిరలో 19, వైరాలో 18, సత్తుపల్లిలో 20 రౌండ్లు ఉంటాయి. మొత్తం 14టేబుల్స్ కాగా ప్రతి అరగంటకు ఒక టేబుల్ ఫలితం విడుదల చేయనున్నారు.

భద్రాద్రి జిల్లాలో 82 రౌండ్లు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వరావుపేట, భద్రాచలం, కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఓట్లు లెక్కింపు 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఒక్కొక్క టేబుల్‌కు 14 పోలింగ్ స్టేషన్లు కేటాయించారు. వాటి పర్యవేక్షణకు 18 బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్‌ను నియమించారు. ఓట్ల లెక్కింపును వీక్షించేందుకు కళాశాల ఆవరణలో ఎల్ఈడి టీవీని ఏర్పాటు చేశారు.

క్రాస్ ఓటింగ్ ముంచేదెవర్నో?

కొన్ని చోట్ల బీజేపీ ఓటింగ్ బీఆర్‌ఎస్‌వైపు

మరికొన్ని చోట్ల బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి

కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు సహకారం

అభ్యర్థుల్లో టెన్షన్..టెన్షన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

క్రాస్ ఓటింగ్ భయం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలను కలవరపెడుతున్నది. తాము గెలవకున్నా పర్వాలేదు గానీ..తమ రాజకీయ ప్రత్యర్థుల్లో తమకు ఎక్కువ నష్టం చేకూర్చే వారిని ఓడగొట్టేందుకు తమ అనుచరులతోనే క్రాస్ ఓటింగ్ చేయించారనే చర్చ జోరుగా నడుస్తున్నది. ఒక్కో చోట ఒక్కోలా దారిమళ్లిన సైలెంట్ ఓటింగ్ ఎటు మళ్లిందనే దానిపై నేతలు ఆరా తీస్తున్నారు. అంతిమంగా అది ముంచేదెవర్నో అన్నది నేతెలెవ్వరికీ అంతుచిక్కడం లేదు. ఆ క్రాస్ ఓటింగ్‌తో గెలుస్తామని ధీమాతో ఉన్న అభ్యర్థులను ఓడగొట్టే ప్రమాదముంది. దీనిపై మరింత స్పష్టత రావాలంటే ఆదివారం మధ్యాహ్నం వరకు వేచిచూడాల్సిందే. అయితే, నేతలు మాత్రం అప్పటిదాకా టెన్షన్ తట్టుకోలేక పోలింగ్ సరళిపైనా, బూత్‌లవారీగా మహిళలు, వృద్ధులు, యువతీయువకుల వారీగా, సామాజిక తరగతుల వారీగా ఓట్లు ఎటు పోలయ్యాయనే అంశంపై బూత్‌ల వారీగా ఆరా తీస్తున్నారు. నల్లగొండ జిల్లాలో మూడు, నాలుగు నియోజకవర్గాల్లో బీజేపీ ఓటింగ్ బీఆర్‌ఎస్ వైపు మళ్లిందనే చర్చ నడుస్తున్నది. ఎన్నికల ముందు రోజు, పోలింగ్ నాడు పలు నియోజకవర్గాల్లో బీజేపీ నేతలు పోల్ మేనేజ్‌మెంట్‌లో అంత చురుగ్గా ఉండకపోవడమనేది ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తున్నది. అదే సమయంలో బీజేపీలోని కొంత ఓటింగ్ రాజగోపాల్‌రెడ్డికి కూడా మళ్లినట్టు చర్చ నడుస్తున్నది. వేవ్ ఉన్న నేపథ్యంలో తామే గెలుస్తామని కాంగ్రెస్ నేతలు బల్లగుద్ది చెబుతున్నారు.

అదే సమయంలో చివరి రెండు గంటల్లో జరిగిన పోలింగ్ తమను గట్టెక్కిస్తుందన్న ధీమాలో బీఆర్‌ఎస్ నేతలున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిని ఓడగొట్టేందుకు బీఆర్‌ఎస్-బీజేపీ ఒక్కటయ్యాయనీ, అక్కడ కొన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఓటర్లు సైలెంట్‌గా బీజేపీ అభ్యర్థి ఆచారికి ఓటేసారనే చర్చ నడుస్తున్నది. కొన్ని నియోజకవర్గాల్లో పార్టీల వారీగా కాకుండా అభ్యర్థుల వారిగా కూడా క్రాస్ ఓటింగ్ నడిచినట్టు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఓడగొట్టేందుకు సొంతపార్టీ వాళ్లే కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డికి ఓట్లు వేయించారనీ, గతంలో పార్టీలో ఉన్నారనే సానుభూతితో బీజేపీకి చెందిన ఓటర్లు కొందరు కాంగ్రెస్‌కు ఓటేశారనే ప్రచారం జోరుగా నడుస్తున్నది. భువనగిరి నియోజకవర్గంలో బీజేపీ ఓట్లు బీఆర్‌ఎస్‌కు మళ్లినట్టు తెలుస్తున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ-కాంగ్రెస్-బీఆర్‌ఎస్ మధ్య త్రిముఖ పోరు జరగ్గా..అన్ని నియోజకవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఆ జిల్లాల్లోనూ క్రాస్ ఓటింగ్ ఎవరి కొంప ముంచితున్నదనేది అంతు చిక్కట్లేదు. మెదక్ జిల్లాలో ఎక్కువ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీజేపీ అభ్యర్థులు సహకరించినట్టు ప్రచారం జరుగుతున్నది. రంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఖమ్మం జిల్లాల్లోనూ పలు నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి.

బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే..

వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేననే విషయాన్ని ప్రజలు నమ్మారని వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో ఆమె విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. కేసీఆర్‌కు సూట్ కేసు సర్దుకునే టైం వచ్చిందన్నారు. బైబై కేసీఆర్ అంటూ ఎద్దేవా చేశారు. 2018, 2023 ఎన్నికల్లో కేవలం పదివేల తేడాతో గెలిచిన ఎమ్మెల్యేలు 33 మందైతే..కర్నాటక ఎన్నికల్లో 71 మంది ఉన్నారని గుర్తు చేశారు. పదివేల మెజార్టీ కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. కేసీఆర్‌ను ఓడించాలనే కాంగ్రెస్‌కు మద్దతిచ్చామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య ఉన్న లోపాయి కారి ఒప్పందం ఫలితంగానే కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఆయన్ను మించిన రాజకీయ అవినీతి పరుడు లేడంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. ప్రతీ పథకం వెనుక అవినీతి ఉందని మోడీ చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. 2014, 2018లో 45 మందిని ఎమ్మెల్యేలను కేసీఆర్ కొన్నాడనీ, అలాంటి రాజకీయాలు రిపీట్ కాకుండా ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీలో విశ్వసనీయత కలిగిన వారు ఎందరో ఉన్నారని చెప్పారు. ఎవరు ముఖ్యమంత్రికావాలన్నది ఆ పార్టీయే నిర్ణయిస్తుందని చెప్పారు.

కూడికలు తీసివేతల్లో నేతలు

గెలుపుపై ఎవరి ధీమా వారిదే.. • విజయోత్సవ ర్యాలీ ఏర్పాట్లలో అభ్యర్థులు

శాసనసభ ఎన్నికల పోలింగ్ సరళిపై అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల అభ్యర్థులు గెలుపుపై ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. తమకు ఏ పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు పడతాయనే దానిపై విశ్లేషిస్తున్నారు. కాగా కౌంటింగ్‌కు సమయం దగ్గరపడుతుండటంతో అభ్యర్థుల్లో టెన్షన్ పెరుగుతోంది. కూడికలు, తీసివేతలతో బిజీబిజీగా గడుపుతున్నారు.

నవతెలంగాణ-సూర్యాపేట

సూర్యాపేట జిల్లాలో గతంలో కంటే ఈసారి ఎన్నికల్లో 4 శాసనసభ నియోజకవర్గాల్లో కొన్నిచోట్ల పోలింగ్‌శాతం పెరగ్గా, ఇంకొన్ని చోట్ల తగ్గింది. ఈసారి జిల్లాలో 85.99 శాతం పోలింగ్ నమోదైంది. సూర్యాపేట నియోజకవర్గంలో గతంకంటే 3 శాతం పోలింగ్ తగ్గింది. ప్రతి ఎన్నికలోనూ ఇక్కడ అభ్యర్థుల గెలుపోటములను పట్టణ ఓటర్లే నిర్ణయిస్తారు. పట్టణంలో భారీగా ఓట్లు పోల్ కావడంతో అవి ఏ పార్టీ వైపు పడ్డాయనే ఆందోళన అభ్యర్థులో నెలకొంది. ఎన్నికల ముందు పట్టణ ఓటర్లపై బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు దృష్టిసారించారు. ఇరువురూ పోటీపడి ఓటర్లకు భారీగా తాయిలాలు చేరవేశారు. ఒకరకంగా వీరిద్దరి మధ్య డబ్బుల పంపిణీలో నువ్వా నేనా అనే రీతిలో పోటీ నడిచింది. ఉదయం సమయంలో బీఆర్‌ఎస్, బీజేపీవైపు ఓట్లు పడినా.. సాయంత్రానికి కొంత కాంగ్రెస్ వైపు మొగ్గుచూపినట్టు విశ్లేషకులు అంటున్నారు. ఈ క్రమంలో అభ్యర్థుల గెలుపోటములపై రకరకాలుగా అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే పోరు నడిచిందని, మరి కొంతమంది మాత్రం బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్యనే పోటీ ఉందని అంటున్నారు. వీరిలో పట్టణంలో ఎవరికి ఎక్కువగా ఓట్లు పడతాయో వారే విజేత అని పలు కూడళ్లలో చర్చించుకుంటున్నారు.

కాగా బీఎస్పీ అభ్యర్థి ఎవరి ఓట్లను చీల్చాడో అనే టెన్షన్ ప్రధాన అభ్యర్థుల్లో నెలకొంది. కాగా పట్టణంలో సైలెంట్‌గా కాంగ్రెస్‌కే ఓట్లు పడ్డాయని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి జగదీశ్‌రెడ్డి మాత్రం 25 వేల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్‌రెడ్డి కూడా విజయంపై ధీమాతో ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావు విజయం ఖాయమైందని, విజయోత్సవ ర్యాలీ ఉన్నదని పేర్కొంటూ ఆయన అనుచరులు వాట్సాప్, ఫేస్‌బుక్‌లో పోస్టింగులు పెట్టారు. పట్టణంలో పోలింగ్ శాతం పెరిగిందని అది తనకి అనుకూలమని సంకినేని గట్టి నమ్మకంతో ఉన్నారు. ఇకపోతే పట్టణంలో ఎవరికి ఎన్ని ఓట్లు, ఏ విధంగా, ఏ రకంగా పడి ఉంటాయో అనే దానిపై బేరీజు వేసుకుంటున్నారు. నేడు ఓట్ల లెక్కింపుతో 'సూర్యాపేట బాదుషా' ఎవరనేది తేలనున్నది.

తేలనున్న జాతకాలు

నవతెలంగాణ-ఏటూరు నాగారం ఐటీడీఏ

రెండు నెలలుగా హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల సమరంలో నేటితో ఉత్కంఠకు తెర పడనుంది. ఎవరిబలం ఎంతా అనేది ఆది వారం తేలనుంది. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మధ్యనే రసవత్తరంగా కౌంటింగ్ నడవనుంది. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపాన గల భవనంలో ఎమ్మెల్యే ఓటర్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు ప్రారంభం కానుంది. ములుగు నియోజకవర్గ వ్యాప్తంగా 9 మండలాల్లో 303 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ములుగులో సాధారణ ఎన్నికల షెడ్యూల్ మొదలైన నాటి నుంచి ఎన్నికల సమరాన్ని కొనసాగించిన పార్టీలు పోటా పోటీగా ప్రచారాలు, సమావేశాలు, సభలు నిర్వహించాయి. పంపకాల్లో తేడా రావడంతో ఓటర్లు తిక మకపడ్డారు. ఓటు ఎవరికి వేయాలనే సందిగ్ధంలో పడ్డారు. చివరికి డబ్బులు పంచేవారి ఇండ్లలోకి వెళ్లి మాకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీసిన సంఘటనలు ఉన్నాయి. దీంతో కొంతమంది ఓటు వేయకుం డానే ఇండ్లలోనే ఉన్నట్టు తెలిసింది.

మరికొంతమంది పక్కవాడికి ఇచ్చి తనకు ఇవ్వకపోవడంతో వేరే పార్టీకి ఓట్లు వేసినట్టు తెలుస్తోంది. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్య తీవ్రమైన పోటీ ఉండనుంది. బీజేపీ కమలం వికసించలేదు. ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపినట్లు కనబడలేదు. పార్టీ అభ్యర్థికి ఆలస్యంగా టికెట్ కేటాయించడంతో గ్రామాల్లో పెద్దగా ప్రచారం కూడా కొనసాగలేదు.

గెలుపు బీఆర్‌ఎస్‌దే..హాట్రిక్ సీఎం కేసీఆరే : దాసోజు


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్‌ఎస్ పార్టీ 70కిపైగా సీట్లను గెలిచి అధికారంలోకి రాబోతున్నదనీ, కేసీఆర్ వరుసగా మూడోసారి సీఎం కాబోతున్నారని బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ తెలిపారు. శనివారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పెయిడ్ ఎగ్జిట్ పోల్స్‌తో కాంగ్రెస్ శాడిస్టిక్ ఆనందం పొందుతున్నదని విమర్శించారు. అవుట్ అఫ్ టర్మ్‌లో కాంట్రాక్టర్లకు కమీషన్ల కోసం ఆరువేల కోట్ల రూపాయలు బిల్లులు ఇప్పించారని ఈసీకి కాంగ్రెస్ లేఖ రాయడం చిల్లరతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని విమర్శించారు. కర్నాటక, బెంగుళూరులో ఏ గ్యారెంటీలు అమలు ప్రజలు అతలాకుతలం అవుతున్నారని పేర్కొన్నారు. కర్నాటక, ఏపీ, ఢిల్లీ గద్దలు తెలంగాణను కమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

చివరి అంకం ఆసన్నం..

మధ్యాహ్నం లోపు ఫలితాలు వెల్లడయ్యే అవకాశం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ టౌన్



ఎన్నికల క్రతువులో చివరి అంకమైన లెక్కింపు ప్రక్రియకు సమయం ఆసన్నమైంది. మరికొన్ని గంటల్లో ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. ఇందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఓట్ల లెక్కింపు కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీ కేంద్రంలో లెక్కించనున్నారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు సంబంధించి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పీవీటీజీ బాలికల పాఠశాలలో లెక్కించనున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలకు సంబంధించి మంచిర్యాల జిల్లా ముల్కల్ల ఐజ ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టనున్నారు. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలకు సంబంధించి నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్కింపు చేపట్టనున్నారు. ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఈ క్రతువులో తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

రౌండ్ల వారీగా ఫలితాలు..!

ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఓట్లు లెక్కించ నున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజక వర్గాల ఓట్లు లెక్కించనున్నారు. మంచిర్యాల సమీపంలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల ఓట్లు లెక్కిస్తారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆసిఫాబాద్, సిర్పూర్(టి) నియోజకవర్గాల ఓట్లు లెక్కించడానికి సిద్ధం చేశారు. పోలైన ఓట్లను పరిగణనలోకి తీసుకొని టేబుల్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి 14 నుంచి 20కి పైగా రౌండ్లలో ఫలితాలు వెల్లడించనున్నారు. ఆదిలాబాద్ నియోజక వర్గంలో 14టేబుల్‌లు ఏర్పాటు చేయగా.. 20 రౌండ్లలో లెక్కింపు చేపట్టనున్నారు. బోథ్ లెక్కింపు కోసం 14టేబుల్‌లు ఏర్పాటు చేయగా.. 22రౌండ్లలో లెక్కింపు చేపడుతారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం లెక్కింపు కోసం 14టేబుల్‌లలో 22రౌండ్లు, సిర్పూర్ కోసం 14టేబుల్‌లను 21రౌండ్ల లెక్కింపు చేపడుతున్నారు. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ లెక్కింపు కోసం 14టేబుల్‌లు ఏర్పాటుచేయగా 22 రౌండ్లలో చేపట్టనున్నారు. మంచిర్యాల నియోజకవర్గం లెక్కింపు 21 రౌండ్లలో చేపడుతారు. ఇందుకు 14టేబుల్‌లను ఏర్పాటుచేశారు. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల లెక్కింపు ప్రక్రియను 17రౌండ్లలో చేపట్టనుండగా ఒక్కోదానికి 14టేబుల్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి 11గంటల వరకు తొలి ఫలితం వచ్చే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. మరోపక్క లెక్కింపు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు చేస్తోంది.

హైదరాబాద్‌లోని ఓ కేంద్రం వద్ద కౌంటింగ్ ఏర్పాట్లు...



Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.